www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం	9-11-2024	పేజీలు: 14	వెల (Price) : Rs. 6.50	సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 204

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 10.46 తదుపరి నవమి; నక్షత్రం: శ్రవణం ఉ. 11.48 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: మ. 3.40-5.12; దుర్ముహూర్తం: ఉ. 6.20-7.50; అమృతఘడియలు: రా. 12.56-2.29; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జస్టిస్ చంద్రచూడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సిబల్

మనసు నొప్పించి ఉంటే క్షమించండి

కావాలని ఏమీ చేయలేదు

చివరి రోజున జస్టిస్ చంద్రచూడ్ భావోద్వేగం

సీజేఐకి ఘనంగా వీడ్కోలు పలికిన జడ్జిలు, లాయర్లు

2

జలాలపై జాలీగా.. ఆకాశమే హద్దుగా

నీటిపై నుంచి నింగిలోకి ఎగిరిన సీప్లేన్

సెమీ ట్రయల్ రన్ విజయవంతం

నేడు సీఎం చేతుల మీదుగా ట్రయల్ రన్

సీప్లేన్‌లో బెజవాడ నుంచి శ్రీశైలానికి చంద్రబాబు



బెజవాడ పున్నమిఘాట్ నుంచి బయలుదేరుతున్న సీప్లేన్

శ్రీశైలం/విజయవాడ నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగానికి ఊపు తెచ్చేందుకు రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న సీప్లేన్ సర్వీస్‌కు శుక్రవారం నిర్వహించిన సెమీ ట్రయల్ రన్ విజయవంతమైంది. విజయవాడ ఇంద్రకీలాద్రి, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాల మధ్య టెంపుల్ టూరిజానికి మరింత ఆకర్షణ, ఆదరణ తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం సీప్లేన్ సేవలకు శ్రీకారం చుట్టనుంది. 'స్కై మీట్స్ సీ' పేరుతో విజయవాడ-శ్రీశైలం మధ్య ప్రయోగాత్మకంగా చేపడుతున్న సీప్లేన్ సర్వీసుకు సంబంధించిన డెమో కార్యక్రమాన్ని (ట్రయల్ రన్) ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రారంభిస్తారు. దీనికోసం శుక్రవారం ముందుగానే సెమీ ట్రయల్ రన్ నిర్వహించారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి బయల్దేరిన సీ ప్లేన్ రెండున్నర గంటల్లో శ్రీశైలానికి చేరుకుంది. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో సెమీ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. కాగా, శనివారం నిర్వహించే ట్రయల్ రన్ సందర్భంగా సీఎం చంద్రబాబు సీప్లేన్‌లో విజయవాడ నుంచి శ్రీశైలం చేరుకుంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో

మిగతా 14వ పేజీలో...

కోరలు పీకండి!

సోషల్ సైకోలపై సీఎం నిర్దేశం

డీజీపీ, నిఘా చీఫ్‌లతో సమావేశం

ఉపేక్షిస్తే రాష్ట్రానికే తీవ్ర ముప్పని స్పష్టీకరణ

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఊరుకోవద్దని విస్పష్ట ఆదేశాలు

ఇప్పటికే మూలాలు గుర్తించాం.. చర్యలు మొదలయ్యాయి

త్వరలోనే కూకటి వేళ్లతో పెకలిస్తాం

రాష్ట్రవ్యాప్తంగా యాగీకి వైసీపీ కుట్ర

నిరసనల పేరుతో రచ్చ చేసేలా ప్రణాళిక


సీఎంకు వెల్లడించిన డీజీపీ, నిఘా బాస్!



డీజీపీ ద్వారకా తిరుమలరావు



ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్‌చంద్ర లడ్హా



అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): "విషపు నాగుల కోరలు పీకేయండి. ప్రజలకు వాస్తవాలు తెలియాలి.. ఆ బాధ్యత మేం తీసుకుంటాం. ఎక్కడా వెనుకడుగు వేయద్దు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేస్తే ఏ స్థాయి వ్యక్తులైనా వదిలి పెట్టొద్దని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షం సాగిస్తున్న దుష్ప్రచారం, దానిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్హాలతో ముఖ్యమంత్రి సమీక్షించారు. అరెస్టులు, కౌన్సెలింగ్, నోటీసుల దెబ్బకు 'సోషల్ సైకో'లు బెంబేలెత్తుతున్నారని పోలీసు ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలిసింది. అదే సమయంలో...

మిగతా 14వ పేజీలో...

వర్రా ఎక్కడ?

పట్టుకున్నారా... మళ్లీ పారిపోయాడా?

అరెస్టును ధ్రువీకరించని పోలీసులు

హైదరాబాద్ వెళ్తున్నట్లు గుర్తించాం..

అతడి సెల్‌ఫోన్ ట్రాక్ చేశాం

ఫోన్ ఆఫ్ చేయడంతో జస్ట్ మిస్: డీజీపీ



కర్నూలు/కడప/అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలపై సోషల్ మీడియాలో కాలకూట విషం చిమ్మిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త, జగన్ సతీమణి భారతి పీఏ, ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి ఎక్కడ? పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారా? లేక... మరోసారి మస్కా కొట్టి తప్పించుకున్నాడా? దీనిపై పలు రకాలుగా ప్రచారం

మిగతా 12వ పేజీలో...

సీఎం చంద్రబాబుపై అసభ్య పోస్టులు 13

'అనంత'లో వైసీపీ కార్యకర్త అరెస్ట్



గ్రామాల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు

ఎక్కువ మంది విద్యార్థులున్నచోట ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

వచ్చే ఏడాది నుంచి పక్కాగా 'శనివారం నో బ్యాగ్ డే'

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే డీఎస్సీ పూర్తి

నెలాఖరుకు జీవో 117కు ప్రత్యామ్నాయంపై నిర్ణయం

ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్య డైరెక్టర్ చర్చలు

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎక్కువ మంది ఉన్న గ్రామాల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన చర్చల్లో ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఈ విషయాన్ని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి శనివారాన్ని నో బ్యాగ్ డేగా ప్రకటించి, పటిష్ఠంగా అమలుచేస్తామన్నారు. 6, 7, 8 తరగతుల్లో

మిగతా 14వ పేజీలో...

'భూ'చోళ్ల పనిపడతాం

రెవెన్యూ అక్రమార్కులపై త్వరలో విచారణ

జాబితాలో 18 మంది డిప్యూటీ కలెక్టర్లు, 46 మంది తహసీల్దార్లు, 68 మంది సర్వేయర్లు

గత ప్రభుత్వంలో భారీగా భూ అక్రమాలు

వైసీపీ నేతలతో కుమ్మక్కు.. రికార్డుల తారుమారు

రీ సర్వే ముసుగులోనూ అడ్డగోలు వ్యవహారం

విలువైన ప్రభుత్వ భూములు పరాధీనం

కూటమి సర్కారుకు 3 లక్షలకు పైగా ఫిర్యాదులు

నివేదికల ఆధారంగా జిల్లాలవారీగా విచారణ

ఏసీబీతోనా, విజిలెన్స్‌తోనా అన్నది త్వరలో నిర్ణయం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు హయాంలో కబ్జాకోరులు, భూ ఆక్రమణదారులు, ల్యాండ్ మాఫియాతో అంటకాగి విలువైన ప్రభుత్వ భూములను పరాధీనం చేసిన రెవెన్యూ అధికారులపై కూటమి సర్కారు దృష్టి సారించింది. జిల్లాల వారీగా అందిన నివేదికలను నిశితంగా పరిశీలిస్తోంది. ఆర్డీవోలుగా పనిచేసిన 18 మంది డిప్యూటీ కలెక్టర్లు, 46 మంది తహసీల్దార్లు, 68 మంది సర్వేయర్లపై ఇప్పటి దాకా వచ్చిన ఫిర్యాదులపై జిల్లాల వారీగా విచారణ చేయించనుంది. విచారణ ఏసీబీకి అప్పగిస్తారా? లేదా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఇస్తారా? అన్నది త్వరలో తేలనుంది. తొలుత శాఖాపరమైన

మిగతా 13వ పేజీలో...

భూ మార్పిడి పేరుతో 100 కోట్ల దోపిడీ

ద్వారంపూడి మేనమామపై ఎమ్మెల్యే వనమాడి ఆరోపణ 12

కబ్జా భూముల్లో కేతిరెడ్డి కోట

కళ్ల ముందే కనిపిస్తున్నా ఐదేళ్లూ కళ్లు మూసుకున్నారు

అప్పుల 'మామయ్య'!

విద్యార్థులకు జగన్ సర్కారు బకాయిలు రూ.5 వేల కోట్లు



ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనకు 3,500 కోట్లు

స్టూడెంట్ కిట్లకు 920 కోట్లు

యూనిఫాం కుట్టుకూలి 195 కోట్లు

గుడ్లు, చిక్కీలకు 178 కోట్లు

అప్పుల కుప్పగా విద్యా శాఖ

కొత్త ప్రభుత్వానికి బకాయిల భారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా మేనమామలు చిన్నారులకు కానుకలు ఇస్తుంటారు. విద్యార్థులకు మేనమామనంటూ పదేపదే చెప్పిన జగన్ మాత్రం సీఎం పదవి నుంచి దిగిపోతూ వారికి 5 వేల కోట్లు బకాయిలు పెట్టారు. జగనన్న గోరుముద్ద... అంతర్జాతీయ స్థాయి విద్య... కార్పొరేట్ బదులకంటే మెరుగ్గా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతామని గొప్పలకు పోయిన జగన్ చివరకు విద్యా శాఖను అప్పుల కుప్పగా మార్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు హాస్టల్ ఖర్చులకు ఇచ్చే వసతి దీవెన డబ్బులు ఇవ్వలేదు. బడి పిల్లలకు ఇచ్చే స్టూడెంట్ కిట్లకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. విద్యార్థుల తల్లిదండ్రులకు యూనిఫాం కుట్టుకూలి ఖర్చులు ఎగ్గొట్టారు. చివరికి మధ్యాహ్న భోజనంలో గుడ్లు, చిక్కీల బిల్లులు కూడా చెల్లించలేదు. జగన్ ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో చదువులు పూర్తయినా విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేని దుస్థితి ఏర్పడింది. మరోవైపు ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు కూటమి ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారాయి. మొత్తానికి జగన్ ప్రభుత్వం ఉన్నత విద్యను అస్తవ్యస్తం చేసింది. ముఖ్యంగా ఫీజులను కాలేజీల ఖాతాలకు కాకుండా తల్లిదండ్రుల ఖాతాలకు వేసే విధానం తెచ్చి విద్యార్థులకు చుక్కలు చూపించింది. మూడు నాలుగు క్వార్టర్ల ఫీజులు బకాయిలు పెడుతూ వచ్చింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు... ప్రభుత్వం విడుదల చేయకపోయినా తమ ఫీజులు కట్టాలంటూ విద్యార్థులను

మిగతా 13వ పేజీలో...



'సుపారీ' సొమ్ము ఇప్పించండి!

ఇస్తామన్నది ఇంకా చెల్లించలేదు

పోలీసు స్టేషన్‌లో 'కాంట్రాక్టు కిల్లర్' ఫిర్యాదు

యూపీలో ఓ మహిళా న్యాయవాది హత్య కేసులో మలుపు

అత్తింటివారే సుపారీ ఇచ్చినట్లు వెల్లడి

2

సీఎం కోసం తెచ్చిన సమోసాలు

పోయాయ్!

సీఐడీ దర్యాప్తునకు ఆదేశం 2

హిమాచల్‌లో రాజకీయ రగడ



ఎన్నాళ్లకెన్నాళ్లకు

ప్రాజెక్టులకు 10,170 కోట్లు



ఆర్థిక శాఖ అంగీకారం

గత ఐదేళ్లలో నిధులివ్వక రూ.38,242 కోట్ల పనులు పెండింగ్

ఇందులో 18,480 కోట్లు ఇవ్వాలని జలవనరుల శాఖ తుది ప్రతిపాదనలు

ఈ ఐదు నెలలకు 10,170 కోట్లు సర్దుకోవాలని ఆర్థిక శాఖ సూచన

వచ్చే బడ్జెట్‌లో పెంచుతామని హామీ

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.10,170 కోట్లు కేటాయించేందుకు ఆర్థిక శాఖ సమ్మతించింది. పోలవరం, గాలేరు-నగరి, చింతలపూడి సహా వివిధ ప్రాజెక్టులకు 18,480 కోట్లు కేటాయించాలని జలవనరుల శాఖ

మిగతా 14వ పేజీలో...

డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ 3

సూత్రప్రాయంగా జల సంఘం ఓకే



అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే

రాజీనామా చేయాలి

జగన్, వైసీపీ ఎమ్మెల్యేలకు షర్మిల హితవు 13

ఏపీలోనూ కుల గణన చేపట్టాలని డిమాండ్

బీసీలను ఓటు యంత్రాలుగా చూస్తున్నారని ధ్వజం

పూరీ, కేదార్‌నాథ్‌నూ

ప్రత్యేక రాష్ట్రాలు చేయమంటారా?



కేఏ పాల్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం

తిరుపతిని కేంద్ర పాలిత ప్రాంతం చేయాలన్న పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతిని కేంద్రపాలిత ప్రాంతం చేయాలన్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. ఇలాగైతే కేదార్‌నాథ్, పూరీ సహా అన్ని దేవాలయాలు, పుణ్యక్షేత్రాలను ప్రత్యేక రాష్ట్రాలుగా చేయమంటారా అని నిలదీసింది. తిరుమల తిరుపతిని కేంద్ర పాలిత ప్రాంతం చేయాలని.. టీటీడీకి స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని.. తిరుమల లడ్డూ కల్తీపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ పాల్ గత నెలలో పిటిషన్

మిగతా 2వ పేజీలో...

అలీగఢ్.. సెంట్రల్ యూనివర్సిటీ కాదు

మైనారిటీ హోదా ఇచ్చే అంశంపై కొత్త ధర్మాసనం విచారణ జరపాలి

విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకునే హక్కు మత, భాషా మైనారిటీలకుంది

4:3 మెజారిటీతో సుప్రీంకోర్టు తీర్పు

2

కాంగ్రెస్ కుల క్రీడ!

ఒకరిపై మరొకరిని ఉసిగొల్పుతోంది: మోదీ

- దళితులు, ఓబీసీలు, గిరిజనుల అభ్యున్నతి ఆ పార్టీకి ఇష్టం లేదు
- వారి ఐక్యతను దెబ్బతీయడమే కాంగ్రెస్ 'యువరాజు' పని
- ఆ పార్టీ పరాన్నజీవిగా మారింది
- మహారాష్ట్ర ప్రచారంలో ప్రధాని మోదీ



నాసిక్, నవంబరు 8: భారతీయ సమాజాన్ని కులాల పేరిట చీల్చాలని కాంగ్రెస్ చూస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం ఒక కులాన్ని మరో కులంపైకి ఉసిగొల్పుతూ ప్రమాదకర క్రీడ ఆడుతోందని మండిపడ్డారు. జాతి మొత్తం హెచ్చరికగా ఉండాలని.. అన్ని వర్గాలు ఐకమత్యంగా ఉంటేనే భద్రత ఉంటుందని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ధూలే, నాసిక్ సభల్లో ప్రసంగించారు. రాష్ట్రంలో ఇవే ఆయన మొదటి ర్యాలీలు. కులగణన చేపట్టాలంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేస్తున్న డిమాండ్‌ను ప్రస్తావిస్తూ.. ఎస్సీ, ఎస్టీలు, బీసీల ఐక్యతను చెడగొట్టడమే ఆ పార్టీ ప్రధాన ఎజెండా అని మోదీ విమర్శించారు. 'గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టాలన్నది కాంగ్రెస్ ఎజెండా. మతపరమైన గ్రూపులతో కలిసి గతంలో ఈ కుట్ర పన్నినప్పుడు దేశ విభజనకు దారితీసింది. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఒకరిపై మరొకరిని రెచ్చగొడుతోంది. దళితులు, బీసీలు, గిరిజనుల పురోగతి దానికి ఇష్టం ఉండదు. అందుకే కులాలవారీగా వారిని విభజించాలని చూస్తోంది. ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు బలహీనంగా ఉండాలన్నదే దాని ఉద్దేశం. నెహ్రూ కాలం నుంచీ కాంగ్రెస్, ఆయన కుటుంబం రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయి. గాంధీ-నెహ్రూ కుటుంబ నాలుగో తరం యువరాజు (రాహుల్) కూడా ఈ దిశగానే పనిచేస్తున్నారు. మనందరం ఒక్కటిగా ఉంటేనే భద్రంగా ఉంటాం (ఏక్ హై తో సేఫ్ హై)' అని నినదించారు. కాంగ్రెస్ పరాన్నజీవిగా మారిందన్నారు. ఊతకర్రలపై నడుస్తోందని చెప్పారు. మహారాష్ట్ర, యూపీ, బిహార్, జార్ఖండ్ సహా పలు రాష్ట్రాల్లో మిత్రపక్షాల మద్దతుంటే తప్ప పోరాడలేని పరిస్థితిలో ఉందన్నారు. కాగా, తన ప్రభుత్వ హయాంలో పదేళ్లలో దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తి చేశామన్నారు.

ఎంవీఏలో కుర్చీలాట!

కాంగ్రెస్, ఎన్‌సీపీ(శరద్ పవార్), ఉద్ధవ్ శివసేనలతో కూడిన మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో సీఎం కుర్చీ కోసం అంతర్గత పోరాటం జరుగుతోందని మోదీ అన్నారు. ఎంవీఏ బండికి చక్రాలు గానీ, బ్రేకులు గానీ లేవని.. అందులోని ప్రతి పార్టీ డ్రైవర్ సీటులో కూర్చోవాలని తహతహలాడుతోందని ఎద్దేవాచేశారు. వచ్చే ఐదేళ్లలో మహారాష్ట్రలో అభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుతుందని.. బీజేపీ సారథ్యంలోని మహాయుతి ప్రభుత్వం మాత్రమే సత్పరిపాలన అందించగలదని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణను రద్దుచేశామని చెప్పారు. కానీ, ఇండీ కూటమి భారత రాజ్యాంగాన్ని కశ్మీరులో లేకుండా చేయాలని చూస్తోందని.. ప్రపంచంలో ఏ శక్తీ ఆ అధికరణను పునరుద్ధరించజాలదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఎజెండాను ప్రోత్సహించవద్దని.. వేర్పాటువాదుల భాష మాట్లాడవద్దని ఆ కూటమి పార్టీలను మోదీ కోరారు. ప్రజల ఆశీర్వాదం తనకున్నంత వరకు ఆ పార్టీల ఎజెండా నెరవేరదన్నారు.


మతాల మధ్య మోదీ గోడలు

- మత ప్రాతిపదికన దేశాన్ని చీల్చే కుట్ర
- మణిపూరే అందుకు నిదర్శనం: రాహుల్



లోహర్‌డగా, సిండెగా, నవంబరు 8: దేశంలో ప్రజల్ని మత ప్రాతిపదికన చీల్చాలని మోదీ ప్రయత్నిస్తున్నారని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. మణిపూర్ తగలబడటానికి అదే కారణమని ఆరోపించారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం లోహర్‌గడా, సిండెగాలలో చేపట్టిన ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ వైఖరి వల్ల దేశంలో 90శాతం ప్రజలు వారి హక్కుల్ని, ప్రయోజనాలని కోల్పోయారని విమర్శించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కుల మధ్య బీజేపీ వైరం సృష్టించాలనుకుంటోందని ఆరోపించారు. "దేశాన్ని ఒక్కటి చేయడం కోసమే నేను 4వేల కి.మీల పాదయాత్ర చేశాను. 90శాతం జనాభా కలిగిన ఆదివాసీలు, దళితులు, ఓబీసీల కోసం గొంతెత్తాను. కానీ నేను దేశాన్ని విడగొట్టాలని చూస్తున్నానని బీజేపీ విమర్శిస్తోంది. వెనుకబడిన వర్గాల హక్కుల పోరాడటం తప్పే అయితే ఆ తప్పునే నేను కొనసాగిస్తా"నని చెప్పారు. బీజేపీ... నీటిని, భూమిని, అడవిని(జల్, జంగల్, జమీన్) ఆదివాసీల నుంచి దూరం చేయాలని చూస్తోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని నాశనం చేయాలనకుంటున్న ఎన్డీఏ కూటమికి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనుకుంటున్న ఇండియా కూటమికి మధ్యనే ఎన్నికల్లో పోటీ అని పిలుపునిచ్చారు. బలహీనవర్గాల ప్రజల పరిస్థితి మెరుగుపడటం కోసం, దేశాభివృద్ధి కోసం కులగణన అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కాగా, నోట్ల రద్దు నిర్ణయం వల్ల దేశంలో మధ్యతరహా పరిశ్రమలతో పాటు అసంఘటిత రంగం కుదేలైందని తద్వారా గుత్తాధిపత్యానికి దారి తీసిందని రాహుల్ విమర్శించారు. నోట్ల రద్దు చేసిన శుక్రవారానికి 8 ఏళ్లు పూర్తైంది.

లోకం తీరు



హైదరాబాద్‌లో ట్రంప్ టవర్లు

మాదాపూర్‌లోని ఖానామెట్‌లో నిర్మాణం

న్యూఢిల్లీ, నవంబరు 8: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌కు చెందిన నిర్మాణ సంస్థ తెలంగాణలోనూ అడుగు పెడుతోంది. హైదరాబాద్‌లో ట్రంప్ టవర్లను నిర్మించనుంది. భారత్‌లో ఇప్పటికే నాలుగు నగరాలు ముంబై, కోల్‌కతా, గుర్గావ్, పుణెల్లో ట్రంప్ టవర్స్ నిర్మించిన ఆ సంస్థ.. తాజాగా మరో ఆరు టవర్లను నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్‌తోపాటు నోయిడా, బెంగళూరుతోపాటు పుణెలో మరో టవర్‌ను నిర్మించనుంది. దీంతో భారత్‌లో ట్రంప్ టవర్ల సంఖ్య 10కి చేరనుంది. తద్వారా అమెరికా బయట అత్యధికంగా ట్రంప్ టవర్లు భారత్‌లోనే ఏర్పాటు కానున్నాయి. కాగా, హైదరాబాద్‌లో స్థానిక మంజీరా గ్రూప్‌తో కలిసి జంట టవర్లు నిర్మించే యోచనలో ట్రంప్ నిర్మాణ సంస్థ ఉంది. ఇందుకోసం 2022లోనే మాదాపూర్‌లోని ఖానామెట్‌లో 2.92 ఎకరాల భూమిని హెచ్ఎండీఏ వేలంలో కొనుగోలు చేసింది. 27 అంతస్తుల్లో నాలుగు బెడ్‌రూంలు, ఐదు బెడ్‌రూంల అపార్టుమెంట్లతో నిర్మించనున్నారు. నాలుగు బెడ్‌రూంల అపార్టుమెంట్ల విస్తీర్ణం 4వేల నుంచి 5వేల చదరపు అడుగులు, ఐదు బెడ్‌రూంల అపార్టుమెంట్ల విస్తీర్ణం 6వేల చదరపు అడుగులు ఉండనున్నట్లు తెలుస్తోంది. చదరపు అడుగుకు రూ.13 వేలుగా ధరను నిర్ణయించాలని అప్పట్లో భావించారు. నాటి లెక్క ప్రకారమే నాలుగు బెడ్‌రూంల అపార్టుమెంట్ ధర రూ.5.5 కోట్లు కానుంది. ఇక ఇతర నగరాల్లో ట్రిబెకా డెవలపర్స్‌తో కలిసి నిర్మించే టవర్లలో అపార్టుమెంట్లే కాకుండా.. ఆఫీసులు, విల్లాలు, గోల్ఫ్ కోర్సులు ఉండనున్నాయి.

ట్రంప్ గెలిచారు.. అమెరికాలో ఉండలేను!

- ఎలాన్ మస్క్ కూతురి ఆవేదన..



వాషింగ్టన్, నవంబరు 8: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలవడంతో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఖుషీ ఖుషీగా ఉండగా.. ఆయన కూతురు వివియన్ జెన్నా విల్సన్ మాత్రం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తనకు అమెరికాలో భవిష్యత్తు కనిపించట్లేదని.. దేశాన్ని వీడాలనుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం థ్రెడ్స్ వేదికగా వెల్లడించారు. ఎలాన్ మస్క్‌కు మొదటి భార్య ద్వారా కలిగిన ఆరుగురి సంతానంలో వివియన్ విల్సన్ ఒకరు.. అయితే అబ్బాయిగా పుట్టిన వివియన్.. 18 ఏళ్ల వయసు (2022)లో తండ్రిని ఎదిరించి లింగ మార్పిడి చేయించుకొని అమ్మాయిగా మారారు. తాజాగా ట్రంప్ గెలుపుతో అమెరికాలో తన లాంటి ట్రాన్స్‌జెండర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆమె వాపోయారు. 'కొన్నాళ్లుగా దేని గురించైతే బాధపడుతున్నానో అదే జరిగింది. అమెరికాలో నాకు భవిష్యత్తు కనిపించట్లేదు. ఆయన (ట్రంప్) పదవిలో నాలుగేళ్లే ఉండనున్నప్పటికీ.. లింగమార్పిడి వ్యతిరేక నిబంధనలు ఒక్కసారిగా అమల్లోకి రాకపోయినా.. వాటిని కావాలని ఓటేసిన వారు అంత తొందరగా మారరుగా..' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

వయనాడ్‌లో రాష్ట్రేతరులదే హవా!

ఉప ఎన్నిక బరిలో 16 మంది అభ్యర్థులు

- వారిలో 11 మంది బయటి రాష్ట్రాల వారే
- ఏపీ, తెలంగాణ నుంచీ ఒక్కొక్కరు పోటీ

వయనాడ్, నవంబరు 8: వయనాడ్ ఎంపీ స్థానానికి ఈ నెల 13న జరగనున్న ఉప ఎన్నికలో పోటీ పడుతున్న 16 మంది అభ్యర్థుల్లో ఏకంగా 11 మంది రాష్ట్రేతరులే కావడం విశేషం. వీరిలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎన్నికల అరంగేట్రం చేస్తున్నారు. ప్రధాని మోదీ, ఏబీ వాజపేయి, మన్మోహన్ సింగ్, పీవీ నరసింహారావు సహా ఎందరో అగ్రనేతలపై 200కు పైగా ఎన్నికల్లో పోటీచేసి 'ఎలక్షన్ కింగ్'గా పేరొందిన కె.పద్మరాజన్(తమిళనాడు) కూడా బరిలో నిలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై పోటీ చేసిన జయేంద్ర కె. రాథోడ్(గుజరాత్) సైతం పోటీలో ఉన్నారు. వీరితో పాటు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి షేక్ జలీల్(ఏపీ), జాతీయ జనసేన పార్టీకి చెందిన దుగ్గిరాల నాగేశ్వరరావు(తెలంగాణ), కిసాన్ మజ్దూర్ బేరోజ్‌గార్ సంఘ్‌కు చెందిన గోపాల్ స్వరూప్ గాంధీ(యూపీ), బహుజన్ ద్రావిడ పార్టీ నుంచి ఎ.సీత(తమిళనాడు) పోటీ చేస్తున్నారు. ఇంకా నూర్ ముహమ్మద్ (తమిళనాడు), ఇస్మాయిల్ జాబీ ఉల్లా (కర్ణాటక), రుక్మిణి (కర్ణాటక) సోనూ సింగ్ యాదవ్ (యూపీ) స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఇక సీపీఐ నుంచి సత్యన్ మోకేరి, బీజేపీ తరఫున నవ్యా హరిదాస్ పోటీ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థి ఆర్. రాజన్ ఒక్కరే వయనాడ్ నియోజకవర్గానికి చెందినవారు. కాగా, వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ కూడా స్థానికేతరుడే.

'జమాతే' మద్దతుతో ప్రియాంక పోటీ

తిరువనంతపురం, నవంబరు 8: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వయనాడ్‌లో జమాతే ఇస్లామీ మద్దతుతో పోటీ చేస్తున్నారని కేరళ సీఎం విజయన్ ఆరోపించారు. ఈ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ లౌకిక వాద ముసుగును పూర్తిగా బట్టబయలు చేశాయని విరుచుకుపడ్డారు. 'అసలు కాంగ్రెస్ వైఖరి ఏమిటి? జమాతే ఇస్లాం గురించి మన దేశానికి తెలియనిది కాదు. ఆ సంస్థ భావజాలం ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా ఉందా?' అని విజయన్ ప్రశ్నించారు.

అమెరికా వలస విధానంపై పిడుగు

- అధ్యక్షుడు బైడెన్ తెచ్చిన కొత్త పాలసీ 'కీపింగ్ ఫ్యామిలీస్ టుగెదర్' నిలిపివేత
- ట్రంప్ నామినేట్ చేసిన జడ్జి ఉత్తర్వులు
- సుమారు 5 లక్షల మందిపై ప్రభావం

వాషింగ్టన్, నవంబరు 8: అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఇంకా గద్దెనెక్కక ముందే.. శ్వేతసౌధంలోకి అడుగు పెట్టకముందే.. వలస విధానంలో సంచలనం చోటు చేసుకుంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఏడాది జూన్‌లో 'కుటుంబాలను కలిపి ఉంచడం'(కీపింగ్ ఫ్యామిలీస్ టుగెదర్) అనే నూతన వలస విధానాన్ని తీసుకువచ్చారు. దీని ద్వారా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరులు తమ కుటుంబ సభ్యులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోయినా.. చట్టబద్ధత పొందే వీలు కల్పించారు. అయితే.. ఈ విధానాన్ని తాజాగా గతంలో డొనాల్డ్ ట్రంప్ నామినేటెడ్ చేసిన టెక్సాస్‌లోని జిల్లా జడ్జి జస్టిస్ జె. కాంప్‌బెల్ బార్కర్ నిలుపుదల చేశారు. "ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఫెడరల్ ఏజెన్సీలకు చట్టబద్ధత లేదు" అని తీర్పు వెలువరించారు. దీంతో నూతన విధానానికి అర్హులైన సుమారు 5లక్షల మంది పౌరులపై పిడుగు పడినట్టయింది. ట్రంప్ అప్రతిహత విజయం దక్కించుకున్న కొన్ని గంటల్లోనే ఆయన నామినేట్ చేసిన జడ్జి తీర్పు వెలువరించడం చర్చకు దారితీసింది. అక్రమ వలస దారులను దేశం నుంచి పంపేస్తానని ఎన్నికల సమయంలో ట్రంప్ పదే పదే చెప్పిన విషయం తెలిసిందే. టెక్సాస్ కోర్టు తాజా తీర్పుపై 'అమెరికన్ ఫ్యామిలీస్ యునైటెడ్' సంఘం అధ్యక్షుడు ఆష్లే డీ అజెవెడో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్పు లక్షల మంది ఆశలను ఛిద్రం చేసిందన్నారు.

జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ఆగని రగడ

- ఆర్టికల్ 370పై తీవ్ర వాగ్వాదం.. తోపులాట



శ్రీనగర్, నవంబరు 8 : జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మూడో రోజు శుక్రవారమూ నిరసనలు కొనసాగాయి. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను పునరుద్ధరించాలన్న తీర్మానంపై ఈ వివాదం నెలకొంది. ఎమ్మెల్యే షేక్ కుర్షీద్ అహ్మద్‌ను మార్షల్స్ ద్వారా అసెంబ్లీ నుంచి బయటకు పంపారు. బీజేపీకి చెందిన సునీల్ శర్మ ప్రసంగిస్తుండగా... అవామీ ఇత్తెహాద్ పార్టీకి చెందిన షేక్ కుర్షీద్ ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను పునరుద్ధరించాలని రాసున్న బ్యానర్ పట్టుకుని అసెంబ్లీ వెల్‌లో నిలబడ్డారు. బీజేపీ ఎమ్మెల్యేలు వెంటనే దాన్ని లాక్కుని చించివేశారు. ఈ సందర్భంగా వారి మధ్య కాస్త తోపులాట చేసుకుంది. ఈ సమయంలో మార్షల్స్ కుర్షీద్‌కు రక్షణగా నిలబడి బయటకు తీసుకువెళ్లారు. అయినా బీజేపీ ఎమ్మెల్యేలు తమ నిరసన కొనసాగించారు. దీంతో స్పీకర్ వారిపై చర్యలు తీసుకొనే పరిస్థితి తేవద్దని, వారి స్థానాలకు వెళ్లాలని కోరారు. ఈ సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు, నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యేలు నినాదాలతో హోరెత్తించారు. 15 మంది బీజేపీ ఎమ్మెల్యేలు వెల్‌లోకి చేరుకోవడంతో స్పీకర్ అబ్దుల్ రహీం రేదర్ ఆదేశాలతో మార్షల్స్ వారిని సభ నుంచి బయటకు తీసుకువెళ్లారు. అనంతరం మిగిలిన బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

బాబా బాగేశ్వర్ ఇంటర్వ్యూను తొలగించండి

న్యూఢిల్లీ, నవంబరు 8: మత సామరస్యాన్ని దెబ్బతీసి, క్షుద్రవిద్యలను ప్రోత్సహించే ప్రకటనలు, కార్యక్రమాలు, ఇంటర్వ్యూలను చానల్స్ అనుమతించరాదని నేషనల్ బ్రాండ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎన్‌బీడీఎస్‌ఏ) స్పష్టం చేసింది. మూఢ విశ్వాసాలను ప్రేరేపించే ఇంటర్వ్యూను ప్రసారం చేసిన 'న్యూస్ 18'ను మందలించింది. ఈ కార్యక్రమం వీడియోను ప్రసారాల నుంచి తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. 'న్యూస్ 18' ఇటీవల ధీరేంద్ర కృష్ణ శాస్త్రి అనే ప్రవచనకర్త ఇంటర్వ్యూను ప్రసారం చేసింది. తనకు ఉన్న మానవేతర శక్తులతో కనిపించకుండాపోయిన జంతువులను కనిపెట్టాననీ, జబ్బుపడిన వారిని మామూలు మనుషులను చేశానంటూ ఆ ఇంటర్వ్యూలో ఆయన చెప్పుకొన్నారు. లవ్ జిహాద్ పద్ధతుల్లో అమ్మాయిలను ట్రాప్ చేసి చంపేయాలని ఇస్లామ్ బోధిస్తోందంటూ ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గణతంత్ర, లౌకిక భారత్‌ను హిందూ దేశంగా మార్చివేస్తానని, అక్కడ అందరూ 'సీతారామ్' అని అనాల్సిందేనని కూడా వ్యాఖ్యలు చేశారు. 'బాబా భగేశ్వర్ ప్రత్యేక ఇంటర్వ్యూ' పేరిట 'న్యూస్ 18' ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేసింది.

టైలర్ షాపుల్లో ఆడవాళ్లకు కొలతలు మహిళలే తీసుకోవాలి

- ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ ప్రతిపాదనలు

లఖ్‌నవూ, నవంబరు 8: టైలర్ షాపుల్లో మహిళల దుస్తుల కొలతలు కేవలం మహిళలే తీసుకోవాలని, జిమ్‌లలో మహిళా ట్రైనర్లు మాత్రమే మహిళలకు శిక్షణ ఇవ్వాలని, సెలూన్లలో మహిళలు మాత్రమే మహిళలకు సేవలందించాలని యూపీ మహిళా కమిషన్ ప్రతిపాదించింది. టైలర్ షాపుల్లో, జిమ్‌లలో పురుషులు మహిళలను అసభ్యకరంగా తాకడాన్ని(బ్యాడ్ టచ్) నిరోధించేందుకు, మహిళల భద్రత కోసం ఈ ప్రతిపాదనలు చేసినట్లు తెలిపింది. జిమ్‌లలో, సెలూన్లలో, టైలర్ షాపుల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చాలని, అవి ఎల్లవేళలా పని చేసేలా చూడాలని సూచించింది. అక్టోబరు 28న జరిగిన సమావేశంలో కమిషన్ ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. "మహిళల యోగా సెంటర్లు, జిమ్‌లలో మహిళలు మాత్రమే శిక్షణనివ్వాలి. ఆడవారికి సంబంధించిన వస్తువులు అమ్మే షాపుల్లో తప్పనిసరిగా మహిళలు పనిచేయాలి" అని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఇవి అమలైతే మహిళలకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని బబిత అభిప్రాయపడ్డారు.

'సమోసా'పై సీఐడీ

- హిమాచల్‌లో రాజకీయ రగడ

సిమ్లా, నవంబరు 8: హిమాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో 'సమోసా' రచ్చరచ్చ చేస్తోంది. ఓ కార్యక్రమంలో సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు కోసం తెచ్చిన సమోసాలు మాయం కావడం, దానిపై సీఐడీ దర్యాప్తు చేస్తోందనే వార్తలు రావడమే ఆ రగడకు కారణం. అసలు ఈ సమోసా దుమారం గత నెల 21న మొదలైంది. ఆరోజు సీఐడీ ప్రధాన కార్యాలయానికి సీఎం సుఖు వచ్చిన సందర్భంగా స్నాక్స్‌లా ఆయనకు వడ్డించడానికి సమోసాలు, కేకులు, ఇతర పదార్థాలు తీసుకువచ్చారు. అయితే ఆయనకు ఇవ్వడానికి ముందే సమోసాలు మాయం అయ్యాయి. తెచ్చిన సమోసాలు ఏమయ్యాయి అని సీఐడీ అధికారులు అంతర్గత దర్యాప్తునకు ఆదేశించారు. సీఎం సెక్యూరిటీ సిబ్బందికి ఆ సమోసాలు వడ్డించారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో సమోసాలపై సీఐడీ దర్యాప్తు అంటూ వార్తలు గుప్పుమన్నాయి. దీన్ని అందిపుచ్చుకున్న విపక్ష బీజేపీ నేతలు.. ప్రభుత్వ చర్యలు కామెడీగా ఉన్నాయని, రాష్ట్రంలో ఎన్నో ఘోరాలు జరుగుతుంటే సమోసాలు మాయం అవ్వడంపై దర్యాప్తునకు ఆదేశిస్తారా? అంటూ విమర్శలు చేశారు. సమోసాల మిస్సింగ్‌పై సీఐడీ విచారణకు ఆదేశించలేదని అని సీఎం సుఖు కూడా వివరణ ఇచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దర్యాప్తు అంటూ మీడియానే వార్తలు ప్రచురిస్తోందన్నారు.

కాంట్రాక్టు ప్రకారం చంపేశాను.. 'సుపారీ' సొమ్ము ఇప్పించండి!

- పోలీసులకు 'కాంట్రాక్టు కిల్లర్' ఫిర్యాదు

మేరఠ్, నవంబరు 8: పోలీసు స్టేషన్‌లో హంతకులు లొంగిపోవడం సహజమే అయినా ఈ సంఘటన మాత్రం కాస్త విచిత్రంగా ఉంది. తనకు రావాల్సిన సుపారీని ఇప్పించాలంటూ ఓ 'కాంట్రాక్టు కిల్లర్' పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడం ఆసక్తి కలిగించింది. ఓ మహిళ హత్యకు తనను పురమాయించిన ఆమె అత్తింటివారు.. పని పూర్తి చేసినా ఇంతవరకు ఇస్తామన్న సుపారీ చెల్లించలేదని, ఆ బకాయిలను ఇప్పించాలని కోరాడు. ఈ సంఘటనతో ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఏడాది క్రితం జరిగిన మహిళా న్యాయవాది అంజలి హత్య కేసు మలుపు తిరిగింది. ఆమెను హత్య చేసేందుకు భర్త, అత్తింటి వారు తనకు రూ.20 లక్షలు ఇస్తామని చెప్పారని, కానీ ఇంతవరకు వాటిని చెల్లించలేదని నీరజ్ శర్మ అనే నిందితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన జరిగిన రోజున న్యాయవాది అంజలి మిల్క్ బూత్ నుంచి వస్తుండగా ఇద్దరు హంతకులు ఆమెను కాల్చిచంపారు. దర్యాప్తు జరిపిన పోలీసులు నీరజ్ శర్మ, యశ్‌పాల్ అనే హంతకులను అరెస్టు చేశారు. వారు వినియోగించిన రెండు స్కూటర్లు, పిస్టల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. భర్త, కుటుంబ సభ్యులను కూడా అరెస్టు చేసినా వారి ప్రమేయం లేదంటూ అనంతరం వారిని విడిచిపెట్టారు. ఇటీవల బెయిల్‌పై విడుదలయిన నీరజ్ శర్మ పోలీసు స్టేషన్‌కు వెళ్లి అంజలి భర్త, మామ పవన్ గుప్త, అత్త సరళా గుప్తలపై ఫిర్యాదు చేశారు. తాము కుదుర్చుకున్న ఒప్పందం కారణంగా పోలీసులు అరెస్టు చేసిన సమయంలోనూ వారి పేర్లను వెల్లడించలేదని చెప్పాడు.

మనసు నొప్పించి ఉంటే క్షమించండి

కావాలని ఏమీ చేయలేదు.. సీజేఐగా చివరి రోజున జస్టిస్ చంద్రచూడ్



సీజేఐ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన లాంఛనపూర్వక బెంచ్‌లో జస్టిస్ మనోజ్, జస్టిస్ ఖన్నా, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా

న్యూఢిల్లీ, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): పదవీ కాలం పూర్తయిన సందర్భంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ శుక్రవారం భావోద్వేగానికి లోనయ్యారు. విధి నిర్వహణలో నొప్పించి ఉంటే మన్నించాలని కోరారు. మరోవైపు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు తమ అనుభవాలను గుర్తు చేసుకొని ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడారు. చివరి రోజున జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు తదుపరి సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఇతర న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్, జస్టిస్ నరసింహ, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌లతో కలిపి ప్రధాన న్యాయమూర్తి లాంఛనపూర్వక ధర్మాసనం ఏర్పాటయింది. ఈ వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న వందలాది మంది న్యాయవాదులను ఉద్దేశించి జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ "మనమందరం యాత్రికులుగా ఇక్కడకు వచ్చాం. ఎందరో గొప్ప న్యాయమూర్తులు తర్వాతితరం వారికి వారసత్వాన్ని అందించి వెళ్లారు. దాన్ని కొనసాగించాలి" అని అన్నారు. తెలుగువాడైన జస్టిస్ నరసింహ మాట్లాడుతూ 'నేను, జస్టిస్ చంద్ర చూడ్ ముందు న్యాయవాదిగా హాజరయ్యా. ఇప్పుడు ఆయనతో పాటు న్యాయమూర్తిగా కూర్చొన్నా. ఇది అసాధారణమైన విషయం' అని అన్నారు. తదుపరి సీజే జస్టిస్ ఖన్నా మాట్లాడుతూ.. 'చంద్రచూడ్ ఇచ్చిన కొన్ని గొప్ప తీర్పుల వల్ల నా పని సులభమైంది. ఆయనలా పనిచేయడం కష్టం' అని అన్నారు. కాగా, జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబర్ 8న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు.

వ్యవస్థపై చిరకాల ముద్ర

సీజేఐగా రెండేళ్ల వ్యవధిలో జస్టిస్ చంద్రచూడ్ న్యాయవ్యవస్థపై చిరకాల ముద్ర ఉండే నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, తీర్పులు వెలువరించారు. న్యాయ దేవత విగ్రహం కళ్లకు ఉన్న గంతలను, ఆమె చేతిలో కత్తిని తొలగించి రాజ్యాంగాన్ని ఉంచడం ఆయన చేసిన కీలక మార్పుల్లో ఒకటి. సుప్రీంకోర్టుకు ఇచ్చే వేసవి సెలవులను పాక్షిక పనిదినాలుగా ప్రకటించారు. కోర్టు రికార్డులను డిజిటలైజ్ చేయడం వంటి వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టారు.

విమర్శలు కూడా..

జస్టిస్ చంద్రచూడ్ కొన్ని విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా తన ఇంటికి ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించడం, అయోధ్య తీర్పు సమయంలో దేవుడిని ప్రార్థించానని ప్రకటించడం చర్చనీయాంశాలయ్యాయి. మొత్తం ప్రయివేటు ఆస్తిని సేకరించే అధికారం ప్రభుత్వానికి లేదని తీర్పు ఇస్తూ సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పోరాడిన జస్టిస్ కృష్ణయ్యర్‌ను విమర్శించడంతో ఆక్షేపణకు గురయ్యారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాకు హైకోర్టు బెయిల్ ఇస్తే రాత్రికి రాత్రే సుప్రీంకోర్టు దాన్ని రద్దు చేయడంతో జస్టిస్ చంద్రచూడ్‌కు మానవ హక్కులపై ఉన్న గౌరవాన్ని ప్రశ్నార్థకం చేసింది. ప్రత్యేక సీబీఐ కోర్టు జడ్జి లోయా సహజ మరణం చెందారని ఆయన ఇచ్చిన తీర్పు కూడా వివాదాస్పదమయింది. చంద్రచూడ్ హయాంలో కొలీజియం చేసిన అనేక సిఫార్సులను ప్రభుత్వం పక్కన పెట్టినా ప్రశ్నించకపోవడం న్యాయవ్యవస్థ విజ్ఞతను శంకించినట్లయింది. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన వారిపై ఈడీ దర్యాప్తు జరిపించాలన్న అభ్యర్థననూ ఆయన తోసిపుచ్చడంపైనా విమర్శలు వచ్చాయి. మొత్తంగా పొగడ్తలు, విమర్శలతో ఆయన పదవీ కాలం ముగిసింది.

దాదాపు 500 తీర్పులు చెప్పిన జస్టిస్ చంద్రచూడ్ కొన్నింటి విషయంలో చరిత్రలో నిలిచిపోతారు. అయోధ్యలో రామమందిరానికి భూమి కేటాయించడం, ఆర్టికల్ 370 రద్దు, గే సెక్స్ నేరం కాదని చెప్పడం, ఎన్నికల బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించడం, వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కుగా గుర్తించడం, అవివాహితకు కూడా అబార్షన్ హక్కు ఆయన వెలువరించిన తీర్పుల్లో అతి ముఖ్యమైనవి.

పూరీ, కేదార్‌నాథ్‌నూ ప్రత్యేక రాష్ట్రాలు చేయమంటారా?

(మొదటి పేజీ తరువాయి)

దాఖలు చేశారు. దానిపై శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. క్రైస్తవులు, ముస్లింలు తమ మత స్థలాలపై (చర్చిలు, మసీదులపై) స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నారని.. అదే హక్కును హిందువులకు నిరాకరించడం సరికాదని, ఇది సమానత్వాన్ని ఉల్లంఘించడమేనని తెలిపారు. దేవాలయాలను రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా.. తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ... ఎలాంటి పురోగతీ లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

త్వరగా విచారించి.. జవాబుదారీతనం, సత్వర న్యాయం జరిగేలా నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో భక్తుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. 'కేంద్ర పాలిత ప్రాంతం, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని మేం నేరుగా కేంద్రాన్ని ఆదేశించలేం. వాటిపై పార్లమెంటులో నిర్ణయాలు జరుగుతాయి. మీ వాదనలు వింటుంటే దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, గురుద్వారాలను ప్రత్యేక రాష్ట్రాలుగా చేయమనేలా ఉన్నారు' అని అసహనం వ్యక్తం చేసింది.

అలీగఢ్.. సెంట్రల్ వర్సిటీ కాదు!

మైనారిటీ హోదాపై కొత్త ధర్మాసనం విచారించాలి

- సుప్రీంకోర్టు 4:3 మెజారిటీ తీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 8: ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి (ఏఎంయూ) మైనారిటీ హోదా లభించేందుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు, ఏఎంయూను మైనారిటీ సంస్థగా కాకుండా సెంట్రల్ యూనివర్సిటీగా గుర్తించాలంటూ 1967లో సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం కొట్టివేసింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తన పదవీకాలం చివరిరోజైన శుక్రవారం.. సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఏఎంయూ మైనారిటీ హోదాపై తీర్పును వెలువరించారు. అయితే, ఏఎంయూ మైనారిటీ వర్సిటీ కాదన్న గత తీర్పును కొట్టివేసినప్పటికీ.. మైనారిటీ హోదా అంశంపై విచారణకు కొత్త ధర్మాసనానికి ఈ కేసును సిఫార్సు చేశారు. ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ మేరకు 4:3 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. వాస్తవానికి ఈ కేసుపై విచారణ ఫిబ్రవరి 1వ తేదీనే ముగిసినప్పటికీ ధర్మాసనం తీర్పును రిజర్వులో పెట్టి ప్రస్తుతం వెలువరించింది. ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకునే హక్కు మతపరమైన, భాషాపరమైన మైనారిటీలకు ఉందని ఆర్టికల్ 30(1) విస్పష్టంగా ప్రకటిస్తున్న విషయాన్ని సుప్రీంకోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. రాజ్యాంగం అమలులోకి రాకముందు ఏర్పాటైన యూనివర్సిటీలకు కూడా ఇది వర్తిస్తుందని తెలిపింది. ఏఎంయూని మైనారిటీ వర్గం ఏర్పాటు చేయలేదని, ఒక ప్రత్యేక చట్టం ద్వారా అది ఏర్పాటైనందున దానిని మైనారిటీ విద్యాసంస్థగా గుర్తించలేమని పేర్కొన్న 1967 నాటి సుప్రీంకోర్టు తీర్పును.. ఈ కారణం వల్లనే కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రత్యేకంగా ఏఎంయూకు, మొత్తంగా మైనారిటీ హక్కులకు లభించిన విజయమని ఏఎంయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఫైజన్ ముస్తఫా హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో ఆయనే సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలు చేశారు. కాగా, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మైనారిటీలకు ఉన్న చదువుకునే హక్కును సమర్థిస్తోందని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ పేర్కొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా మరో ఐదుగురి ప్రమాణం

తిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా మరో ఐదుగురు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, సౌరభ్ బోరా, నన్నపనేని సదాశివరావు, కృష్ణమూర్తి వైద్యనాథన్‌తో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి ఆలయంలో ప్రమాణం చేయించారు.

భక్తులకు చలికాలంలో నిరంతరాయంగా వేడి పాలు

▸▸ టీటీడీ అదనపు ఈవో

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): చలికాలం కావడంతో భక్తులకు నిరంతరాయంగా వేడి పాలు అందజేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుమలలోని నారాయణగిరి షెడ్లను శుక్రవారం వేకువజామున ఆయన తనిఖీ చేశారు.

శ్రీవారి సేవలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి



తిరుమల ఆలయం ముందు జస్టిస్ శ్రీనివాసరెడ్డి

తిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అభిషేక సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించారు. బొంబాయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నితిన్ సంబ్రే కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

గంజాయికి యువత దూరంగా ఉండాలి

▸▸ సినీ నటుడు వెంకటేష్



'స్వచ్ఛ సంకల్పం' పోస్టర్‌ను ఆవిష్కరించిన సినీ నటుడు వెంకటేష్

అరకులోయ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా, వినియోగానికి యువత దూరంగా ఉండాలని సినీ నటుడు దగ్గుబాటి వెంకటేష్ పిలుపునిచ్చారు. సినిమా షూటింగ్ నిమిత్తం అరకులోయ వచ్చిన ఆయన పోలీస్ శాఖ రూపొందించిన 'స్వచ్ఛ సంకల్పం' పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ నూతన సీజీఎంగా సమీర్‌శర్మ

పరవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) చీఫ్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా తమిళనాడు రాష్ట్రంలోని వల్లూర్ (చెన్నై శివారు) ఎన్టీపీసీకి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎన్టీపీసీ హెచ్‌ఆర్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. సంజయ్‌కుమార్ సిన్హా సుమారు రెండేళ్ల పాటు ఇక్కడ సీజీఎంగా పనిచేశారు. ఆయన స్థానంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని వింధ్యాచల్ పవర్ ప్లాంటులోని ఓఅండ్ఎం విభాగంలో సీజీఎంగా పనిచేస్తున్న సమీర్‌శర్మ నియమితులయ్యారు.

ఆయుష్ కమిషనర్‌గా డాక్టర్ హోస్మని

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ కమిషనర్‌గా ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ మంజుల డి.హోస్మనికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వు లు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యశాఖలో సర్వీసెస్ సెక్రటరీగా విధు లు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఆయుష్ కమిషనర్‌గా ఉన్న డాక్టర్ ఎస్.బి.రాజేంద్రకుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనపై ఆరోపణలు ఉండడంతో జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

నేడు, రేపు అంగన్వాడీల రాష్ట్ర సదస్సు

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబీవీకే)లో శని, ఆదివారాల్లో (9,10 తేదీలు) జరిగే అంగన్వాడీల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బేబీరాణి, సుబ్బరావమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

వాల్‌కు సమాంతరంగా ఈసీఆర్ఎఫ్



శుక్రవారం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు, అధికారులు

▸▸ 2027 మే నాటికి పూర్తవుతుందంటున్న జలవనరుల శాఖ

▸▸ ఏడాది సమయం కలిసి వస్తుందని విశ్వాసం

▸▸ సూత్రప్రాయంగా జల సంఘం చైర్మన్ ఆమోదం

▸▸ నేడు స్పష్టత ఇస్తామని వెల్లడి

▸▸ పోలవరం వర్క్‌షాపులో వర్చువల్‌గా పాల్గొన్న శర్మ

▸▸ వాల్ ఎత్తు 19 మీటర్లకు పెంచాలని నిర్ణయం

▸▸ నేడు ధవళేశ్వరంలో క్వాలిటీ కంట్రోల్‌పై చర్చ

పోలవరం /అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా.. మట్టి, రాళ్లతో మరో ముఖ్యమైన కట్టడం ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు చేపట్టాలన్న జల వనరుల శాఖ ప్రతిపాదనకు కేంద్ర జలసంఘం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. శనివారం దీనిపై పూర్తి స్పష్టత ఇవ్వనుంది. ప్రాజెక్టు ప్రాంతంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో మూడ్రోజులుగా అత్యున్నత స్థాయి సమీక్షలు, చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారంనాటి సమావేశంలో జలసంఘం చైర్మన్ శర్మ వర్చువల్‌గా పాల్గొన్నారు. కీలక నిర్మాణాలపై అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడ్రోజుల చర్చల సారాంశాన్ని అధికారులు ఆయనకు వివరించారు. ప్రధానంగా డయాఫ్రం వాల్ డిజైన్లు, నిర్మాణ వ్యవధిపై చర్చ జరిగింది. దీనిని వచ్చే జనవరిలో ప్రారంభించి.. 2026 మార్చినాటికి పూర్తి చేస్తామని జర్మన్ సంస్థ బావర్ పునరుద్ఘాటించింది. వాల్ ఎత్తును 19 మీటర్ల వరకు పెంచాలని భేటీలో నిర్ణయించారు. దీని నిర్మాణానికి అనువుగా గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ జరగాలని అభిప్రాయపడ్డారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-1, గ్యాప్-2ల పూడ్చివేతపైనా లోతైన విశ్లేషణ జరిగింది. కాఫర్ డ్యాంల నుంచి సీపేజీని అరికట్టడంపై కూడా చర్చించారు. వైబ్రో కంపాక్షన్‌తో రంధ్రాలు చేసి బంకమట్టితో పూడ్చుతుండడం వల్ల సత్ఫలితాలు వచ్చినా.. సీపేజీ నివారణపై ఇంకా పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీని అరికట్టేందుకు 7,840 హెచ్‌పీ మోటార్లను వాడాల్సి ఉంటే.. ప్రస్తుతం 3,750 హెచ్‌పీ మోటార్లతో డీవాటరింగ్ చేపడుతున్నారు. ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని.. అప్పుడు వాల్ నిర్మాణానికి ఆటంకాలు ఎదురుకావని నిపుణులు సూచించారు. డయాఫ్రం వాల్ 2026 మార్చినాటికి పూర్తవుతుందని బావర్ చెబుతున్న నేపథ్యంలో.. ఆ ఏడాది ఏప్రిల్లో ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు ప్రారంభిస్తే 2028 ఏప్రిల్ లేదా మే నాటికి పూర్తవుతుందని జల వనరుల శాఖ పేర్కొంది. వాల్ పూర్తయ్యేవరకు దీని పనులు ఆపితే.. ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందని తెలిపింది. ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులను రెండు వైపుల నుంచీ మొదలుపెట్టి.. మధ్యలో ఉన్న డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతానికి వచ్చేందుకు కనీసం ఏడాది పడుతుందని పేర్కొంది. సమాంతరంగా రెండు కట్టడాల పనులు చేపడితే.. ఏడాది కాలం కలసి వస్తుందని స్పష్టంచేసింది. ఈ అభిప్రాయాన్ని జలసంఘం చైర్మన్ ఆమోదించారు. దీనిపై శనివారం స్పష్టత ఇస్తామన్నారు. వాల్ నిర్మాణానికి ఆఫ్రి సంస్థ ఇచ్చిన డిజైన్లపైనా చర్చించారు. ఈ సమీక్షలో అమెరికా, కెనడా నిపుణులు చార్లెస్ రిచర్డ్ డొనెల్లీ, డేవిడ్ బ్రియాన్ పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో, సీన్ హించ్‌బెర్గర్, జలసంఘం చీఫ్ ఇంజనీర్లు విజయ్ శరణ్, కాకేశ్ తోతేజా, అశ్వనీ కుమార్ వర్మ, సీఎస్ఆర్ఎంఎస్ డైరెక్టర్ మనీశ్ గుప్తా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్ జైన్, పీపీఏ సభ్య-కార్యదర్శి ఎం.రఘురాం, పీపీఏ చీఫ్ ఇంజనీర్ రాజేశ్ కుమార్, జల వనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి, క్వాలిటీ కంట్రోల్ సీఈ పుల్లారావు, సీడీవో వీవీఎస్ఆర్ కుమార్, వాప్కోస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అమితాబ్ త్రిపాఠి, డిజైన్స్ సంస్థ ఆఫ్రీ మేనేజింగ్ డైరెక్టర్ సాయిశీల కృష్ణ, బావర్ డైరెక్టర్ ఫరత్ హసన్, కెల్లర్ జనరల్ మేనేజర్ రామదాస్, మేఘా సంస్థ జీఎం గంగాధరరావు, ఐఐటీ-తిరుపతి ప్రొఫెసర్ జానకీరామయ్య తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. శనివారం ధవళేశ్వరంలో క్వాలిటీ కంట్రోల్‌పై ప్రధానంగా చర్చ జరుగుతుంది. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి కార్యాచరణ ప్రణాళిక, తలెత్తే సమస్యలు-పరిష్కారాలు, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, కాఫర్ డ్యాంలలో సీపేజీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మరింత విస్తృతంగా చర్చిస్తారు.

ఈసీఆర్ఎఫ్ నిర్మాణానికి రాళ్ల కొరత!

ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులకు రాళ్ల కొరత తలెత్తింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల నిర్మాణానికి వాస్తవంగా మట్టిని వాడాలి. కానీ వాటి పటిష్ఠత కోసం ప్రాజెక్టు ప్రాంతంలో కొండను తవ్విన రాళ్లను కూడా వేశారు. కొండను తవ్విన రాళ్లలో అధిక భాగం దానికే సరిపోయాయి. ఇప్పుడు ఈసీఆర్ఎఫ్‌లో రాళ్ల కోసం పక్కనే ఉన్న కొండను తవ్వాల్సి ఉంది. అయితే.. నిర్మాణ సంస్థలు ఈ విషయాన్ని ఇప్పటిదాకా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాలేదు. ఆకస్మికంగా భారీగా బండరాళ్లు కావాలంటే అప్పటికప్పుడు సమీకరించడం ఆలస్యమవుతుందని జల వనరుల శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు.

పోలవరం జల విద్యుత్కేంద్రంలో.. స్టే రింగ్ అమరిక పనులు ప్రారంభం

దేవీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం జల విద్యుత్ కేంద్రంలో టర్బయిన్ల ఏర్పాటులో కీలకమైన స్టే రింగ్‌ల అమరిక పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందుకు 320 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన క్రాలర్ క్రేన్‌ను వినియోగిస్తున్నారు. ఒక్కో స్టే రింగ్ 4 విభాగాలుగా ఉంటుంది. బరువు 136 మెట్రిక్ టన్నులు. విద్యుదుత్పత్తికి వినియోగించే కప్లాన్ టర్బయిన్లు సమర్థంగా పనిచేయడంలో ఈ స్టే రింగ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. వీటి అమరిక తర్వాత పవర్ ప్రాజెక్టులోని కీలక పనులను కొనసాగిస్తారు. ఏపీ జెన్‌కో ఎస్ఈ రామభద్రరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జల విద్యుత్కేంద్రంలో స్టే రింగ్‌ల ఏర్పాటు తర్వాతే టర్బయిన్లు అమరుస్తారని తెలిపారు. ప్రాజెక్టు పనులు జాప్యం కాకుండా ఉండేందుకు అన్ని పనులూ సమాంతరంగా చేస్తున్నట్టు చెప్పారు. నిర్దేశించిన సమయానికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని మేఘా సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీశ్‌బాబు అంగర తెలిపారు. ఏపీ జెన్‌కో ఈఈ వై.భీమదనరావు, మేఘా ఎలక్ట్రో మెకానికల్ విభాగం సీనియర్ మేనేజర్ మణికంఠ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పోలవరం జలవిద్యుత్ కేంద్రంలో స్టే రింగ్ అమరిక పనులు

కూటమి పాలనలో కక్ష సాధింపులుండవు: కొలుసు

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కుట్ర రాజకీయాలు, కక్ష సాధింపులు ఉండవని మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువల్ని గౌరవిస్తూ, రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'గత ఐదేళ్లు రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ని నీచస్థితికి దిగజార్చింది జగన్‌రెడ్డే. జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. కొంత మంది పోలీసుల్ని, సీఐడీని అడ్డం పెట్టుకుని, వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలంతా చూశారు. వైసీపీ సోషల్ మీడియాలో నీచమైన పోస్టింగ్‌లు పెట్టి, మహిళల్ని అవమానిస్తున్నారు. కన్న తల్లి, సొంత చెల్లిపై నీచంగా మాట్లాడుతున్నా.. జగన్ స్పందించడం లేదు. ప్రతిపక్ష పార్టీల నేతలు, కుటుంబ సభ్యులను బూతులు తిడుతుంటే ఖండించకపోగా, ప్రోత్సహించారు. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు సైకోలుగా, అరాచకవాదులుగా ప్రవర్తిస్తే... చూస్తూ ఊరుకోం. కఠిన చర్యలు తీసుకుంటాం' అని మంత్రి హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయాలి: భూమిరెడ్డి

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి తెలిపారు. వైసీపీ నేతలు గూడుపుఠాణీలు మాని, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్‌ను కోరుతున్నామని అన్నారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని ముందే అంగీకరించి, వైసీపీ నేతలు పోటీ చేయట్లేదు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగే పరిస్థితి లేదంటూ వైసీపీ నేతలు కుంటి సాకులు చెప్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పోటీ చేయనంటుందో అందరికీ తెలుసు. ప్రజామద్దతు లేక, గెలవలేమనే ఉద్దేశంతోనే వైసీపీ నేతలు పోటీ చేయకుండా తప్పుకొన్నారు' అని భూమిరెడ్డి వ్యాఖ్యానించారు.

కూటమి అభ్యర్థులదే గెలుపు: మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని ఎత్తుగడలు వేసినా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంద శాతం గెలుపు కూటమి అభ్యర్థులదేనని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...' కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా గౌతంరెడ్డి పేరును ప్రకటించారు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడం లేదంటూ వైసీపీ నేతలు తప్పుకుంటున్నారు. ఓటర్ల నమోదును చూశాక.. ఓటమి భయంతోనే వైసీపీ పోటీ చేయనంటోంది' అని ఎద్దేవా చేశారు.

ఒకరిని కాపాడబోయి.. ముగ్గురు మునక!

▸▸ ఇద్దరి మృతదేహాలు లభ్యం

▸▸ మరో ఇద్దరి కోసం గాలింపు

▸▸ ఏలేరు వాగులో ఇసుక తీత సమయంలో దుర్ఘటన

▸▸ అల్లూరి జిల్లా అడ్డతీగల మండలంలో ఘటన



భూషణం, జయబాబు, చింతాశ్రీను, చిన్నగొంతియ్య

అడ్డతీగల, నవంబరు 8: ఇసుక తవ్వకానికి వాగులోకి దిగిన ఒకరు ప్రమాదవశాత్తూ మునిగిపోతుండగా అతన్ని కాపాడబోయి, ఒకరి తర్వాత ఒకరుగా ముగ్గురు.. మొత్తం నలుగురు మునిగిపోయారు. గల్లంతైన నలుగురిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాళ్లపాడు వద్ద ఏలేరు వాగులో శుక్రవారం ఈ విషాదకర ఘటన జరిగింది. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం(60), వీరమళ్ల జయబాబు(26), చింతా శ్రీనివాస్(19), తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్య ఇసుక తీత పనులు చేస్తుంటారు. వీరిలో జయబాబు.. భూషణం కుమారుడు కాగా, చిన్నగొంతియ్య అల్లుడు. భార్య ప్రసవానికి పుట్టింటికి తీసుకువచ్చిన చిన్నగొంతియ్యకు ఇటీవల కొడుకు పుట్టాడు. ఇక్కడే ఉంటున్న అతను తన మామ, బావమరిదితో కలిసి పనులకు వెళ్తున్నాడు. వీరంతా కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాళ్లపాడు వద్ద ఏలేరు వాగులో ఇసుక తవ్వి ట్రాక్టర్లలో లోడింగ్ చేసి స్థానిక అవసరాలకు తరలిస్తున్నారు. ఇక్కడ ర్యాంపులకు ఎటువంటి అనుమతులు లేనప్పటికీ అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరుగుతుంటాయి. ఇక్కడ కొన్నాళ్ల క్రితం ఇసుక తవ్వకాలు జరిగాయి. ఇటీవల వర్షాలకు తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో నీరు చేరి గుంతలుగా ఏర్పడి బురద నిండిపోయి ఊబిలా మారాయి. ఈ నేపథ్యంలో ఈ నలుగురూ బొంగరాళ్లపాడు ఏలేరు వాగులో ఇసుకతీతకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో ఒకరు లోపలకు దిగి మునిగిపోతుండగా కాపాడే ప్రయత్నంలో నలుగురూ నీటమునిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న అడ్డతీగల పోలీసులు, డివిజన్ స్థాయి అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయి ప్రశాంత్ పరిసరాలను పరిశీలించి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జయబాబు, గొంతియ్య మృతదేహాలు లభ్యం కాగా.. భూషణం, శ్రీనివాస్ ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏలూరు వైద్య కళాశాలకు 'డాక్టర్ ఎల్లాప్రగడ' పేరు

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల పేరును 'డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ప్రభుత్వ వైద్య కళాశాల'గా ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతోషం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. 'ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు గౌరవార్థం ఏలూరు ప్రభుత్వ కళాశాలకు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు ప్రతిపాదనను తీసుకువచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా అభినందనలు. సీఎం చంద్రబాబు ఈ ప్రతిపాదనకు అంగీకరించటం ఆనందదాయకం. మానవాళి సంక్షే మం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల స్మృతికి, వారసత్వానికి శాశ్వతత్వం కల్పించే దిశగా ఎన్‌డీఏ సర్కారు ముందుకు సాగుతోంది. ఇదే స్ఫూర్తితో ఇటీవల మచిలీపట్నం వైద్యకళాశాలకు స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయజెండా రూపశిల్పికి పింగళి వెంకయ్య పేరిట నామకరణం చేశాం" అని పేర్కొన్నారు.

అనుమతి లేకుండా 6.15 లక్షల క్యూబిక్ మీటర్లు తవ్వేశారు!

▸▸ 20.95 ఎకరాల్లో రెడ్ గ్రావెల్ తవ్వకాలు

▸▸ ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశాలతో విచారణ

▸▸ ఐ.ఎస్.జగన్నాథపురంలో వెలుగులోకి అక్రమాలు

▸▸ డిప్యూటీ సీఎం కార్యాలయానికి నివేదిక



అక్రమ తవ్వకాలు సాగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ద్వారకాతిరుమల/అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం ఐ.ఎస్.జగన్నాథపురంలో అనుమతులు లేకుండా బొకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్ సంస్థ 20.25 ఎకరాల్లో 6,15,683 క్యూబిక్ మీటర్ల రెడ్ గ్రావెల్ తవ్వకం సాగించినట్టు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి గుర్తించారు. ఈ నివేదికను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం అందజేశారు. ఐ.ఎస్.జగన్నాథపురం గ్రామంలో అనుమతులకు విరుద్ధంగా సాగిన రెడ్ గ్రావెల్ తవ్వకాలపై విచారణ జరపాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల ఒకటో తేదీన పవన్ కల్యాణ్ దీపం-2 పథకం ప్రారంభానికి వచ్చి లక్ష్మీనారసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి భూములను కొందరు వైసీపీ నేతలు అక్రమంగా తవ్వేశారని, ఎన్నో అవకతవకలు చోటు చేసుకున్నాయని స్థానికులు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరిపి వారంలోగా నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని ఆయన ఆదేశించారు. మర్నాడే రెవెన్యూ, గనుల శాఖ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. గ్రామంలోని సర్వే నంబర్ 425లో 6.18 ఎకరాల్లో 74,875 క్యూబిక్ మీటర్లు తవ్వుకోనేందుకు అనుమతి తీసుకుని, ఎలాంటి తవ్వకాలు జరపలేదని నివేదికలో పొందుపరిచారు. అదే సర్వే నంబర్‌లో మరో చోట 1.48 ఎకరాల్లో 36,107 క్యూబిక్ మీటర్లకు అనుమతి తీసుకొని.. 33,637 క్యూబిక్ మీటర్లు తవ్వకాలు సాగించారని పేర్కొన్నారు. అదే సర్వే నంబర్‌లో 20.95 ఎకరాల్లో ఏ విధమైన అనుమతులు లేకుండా 6,15,683 క్యూబిక్ మీటర్ల రెడ్ గ్రావెల్ తవ్వకం సాగించినట్టు విచారణలో గుర్తించామన్నారు. అలా తవ్విన రెడ్ గ్రావెల్‌ను అనుమతి ఉన్న ప్రదేశాల నుంచి తవ్వినట్టు నమోదు చేసినట్టు గుర్తించారు. ఈ తప్పిదాలపై బొకెమ్ ఇన్‌ఫ్రా సంస్థకు నోటీసులు ఇస్తామని కలెక్టర్ వెట్రి సెల్వి.. ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలిపారు. అదే విధంగా ఇందుకు బాధ్యులైన రెవెన్యూ, గనుల శాఖల అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్టు తెలియజేశారు. కాగా.. తవ్వకాలు సాగించిన ప్రదేశంలో భారీగా పచ్చదనం దెబ్బతిందని, జీవ వైవిధ్యానికి విఘాతం వాటిల్లిందని నివేదికలో పేర్కొనడంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అటవీశాఖ అధికారులను పవన్ ఆదేశించారు.

ఐదేళ్ల అరాచకం మరిచావా జగన్?

▸▸ బీజేపీ నేత పాతూరి

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): "నీ ఐదేళ్ల అరాచక పాలనను మరిచిపోయావా జగన్? రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించేందుకు సిగ్గులేదా?" అని బీజేపీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు ఐదు నెలలుగా ఎంతో సంతోషంగా, ప్రశాంతంగా జీవిస్తుంటే విమర్శించేందుకు నోరెలా వస్తోందన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు సైకోలు సోషల్ మీడియాలో నీచాతినీచంగా తెగబడుతున్నా పట్టించుకోకుండా అభివృద్ధిపై దృష్టి సారించిన సీఎం చంద్రబాబు సంయమనం పాటిస్తున్నారని తెలిపారు. ఆయన సంయమనాన్ని చేతగానితనంగా తీసుకుని పవన్ కుమార్తెలను, హోంశాఖ మంత్రిని అసభ్యంగా ట్రోల్ చేస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా? అని నిలదీశారు. "రాజకీయ ప్రత్యర్థుల కుటుంబాల్లోని మహిళల వ్యక్తిత్వాన్ని హననం చేయడం మీకు సోషల్ మీడియా స్వేచ్ఛలా కనిపిస్తోందా? చట్టపరంగా చర్యలు తీసుకుంటున్న జిల్లా ఎస్పీలు, డీజీపీనే బెదిరిస్తారా? జీవితంలో మళ్లీ నువ్వు సీఎం కాలేవు. రాష్ట్ర ప్రజలు నిన్ను ఎప్పటికీ నమ్మరు" అని పాతూరి ఘాటుగా వ్యాఖ్యానించారు.

పంచభూతాలను దోచుకున్న ఆర్థిక నేరగాడు జగన్

▸▸ మంత్రి సత్యకుమార్

పెద్దాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని, పంచ భూతాలను దోచుకున్న ఆర్థిక నేరగాడు, 32 కేసుల్లో ఉన్న వ్యక్తి జగన్ అని మంత్రి వై.సత్యకుమార్ విమర్శించారు. శుక్రవారం కాకినాడ జిల్లా పెద్దాపురంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 'లక్షల కోట్లు దోచుకున్న వ్యక్తి ఈరోజు ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నాడు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వ్యక్తి ఈ రోజు ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే ప్రతీ రోజు ఒక కొత్త కార్యక్రమాన్ని తీసుకువచ్చాం. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమే పనిచేస్తున్నాం. బాధ్యతాయుతంగా పనిచేస్తున్న మా ప్రభుత్వంపై చవుకబారు విమర్శలు చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మాణాత్మక పాత్ర పోషించకుండా, మేం అసెంబ్లీకి వెళ్లం అని జగన్ అనడం హాస్యాస్పదంగా ఉంది. కన్న తల్లి, సొంత చెల్లిపైనా సోషల్ మీడియాలో చెప్పలేని మాటల్లో పోస్టులు పెట్టించారు. వారిని మానసిక వేదనకు గురిచేశారు' అని సత్యకుమార్ మండిపడ్డారు.

తల్లి, చెల్లిపై పోస్టులు పెట్టిన వాడ్ని వెనుకేసుకొస్తారా?

▸▸ వర్ల రామయ్య

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కన్న తల్లి, సొంత చెల్లిపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రారెడ్డి మంచివాడని జగన్ గుండె మీద చేయి వేసుకుని అంటే.. జగన్ ఇంటి ముందు నిలబడి సెల్యూట్ చేస్తానని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సవాల్ చేశారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'వర్రా రవీంద్రారెడ్డి అనే సోషల్ మీడియా యాక్టివిస్టు అమాయకుడా? తల్లి, చెల్లిపై వల్గర్‌గా పోస్టులు పెట్టిన వాడి కోసం జగన్ ఎంత మంది లాయర్లనైనా పెడతారా? వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిలపై నీతిబాహ్యమైన వ్యాఖ్యలు చేసిన రవీంద్రారెడ్డిని జగన్ వెనకేసుకురావడం ఏంటి? అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన వర్రాను కాపాడటానికి జగన్‌కు మనసెలా ఒప్పింది?' అని ప్రశ్నించారు.

పోలీసులపై బెదిరింపు ధోరణి తగదు: సూర్యనారాయణ

పోలీసు అధికారులపై బెదిరింపు ధోరణితో మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'గత ప్రభుత్వంలో సీపీఎస్ రద్దు, పీఆర్సీ సాధన కోసం ఉద్యమం చేస్తున్న సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులపై అక్రమ కేసులు, బైండోవర్లు, పెట్టిన మీరు.. రిటైర్మెంట్ తర్వాతా చర్యలు తీసుకుంటామంటూ అధికారులను బెదిరించడం తగదు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి బెదిరింపులకు తావు లేదు. ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసే ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి' అని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెనకడుగు వద్దు!

వాతావరణ మార్పుపై మానవ పోరాటానికి ఉద్దేశించిన సభ్య దేశాల మహాసదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–కాప్) సోమవారం నుంచి అజర్‌బైజాన్ రాజధాని బాకులో ఆరంభమవుతోంది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఏటా జరిగే ఈ సదస్సుకు ముందు ఏవో అద్భుతాలు జరిగిపోతాయన్న భ్రమ కలుగుతూనే ఉంటుంది. దేశాల నాయకులు, పారిశ్రామికవేత్తలు, పర్యావరణవేత్తలు, ఉద్యమకారులు, మరోపక్క మాడిపోతున్న, మునిగిపోతున్న దేశాల నుంచి వచ్చే నిరసనకారులతో ఓ పదిరోజులపాటు అజర్‌బైజాన్ కళకళలాడబోతోంది. వేడెక్కుతున్న ధరిత్రిని కాప్ సదస్సు కాపాడుతుందని, కాస్తంత మనసుపెట్టి, నిర్దిష్టమైన నిర్ణయాలతో మనిషి మనుగడకు మార్గం చూపుతుందన్న నమ్మకం ఏటా ఎంతోకొంత ఉండేది. కానీ, ఈ సదస్సుకు కొద్దిరోజుల ముందు అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికై, ఆ కాస్త ఆశని కూడా ఈ మారు ప్రపంచానికి మిగలనివ్వలేదు.

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పు వంటి మాటలు ట్రంప్‌కు నచ్చవు. అవన్నీ పర్యావరణవేత్తలుగా చెప్పుకుంటున్నవారు చేస్తున్న శుష్కమైన వాదనలని ఆయన నమ్మకం. ధరిత్రి వేడెక్కడం, ప్రకృతి కోపించడం వంటి మాటలు నమ్మితే తనబోటి, తోటి పారిశ్రామికవేత్తలకు ఎంత నష్టమో ఆయనకు తెలుసు. పర్యావరణ పరిరక్షణకోసం తపిస్తున్న వారికీ, భూమిని కాపాడుకోవడానికి కృషిచేస్తున్నవారికీ ఆయన ఎన్నిక ఒక ప్రమాదకర హెచ్చరిక. వాతావరణమార్పు మీద ట్రంప్ తన తొలి విడత పాలనలో ఎంతటి వ్యతిరేక వైఖరి తీసుకున్నారో తెలిసిందే. పారిస్ ఒప్పందం అమెరికా శత్రువని ఆయన ప్రకటించాడు. భారత్, చైనా వంటి దేశాలను ఇష్టారాజ్యంగా శిలాజ ఇంధనాలను వాడుకోనిచ్చి, అమెరికాకు మాత్రమే ఈ డాక్యుమెంట్ ఉరితాళ్ళు వేస్తున్నదని విమర్శించాడు. అమెరికా ప్రయోజనాలకు వ్యతిరేకంగా, దానికి అన్యాయం చేస్తున్న ఈ ఒప్పందంనుంచి వైదొలగాలని నిర్ణయించాడు. డ్రిల్...డ్రిల్..డ్రిల్ అన్న ఒకే ఒక్క నినాదంతో ఆయన తన విధానం ఏమిటో తేల్చేశాడు. ఆ తరువాత జో బైడెన్ అధికారంలోకి రాగానే ఆ నిర్ణయాన్ని తిరగదోడిన మాట వాస్తవమే కానీ, తాను మళ్ళీ అధికారంలోకి రాగానే తిరిగి అదే పని చేస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించాడు. ఇరాన్‌తో పాశ్చాత్య దేశాలు చేసుకున్న అణు ఒప్పందాన్ని ఇజ్రాయెల్ కోసం కాలదన్ని ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టేసిన ట్రంప్, పారిస్ ఒప్పందాన్ని మళ్ళీ కాదనడం ఖాయం. క్లైమేట్ ఫైనాన్స్ అంటే అమెరికా కష్టపడి సంపాదించిన సొమ్మును వేరొకరి చేజేతులా ధారపోయడమని ఆయన నిర్వచనం.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు సమకూర్చడం, నష్టాలను భర్తీచేయడం, ఉద్గారాలను నియంత్రించుకోవడం వంటి పలు అంశాల్లో గత ఏడాది దుబాయ్ సదస్సులో అడుగు ముందుకుపడింది. గతాన్ని సమీక్షించుకోవడం మీద అది శ్రద్ధపెట్టినందువల్ల, భవిష్యకార్యాచరణ చర్చ విస్తృతంగా జరిగింది. మూడుదశాబ్దాల కాప్ సదస్సుల చరిత్రలో శిలాజ ఇంధనాలు అన్న పదం సంయుక్త ప్రకటనలో చేరడం అదే తొలిసారి. 2050కల్లా వాటి వినియోగాన్ని దశలవారీగా వదులుకుంటూ సున్నా చేయాలని సంకల్పం చెప్పుకుంది. పారిస్ సదస్సు తీర్మానించిన ప్రకారం భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడానికి వీలుగా కర్బన ఉద్గారాలను వేగంగా తగ్గించుకోవాలని, 2050కల్లా తటస్థత సాధించాలని ఆ సదస్సు నిర్ణయించింది. తదనుగుణంగా వ్యూహాలు, విధానాలు రాసుకుంటానని అమెరికా కూడా హామీ ఇచ్చింది. ప్రధానంగా ధనికదేశాల దురాశే వాతావరణ మార్పులకు, తద్వారా పేదదేశాలకు సంభవించే నష్టాలకు కారణం కనక, వాటిని ఆదుకొనే నిధి విషయంలోనూ ఈ సదస్సు తొలిరోజునే ప్రశంసనీయమైన అడుగువేసింది. 'లాస్ అండ్ డామేజ్' నిధికి హామీపడిన మేరకు ధనికదేశాలు నిధులు సమకూర్చని మాట నిజమే కానీ, 2030కల్లా ఏటా వందబిలియన్ డాలర్లు సమకూర్చుకోవాలన్న కొత్త లక్ష్యం నెరవేరితే పేదదేశాలకు ఈ నిధి కచ్చితంగా మేలుచేస్తుంది. ధరిత్రిని రక్షించుకొనే విషయంలో అజర్‌బైజాన్ సదస్సులో మరిన్ని నిర్దిష్టమైన అడుగులుపడతాయని నమ్ముతున్న తరుణంలో, ట్రంప్ మరో రాకడ ఇప్పుడు ప్రపంచాన్ని భయపెడుతోంది. మరో నాలుగేళ్ళపాటు అమెరికా ఏ గట్టున ఉండబోతున్నదో ఎలాగూ తెలిసిపోయింది కనుక, యూరోపియన్ యూనియన్, చైనా, ఇండియా, అభివృద్ధి చెందుతున్న దేశాలు చేయీ చేయీ కలిపి లక్ష్యాల సాధన దిశగా కృషిచేయడం అవసరం.

సాదిక్ అంటే... నిరంతర చలనం

ఒక సంఘ సేవకుడి గురించి మాట్లాడుకుందాం. ఒక మనసున్న స్నేహితుడి గురించి మాట్లాడుకుందాం. ఒక సాహిత్య ప్రేమికుడి గురించి మాట్లాడుకుందాం. సాహిత్యానికి నాలుగు చక్రాల కాళ్ళిచ్చి తోపుడుబండి పేరిట ఊరూరా చేర్చిన కార్యకర్త గురించి మాట్లాడుకుందాం. చదువుకోవడానికి ఆర్థికసాయం అవసరమైనవాళ్ళకు నేనున్నానని అండగా నిలబడ్డ ఒక చేయూత గురించి మాట్లాడుకుందాం. ఒక జర్నలిస్ట్ గురించి ఒక ఆధునిక పెళ్ళిళ్ళ పేరయ్య గురించి ఒక ప్రేమికుడి గురించి హిందీ పాటల పిచ్చిలో రెండు చెవులు కోసేసుకున్న వ్యక్తి గురించి మాట్లాడుకుందాం. అందరినీ కన్నీళ్లలో ముంచి అర్థాంతరంగా లోకంనుంచి నిష్క్రమించిన ఒక మనీషి గురించి మాట్లాడుకుందాం. ఇంతమంది గురించి వేర్వేరుగా కాదుగానీ ఇవన్నీ ఒక్కడే అయిన సాదిక్ గురించి మాట్లాడుకుందాం.

చాలా మందికి తోపుడుబండి సాదిక్‌గా తెలిసిన ఈ మనిషి నడిచొచ్చిన దారినిండా ముళ్ళు గోతులు చీకట్లు తప్ప మరేమీ లేవు. అసలు దారంటూ లేని నేలమీద నడిచి శిఖరాగ్రానికి చేరినవాళ్ళలో అతి తక్కువ మందిలో ఉండే నమ్రత, స్నేహగుణం సాదిక్ సొంతం.



ఉదయంలో జర్నలిస్టుగా ప్రయోగవాదం పంచన నిలిచి కార్మిక నాయకుడై ఎదురు దెబ్బలు తిని దారి మార్చి మ్యారేజ్ బ్యూరోలో తేలిన చమత్కారి 'వశిష్ఠ' సాదిక్. తను పనిచేసిన పత్రిక మూతపడితే తట్టుకోలేక మళ్ళీ తెరిస్తే కోటి రూపాయలిస్తానన్న మనసున్న మనిషి సాదిక్. మతాంతర ప్రేమలో మునిగి అదే అమ్మాయిని జీవిత భాగస్వామిగా తన కలంపేరులోనూ భాగస్వామిగా చేసుకున్న విశ్వమానవుడు ఉషా సాదిక్. 'యూనివర్సల్ మ్యారేజ్ బ్యూరో' స్థాపించడం ద్వారా వేలాదిమందికి పెళ్లి సంబంధాలు కుదిర్చారు.

సాదిక్ తండ్రిని చిన్నతనంలోనే కోల్పోయారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో డిగ్రీ వరకు చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలలో చురుకుగా ఉండేవారు.

'కొందరు/లోకం ఖాళీ చేస్తే/వెలితి/వెక్కిళ్ళు పడుతుంది/చరిత్ర గర్వంగా/శాశ్వతపుట లిఖిస్తుంది' అని అతని ఆచరణ, అతని సంకల్పం, అతని సేవాతత్పరతలకు ఒక కవి ఇచ్చిన కితాబు. 'సాదిక్ గారు లేకపోవడం వో పెను విషాదం. వారిదగ్గర నుండి వో పుస్తకం, ఓ బూట్ల జత, వో స్కూలు బ్యాగు, వో చలి దుప్పటి, ఓ అన్నం ముద్ద.. ఇంకేదో ఇంకేదో అందుకున్న ఏ పిల్లవాడైనా, ఏ ఆడబిడ్డ అయినా ఎలా మర్చిపోతారు ఈ ప్రేమమూర్తిని..' అని ఒక సాహిత్యకారుడు భావించడం అంటే, ఇవాళ్టి కాలంలో ఎందరో చేద్దామనుకుంటూ తాము చేయలేకపోతున్న పనుల్ని భుజానికెత్తుకొని సాదిక్ చేశాడని నిండుమనసుతో కూడిన మెచ్చుకోలు.

పుస్తకాల పండుగలకు జవజీవాలను ఇవ్వడానికి ముచ్చటైన ప్రయత్నాలు చేసి సఫలం చేసాడు సాదిక్. పుస్తకాలబండి, తోపుడుబండి సాదిక్‌గా క్రమేణా అతని పేరు స్థిరపడేంతగా కార్యాచరణ కొనసాగింది. అతని మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేనంతగా చివరి నిమిషం వరకు కృషిచేస్తూనే ఉన్నాడు. దాతలకు ఏవో విన్నపాలు చేస్తూనే ఉన్నాడు.
పిల్లలతో కలిసి వాళ్లకు ఏవో ఇస్తూనో, భోజనాలు పెడుతూనో కనపడుతూనో ఉన్నాడు. అందుకే ఎవరూ అతను ఇప్పుడు లేడు అంటే అంగీకరించడానికి ఇష్టపడటం లేదు.

పేద పిల్లలకు సాయం చేసేందుకు తోపుడుబండి ఫౌండేషన్‌ను స్థాపించారు. ఫౌండేషన్ ద్వారా విరాళాలు, వేలాదిమంది పేద పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, పాఠశాలలకు ఫర్నిచర్ సమకూర్చారు. అనాథ పిల్లలకు చేయూతనిచ్చారు.

ముఖ్యంగా యువతరాన్ని దగ్గరకు తీసుకోవడం, వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోవడం, ఆ తర్వాత చిన్ని పిల్లల యోగక్షేమాలవైపుకు దృష్టి మరల్చడం, అనేక కార్యక్రమాలు చేపట్టడం సాదిక్ దీర్ఘదర్శిలా కనిపిస్తాడు.

అసలు తోపుడుబండి ప్రాథమికంగా మొదలయ్యింది కవిత్వం పాఠకులకు చేరువచేద్దామని, వాళ్ళ ద్వారా కొనుగోళ్లు చేయిద్దామని, విస్తృతంగా ప్రచారం చేద్దామని. ఆ తరవాత మొత్తం సాహిత్యం వైపు, ఆ తర్వాత పాఠశాలలవైపు, పిల్లల అవసరాల వైపునకు మళ్ళి విస్తృతమై అదొక ఫౌండేషన్‌లా రూపుదిద్దుకుంది. బుక్ ఫెయిర్‌లలోకి ప్రవేశించి అక్కడికి వచ్చిన సందర్శకుల చేతిలో పుస్తకాలు ఉంచి సెల్ఫీలు దించి, సోషల్ మీడియాను పుస్తకప్రపంచంగా మార్చిన సాదిక్ సమాజాన్ని పుస్తకాలవైపునకు ఎన్ని రకాలుగా ఆకర్షించాలో ఆలోచించి ఆచరించి చూపాడు. తోపుడుబండి మీద వంద రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు తిరిగి పుస్తకాలను పంచిపెట్టాడు. కొంతమంది స్నేహితులు పుస్తకాలు కొనేందుకు సహకరించారు.

పుస్తకాల పండుగలకు జవజీవాలను ఇవ్వడానికి ముచ్చటైన ప్రయత్నాలు చేసి సఫలం చేసాడు. పుస్తకాలబండి, తోపుడుబండి సాదిక్‌గా క్రమేణా అతని పేరు స్థిరపడేంతగా కార్యాచరణ కొనసాగింది. అతని మరణాన్ని ఎవరూ జీర్ణించుకోలేనంతగా చివరి నిమిషం వరకు కృషిచేస్తూనే ఉన్నాడు. దాతలకు ఏవో విన్నపాలు చేస్తూనే ఉన్నాడు. పిల్లలతో కలిసి వాళ్లకు ఏవో ఇస్తూనో, భోజనాలు పెడుతూనో కనపడుతూనో ఉన్నాడు. అందుకే ఎవరూ అతను ఇప్పుడు లేడు అంటే అంగీకరించడానికి ఇష్టపడటం లేదు.

కల్లూరు మండలంలోని దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావలసిన వస్తువులను దాతలనుంచి సేకరించి అందించేవాడు. ఇందుకోసం కొన్నాళ్లుగా కల్లూరులోనే స్థిరపడ్డారు. కోవిడ్ సమయంలో పేద విద్యార్థులకు సెల్‌ఫోన్లను ఉచితంగా అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడ్డారు. చనిపోవడానికి ముందురోజు కూడా 200 మంది బాలబాలికలకు షూస్ ఇచ్చారు, తన మానవీయ సేవలతో అందరి మన్ననలు పొందారు సాదిక్.

ఇటువంటివాళ్లను మరణంతో కలిపి ఊహించుకోలేం అన్నది ప్రతి ఒక్కరి గుండె లోతుల్లోంచి వచ్చే మాట.. అదీ అతనికి జనంతో ఉన్న మమేకత. ఆచరణలోని స్వచ్ఛత, పారదర్శకత.

సాదిక్ భార్య ఉషగారు వ్యవసాయ శాఖలో జాయింట్ డైరెక్టర్. సాదిక్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లోనూ ఆమె భాగస్వామి. ఆయన సేవలను ఆమె కొనసాగిస్తారు. నవంబర్ ఏడున అతను ఈ లోకాన్ని వీడిపోయారని, ఆయన లేరు అనేది అబద్ధం. ఆయన ఉనికి అందరి గుండెల్లో శాశ్వతం అన్నదే నిజం.

● కవి యాకూబ్

ట్రంప్ గెలుపు సూచిస్తున్నదేమిటి?



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మరో శక్తిమంతమైన నాయకుడు ఎన్నికయ్యాడు. ప్రపంచంలో అతి పురాతన ప్రజాస్వామిక వ్యవస్థ అయిన అమెరికాలో దేశాధ్యక్ష పదవీ ఎన్నికలో డోనాల్డ్ ట్రంప్ కచ్చితమైన, చరిత్రాత్మక విజయం సాధించారు. అమెరికాలో ఎన్నికల ప్రక్రియ న్యాయబద్ధతను ఎవరూ ప్రశ్నించరు, ప్రశ్నించలేరు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి అయిన డోనాల్డ్ ట్రంప్‌కు నియోజక గణం (ఎలెక్టోరల్ కాలేజీ) ఓట్లు 295 లభించగా ఆయన ప్రత్యర్థి, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు 226 మాత్రమే దక్కాయి. ప్రజల ఓట్లు సైతం అత్యధికంగా ట్రంప్‌కే లభించాయి. ఆయనకు 72.5 మిలియన్ ఓట్లు లభించగా కమలా హారిస్‌కు 68.15 మిలియన్ ఓట్లు దక్కాయి. 2024 ఎన్నికల విజయాలతో రిపబ్లికన్ పార్టీ ప్రాబల్యం మరింతగా పెరిగింది. అమెరికా కాంగ్రెస్ ఎగువ సభ సెనేట్‌లో ఇప్పుడు తిరుగులేని మెజారిటీని రిపబ్లికన్ పార్టీ సాధించుకున్నది. అలాగే దిగువ సభ ప్రతినిధుల సభ కూడా రిపబ్లికన్‌ల నియంత్రణలోనే కొనసాగే అవకాశమున్నది. ఏ ప్రమాణం ప్రకారం చూసినా డోనాల్డ్ ట్రంప్‌కు, రిపబ్లికన్ పార్టీకి సమగ్ర, ఘనమైన విజయం లభించింది.

నవంబర్ 5కు ముందు కొన్ని నెలల నుంచి రోజువారీగా జరిగిన ఓటర్ల సర్వేలు, అధ్యక్ష ఎన్నికల అంతిమ ఫలితాన్ని అంచనా వేయడంలో ఘోరంగా విఫలమయ్యాయి. డోనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య తీవ్ర పోటీ ఉన్నదని, ఇరువురూ సమ ఉజ్జీలుగా ఉన్నారని, ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేమని సర్వేలు పదే పదే పేర్కొన్నాయి. అయితే అది శుద్ధ పొరపాటు అని రుజువయింది. అలాగే 'స్వింగ్' స్టేట్స్‌గా సుప్రసిద్ధమైన ఏడు రాష్ట్రాలలో ఓటర్ల మొగ్గు ఒకే వైపు–ట్రంప్‌కు అనుకూలంగా ఉన్నది. ఆ ఏడు 'స్వింగ్' రాష్ట్రాలలో ట్రంప్, కమలా హారిస్‌కు లభించిన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి (రాష్ట్రం పేరు తరువాత ఉన్న అంకెల్లో మొదటిది ట్రంప్‌కు, రెండవది కమలాహారిస్‌కు లభించిన ఓట్లు) : అరిజోనా– 1,303,793, 1,167,898; జార్జియా–2,654,306, 2,538,986; మిషిగన్–2,799,713, 2,715,684; నేవడా–688,179, 647,247; నార్త్ కరోలినా–2,876,141, 2,685,451; పెన్సిల్వేనియా–3,473,325, 3,339,559; విస్కాన్సిన్–1,697,237, 1,668,757. నువ్వా నేనా అన్న రీతిలో సంభవించిన పోటీలో ఓట్ల లభ్యతలోని స్వల్ప వ్యత్యాసాలు బలమైనవి, సార్థకమైనవి.

అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా రూపొందించుకుందాం అన్న నినాదంతో డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారం చేశారు. అయితే ప్రచార పర్వంలో ఆయన ప్రసంగాలు స్త్రీలను కించపరిచేవిగాను, జాత్యహంకారాన్ని రెచ్చగొట్టేవిగాను, ప్రజలలో విభేదాలు, చీలికలు సృష్టించేవిగాను, ప్రత్యర్థులను అమితంగా దుర్భాషలాడినవిగా ఉన్నాయని అమెరికా అధ్యక్ష ఎన్నికల ఘటనలు, ప్రచార సైనాల స్వతంత్ర పరిశీలకులు, నిష్పాక్షిక మీడియా ప్రతినిధులు అంగీకరించారు. అయితే అమెరికా ప్రజలలో అత్యధికులు ట్రంప్ ప్రచార తీరుతెన్నులను ఏ మాత్రం పట్టించుకోనే లేదు. వలసలు (ఇమిగ్రేషన్), ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్), పెచ్చరిల్లిన నేరాలు (క్రైమ్స్) ఇత్యాది అంశాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చారు. ఆ సమస్యల నుంచి ఎవరు తమను బయటపడవేయగలరని మాత్రమే వారు ప్రధానంగా ఆలోచించారు.

ద్రవ్యోల్బణాన్ని మినహాయిస్తే మిగతా రెండు మనం 'బతుకుతెరువు' అంశాలుగా పరిగణించేవి కావు. వాటిని మంచి జీవితాన్ని నిర్మించుకోవడంలో సాఫల్య వైఫల్యాలకు సంబంధించినవిగా అభివర్ణించవచ్చు. అమెరికాకు వలస వస్తున్న వారు 'మనలాంటి వారు కారు' అన్నది రిపబ్లికన్ల అభిప్రాయం. ఈ పరాయివారు శ్వేత జాతీయులైన అమెరికన్ క్రైస్తవ పౌరులను ముంచెత్తుతున్నారని, ఫలితంగా అమెరికా ప్రజలు అనేక ఆర్థిక ఇక్కట్లకు లోనవుతున్నారని అంటూ వలసకారులకు వ్యతిరేకంగా రిపబ్లికన్లు ముమ్మర ప్రచారం చేశారు. దశాబ్దాల క్రితం అమెరికాకు వలస వెళ్లినవారు (ప్రధానంగా లాటినో ఓటర్లు) సైతం కొత్త వలసకారుల నుంచి తమ మనుగడకు తీవ్ర ముప్పు వాటిల్లనున్నదని గట్టిగా భావిస్తున్నారు.

సరే ద్రవ్యోల్బణం ప్రతి దేశంలోనూ ప్రతి ఒక్కరికీ సమస్యలు సృష్టిస్తోంది. అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని 2.4 శాతానికి కట్టడి చేశారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన వడ్డీ రేటును తగ్గించడానికి సిద్ధంగా ఉన్నది (ద్రవ్యోల్బణం తక్కువగా ఉందనేందుకు ఇదొక సూచన). అయినప్పటికీ ద్రవ్యోల్బణంను రిపబ్లికన్ పార్టీ ఒక ప్రచార అస్త్రంగా చేసుకున్నది. అనేక దేశాలలో మాదిరిగానే అమెరికాలోను నేరాలు బాగా పెరిగిపోయాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, మాదక ద్రవ్యాలే నేరాల పెరుగుదలకు ప్రధాన కారణాలు. ఏ ప్రజాస్వామ్య దేశంలో అయినా ప్రతిపక్షాలు నేరాల పెరుగుదలను ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవడం కద్దు.

వలసలు, ద్రవ్యోల్బణం, నేరాల పెరుగుదలను డోనాల్డ్ ట్రంప్ తన రాజకీయ లబ్ధికి గరిష్ఠంగా ఉపయోగించుకున్నారు. కలహశీల ధోరణిలో అడ్డూ అపూ లేని రీతిలో ఈ సమస్యల విషయమై డెమొక్రాట్లను ఆయన తీవ్రంగా విమర్శించారు మొరటు భాషలో దుర్భాషలాడారు. అయినప్పటికీ అమెరికన్ ఓటర్లు ఆయన మొరటుతనం, ముతక విమర్శల పట్ల ఎటువంటి అభ్యంతరం, ఆక్షేపణ తెలుపకపోవడం నన్ను చాలా విస్మయానికి గురిచేసింది.

డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఎందుకు పరాజయం పాలయ్యారో తరచి చూద్దాం. ఎన్నికల ప్రచారంలో ఆమె ప్రాధాన్యతతో ప్రస్తావించిన అంశాలు ఏవీ అత్యధిక ఓటర్ల మనసులు, హృదయాలలో ప్రతిధ్వనించనే లేదు. గర్భస్రావం, మహిళల హక్కులు, రాజ్యాంగ మాన్యత, జాతుల మధ్య సమానత్వం, మత సామరస్యం, కరుణశీలత, దయా స్వభావం మొదలైన వాటిని ఆమె ప్రస్తావించారు. ట్రంప్‌పై కమలా హారిస్ చేసిన పోరాటంలో ఈ విలువలు ఓడిపోయాయి. వాటి



అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నికల ఫలితం ఇతర దేశాలలోని ఎన్నికలను ప్రభావితం చేస్తుందా? చేయగలదు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఉపయోగించిన మొరటు భాష, ప్రజలలో విభేదాలు చీలికలు సృష్టించిన వ్యాఖ్యల వైనాన్ని అనుకరించేందుకు ట్రంప్ విజయం ఇతర దేశాలలోని నాయకులను పురిగొల్పవచ్చు. ట్రంప్ ప్రచార నమూనా ఒక ఒరవడి అయితే అది ప్రజాస్వామ్యానికి ఘోర పరాజయం అవుతుంది, సందేహం లేదు.

పట్ల రిపబ్లికన్ పార్టీ అభ్యర్థికి కనీస గౌరవం కూడా లేదు.

ప్రపంచ వ్యాప్తంగా అసంఖ్యాక ప్రజలను కలవరపెడుతున్న వివిధ అంశాలు అమెరికా ఎన్నికల ప్రచారంలో కనీస ప్రాధాన్యం కూడా పొందలేదు! మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్ దురాగతాలకు 44 వేల మంది పాలస్తీనియన్లు హతమవడం (వీరిలో మహిళలు, బాలలే అత్యధికంగా ఉన్నారు, ఐక్యరాజ్యసమితి సిబ్బంది కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారు), ఉక్రెయిన్ భూభాగాలను రష్యా దురాక్రమించిన విషయం పెద్దగా ప్రస్తావనకే రాలేదు. తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలను అమెరికా ప్రజలు పూర్తిగా మరచిపోయినట్లుగా కనిపిస్తోంది అమెరికా భూభాగాలపై దాడి చేసేందుకు వీలైన ఖండాంతర క్షిపణుల ప్రయోగ పరీక్షలను ఉత్తర కొరియా విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ఇరు పార్టీల అభ్యర్థులూ మరచిపోయినట్టున్నారు. పలు దేశాలలో అంతర్యుద్ధాలు, ప్రజాస్వామిక దేశాలుగా పిలవడబడుతున్న దేశాలలో పౌర స్వేచ్ఛల అణచివేతను అభ్యర్థులు గానీ, ఓటర్లు గానీ పట్టించుకోనే లేదు. ఈ అంతర్జాతీయ ఉపద్రవాలను అలా ఉంచితే తాము ఓటు వేస్తున్న (అంతిమంగా గెలిచిన) అభ్యర్థిని ఒక దోషిగా న్యాయస్థానం నిర్ధారించిందని, శిక్ష ఖరారు కావచ్చనే వాస్తవాన్ని కూడా అమెరికన్ ఓటర్లు పూర్తిగా విస్మరించారు.

ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు అమెరికా ఓటర్లను ఎలా ప్రభావితం చేశాయి? అమెరికాను ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశంగా రూపొందించిన స్వేచ్ఛా వాణిజ్య విధానాలు, తక్కువ సుంకాలు, గుత్తాధిపత్య వ్యతిరేక చట్టాల ఉపసంహరణ గురించి వారు ఏ మాత్రం పట్టించుకోనే లేదు. డోనాల్డ్ ట్రంప్ విజయానికి అమితంగా ఆనందపడిన కార్పొరేట్ శక్తులు చమురు, ఔషధాల తయారీ, అధునాతన సాంకేతికతలకు సంబంధించిన బహుళ జాతి కంపెనీలే సుమా!

అమెరికా ఓటర్లు అంతిమంగా తాము ముందే ఏర్పరచుకున్న ఇష్టాయిష్టాల, పాక్షికాభిప్రాయాల ప్రకారమే ఓటు వేశారు. పురుష ఓటర్లు ట్రంప్‌ను ఎక్కువగా ఇష్టపడ్డారు. యువ ఓటర్లు (18–29 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు) ట్రంప్‌నే ఎంచుకున్నారు. కార్మిక శ్రేణులకు చెందిన ఓటర్లూ ట్రంప్‌నే ఇష్టపడ్డారు. పట్టభద్రులు కాని ఓటర్లు ట్రంప్‌కే ప్రాధాన్యమిచ్చారు. లాటినో ఓటర్లు (మెక్సికన్లు, ప్యూరిటోరికన్లు, క్యూబన్లు) ట్రంప్‌నే ఎంచుకున్నారు. ఒక పచ్చి నిజాన్ని నిర్మొగమాటంగా చెప్పి తీరాలి. పైన ప్రస్తావిత ఓటర్లు అందరూ కమలా హారిస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. కారణమేమిటి? ఆమె జెండర్, కలర్ ప్రధాన కారణం. జెండర్ రీత్యా మహిళ, వర్ణం (కలర్) రీత్యా నల్ల జాతి స్త్రీ కదా కమలా హారిస్.

ప్రపంచ ఏకైక అగ్రరాజ్యం అమెరికా. మరి ఆ దేశాధ్యక్ష పదవీ ఎన్నికల ఫలితం ఇతర దేశాలలోని ఎన్నికలను ప్రభావితం చేస్తుందా? చేయగలదు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఉపయోగించిన మొరటు భాష ప్రజలలో విభేదాలు చీలికలు సృష్టించిన వ్యాఖ్యల వైనాన్ని అనుకరించేందుకు ట్రంప్ విజయం ఇతర దేశాలలోని నాయకులను పురిగొల్పవచ్చు. ట్రంప్ ప్రచార నమూనా ఒక ఒరవడి అయితే అది ప్రజాస్వామ్యానికి ఘోర పరాజయం అవుతుంది, సందేహం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఒంగోలులో హేతువాద సభలు

మూఢనమ్మకాలు ఎంత తక్కువగా ఉంటే, ఆ దేశం అభివృద్ధి పథంలో అంత ముందుకుపోతుంది. హేతువాద నాస్తికోద్యమాల తోనే సమాజాభివృద్ధి జరుగుతుంది. మనదేశంలో తరతరాలుగా పెద్దలనుండి వస్తున్న ఆచారాలు సాంప్రదాయాల పేరుతో ప్రజలు ఛాందసభావాలను వదులుకోలేకపోతున్నారు. సైన్సు ఎంతగా అభివృద్ధి చెందినా తాతయ్యలు, అమ్మమ్మలు నూరిపోసిన దేవుడు, దెయ్యం, మంత్రాలు శాపాల బారినుండి బయటపడలేకపోతున్నారు. ఎంతచదువుకున్నా శాస్త్రీయదృక్పథ లోపించిన కారణంగా డాక్టర్లు సైతం మృత్యుంజయ యాగాలు చేస్తున్నారు. విద్యార్థులకు శాస్త్రీయవిద్య అందించాల్సిన కొందరు వైస్ చాన్సలర్లు యూనివర్శిటీలలోనే మృత్యుంజయ యాగాలు చేస్తున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో భూతవైద్యాన్ని కోర్సుగా పెడుతున్నారు. కొన్ని యూనివర్శిటీలలో వాస్తు జ్యోతిష్యాలను కోర్సులుగా పెట్టి, జనాన్ని మోసం చేసి బతకండని సర్టిఫికేట్లు ఇస్తున్నారు. పదార్థం సృష్టించబడదు, నాశనంకాదు, మార్పు చెందుతుంది అని విద్యార్థులకు బోధించే ఫిజిక్స్ ప్రొఫెసర్లు నోట్లో నుంచి లింగం తీసిన బాబా కాళ్ళకు సాష్టాంగపడుతున్నారు. సూర్యుడు చంద్రుడు భూమి ఒకదానిచుట్టు ఒకటి తిరిగేక్రమంలో సూర్యగ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడతాయని పాఠాలు చెప్పే సైన్సు టీచర్లు గ్రహణసమయంలో బయటకుపోతే అరిష్టమని దుప్పటి కప్పుకుని పడుకుంటున్నారు. ఆర్టికల్ 51ఏ (H)లో రాసుకున్న ప్రశ్నించేతత్వం, శాస్త్రీయ ఆలోచన, మానవవాదాన్ని పెంచటం ప్రతి పౌరుని బాధ్యత. ఆ సూత్రాన్ని అమలుపరచాల్సిన ప్రధాని మోడీ ఏకంగా సైన్సు కాంగ్రెసు సభలో, పురాణాలలో వినాయకుని తలను ఏనుగు తొండంతో అతికించడాన్ని ఆధునిక సర్జరీలతో పోల్చిచెప్పారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్న బాబాల కాళ్ళకు గవర్నర్లు, సీఎంలు, ఐఏఎస్, ఐపీఎస్‌లు సాష్టాంగపడుతూ రాజ్యాంగంలోని లౌకిక వాదాన్ని మంటగలుపుతున్నా అడిగేవారు లేరు.

ఈ నేపథ్యంలో, ప్రజలను శాస్త్రీయవిజ్ఞానం ద్వారా చైతన్యపరచేందుకు ఏపీ హేతువాదసంఘం నవంబరు 9, 10 తేదీలలో ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్ (సీపీఐ) కార్యాలయంలో మహాసభలు నిర్వహిస్తున్నది. కె.శ్రీనివాస్, ముప్పాళ్ళ సుబ్బారావు, బి.సాంబశివరావు, రమేష్, కొడాలి శ్రీనివాసరావు, డాక్టర్ సమరం, బీరం సుందరరావు, నార్నె వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొంటారు.

– హేతువాదసంఘం
ఆంధ్రప్రదేశ్

'ఉపాధి హామీ' ఆశయానికి తూట్లు!

మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. ఈ చట్టానికి గత పదేళ్ళుగా అవసరమైన దాని కంటే ఎక్కువ నిధులు సమకూర్చామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మన రాష్ట్రంలో ఉపాధి హామీ ద్వారా పల్లెలకు పండుగ తేవాలని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే రోజు 13వేలకు పైగా పంచాయితీలలో గ్రామ సభలు జరిపి గిన్నిస్ బుక్ రికార్డు వైపు పయనిస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ప్రజలలో పనిచేసే సామాజిక సంఘాలు, ప్రజా సంఘాలు మాత్రం ఇందుకు భిన్నమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టానికి ఉసురు తీస్తున్నాయని; బడ్జెట్‌లో భారీగా కోత పెట్టాయని; లక్షలాది మంది పేదలకు జాబ్ కార్డులు రద్దు చేసాయని; పేదల కోసం వచ్చిన నిధులను కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులకు కట్టబెట్టడానికి మెటీరియల్ కాంపోనెంట్ పెంచి సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ భవనాలకు మళ్ళించి పేదల పొట్ట కొడుతున్నాయని వాదిస్తున్నాయి. మరోపక్క గ్రామీణ సంపన్నులు ఉపాధి హామీ ద్వారా వ్యవసాయ పనులకు వ్యవసాయ కూలీలు దొరకడంలేదని, ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని వాదిస్తున్నారు. ఈ వాదనలన్నిటిలో వాస్తవమేమిటో పరిశీలించాల్సిన అవసరం ఉన్నది.

వామపక్ష పార్టీల ప్రోద్బలంతో 2005 యూపీఏ ప్రభుత్వంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ఈ చట్టం ఉపోద్ఘాతంలో పేర్కొన్నదాని ప్రకారం– దీని ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం కంటే కూడా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యం. జమ్మూ, కశ్మీర్ మినహా గ్రామీణ ప్రాంతాలలో నివసించే 18 సంవత్సరాలు నిండి జాబు కార్డు పొందిన ప్రతి ఒక్కరూ అర్హులే. జాబు కార్డు పొందిన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఒకవేళ పని చూపకపోతే మొదటి నెల రోజులు 30శాతం, నెల తర్వాత 50శాతం నిరుద్యోగ భృతి చెల్లించాలని చట్టంలో పొందుపరిచారు.


ఈ చట్టం బాగా అమలు జరిగిన చోట పేదల వలసలు కొంత తగ్గాయి. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం పెంచుకోవటానికి దోహదపడింది. పేదల కొనుగోలు శక్తి పెరిగింది. స్త్రీ పురుషులకు సమాన వేతనం, ఒంటరి మహిళలకు, ప్రత్యేక ప్రతిభావంతులకు సామాజిక న్యాయం కలిగింది. కరోనా సమయంలో కూడా పేదలు ఆకలి చావులు సంభవించకుండా కాపాడింది. రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌తో పాటు అనేకమంది ఆర్థిక వేత్తలు సంక్షోభ సమయంలో మన భారతదేశానికి ఒక చేయూతగా ఈ పథకం ఉపయోగపడిందని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్ సైతం ఈ చట్టాన్ని కొనియాడింది.

ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఏటేటా బలహీనపరుస్తూ వస్తున్నది. కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, భారీ స్థాయిలో జాబ్ కార్డులు తొలగించడం, చేసిన పనికి నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం, రెండు పూటలా పని చేయాలనటం, ఆన్‌లైన్ మస్టర్ విధానం, సమ్మర్ అలవెన్స్ ఎత్తివేయడం... ఇలాంటి చర్యలతో పేదలే 'మాకు ఈ పని వద్దు బాబో!' అనేలా చేస్తున్నది.

2020–21లో ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో లక్ష 9వేల కోట్ల రూపాయలు కేటాయిస్తే, నేడు దాన్ని రూ.81వేల కోట్లకు కుదించింది. 2021లో వేతన రేటు రూ.255 ఉంటే నేడు రూ.305కు పెరిగింది. పెరిగిన వేతనం ప్రకారం బడ్జెట్‌లో కనీసం లక్షా 30వేల కోట్లకు పెరగాలి. 2020–21లో దేశ వ్యాప్తంగా పనిచేసిన కుటుంబాలు 7.55కోట్లు ఉంటే 2023లో ఆ సంఖ్య 4.68 కోట్లకు పడిపోయింది. 2020–21లో సగటున కుటుంబానికి 52 రోజులు పని కల్పిస్తే నేడు అది 47 రోజులకు పడిపోయింది. అప్పుడు 71,97,090 కుటుంబాలు వంద రోజులు పని చేయగా నేడు ఆ సంఖ్య 44,97,113కు తగ్గింది. దేశ వ్యాప్తంగా ఒక్క పనిదినం కూడా నమోదు కాని పంచాయితీలు 13,467 ఉన్నాయంటే ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం ఎంత దారుణంగా దెబ్బతీసిందో అర్థమవుతుంది.

మన రాష్ట్రంలోని లెక్కలు పరిశీలిస్తే– భారతదేశంలోనే ఈ మధ్యకాలంలో అత్యధిక జాబు కార్డులు తొలగించిన రాష్ట్రం మనదే. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2020–21 సంవత్సరంలో ఉమ్మడి 13 జిల్లాల్లో 94,91,834 జాబు కార్డులుంటే నేడు అవి 68,52,487కు తగ్గాయి. ఈ నాలుగేళ్ళలో 26,39,347 లక్షల కార్డులను (28 శాతం) తొలగించారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం జాబు కార్డులు తొలగించలేదని బుకాయిస్తుంది. ఉదా: ఉపాధి హామీ చట్టం ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో 2020–21లో 770 కుటుంబాలకు 52,949 పని దినాలు కల్పిస్తే అదే గ్రామంలో నేడు కేవలం 34,219 పని దినాలు నమోదయ్యాయి. 2006 ఫిబ్రవరి 2న సాక్షాత్తు ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రారంభించిన గ్రామం పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన గ్రామాల సంగతి చెప్పవలసిన అవసరం లేదు. ఈ లెక్కలన్నీ పరిశీలించకుండా గ్రామాలలో పండుగలు చేస్తామంటున్న ఉప ముఖ్యమంత్రి మాటలు గాలిమూటలు తప్ప వాస్తవాలు కాదు.

ప్రారంభంలో నిబంధనల ప్రకారం ఉపాధి నిధులలో 90 శాతాన్ని పేదలకు పని కల్పించడం ద్వారా ఖర్చు చేయాలి. 10 శాతం మాత్రమే మెటీరియల్ కోసం ఖర్చు చేయాలి. అది కూడా యంత్రాలను ఉపయోగించరాదని చట్టంలో పొందుపరిచారు. నేడు ఆ నిబంధనలకు బీజేపీ మంగళం పాడింది. కూలీలు చేసే పనులకు వేతనం తగ్గించి కాంట్రాక్టర్లు, యంత్రాలకు ఉపాధి కల్పించడానికి 10 శాతం నుంచి 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ పెంచి పేదల కడుపు కొట్టారు.



ప్రారంభంలో నిబంధనల ప్రకారం ఉపాధి నిధులలో 90 శాతాన్ని పేదలకు పని కల్పించడం ద్వారా ఖర్చు చేయాలి. 10 శాతం మాత్రమే మెటీరియల్ కోసం ఖర్చు చేయాలి. అది కూడా యంత్రాలను ఉపయోగించరాదని చట్టంలో పొందుపరిచారు. నేడు ఆ నిబంధనలకు బీజేపీ మంగళం పాడికూలీలు చేసే పనులకు వేతనం తగ్గించి కాంట్రాక్టర్లు, యంత్రాలకు ఉపాధి కల్పించడానికి 10 శాతం నుంచి 40శాతం మెటీరియల్ కాంపోనెంట్ పెంచి పేదల కడుపు కొట్టారు.

దీనికి ఒక మెట్టు పైకెక్కి, మన రాష్ట్ర ప్రభుత్వం 13వేల పంచాయతీలలో ఒకే రోజు గ్రామ సభలు జరిపి ఇందులో ప్రజల భాగస్వామ్యం లేకుండా ఉపాధి నిధులను సిమెంటు రోడ్లకు, ఆసుపత్రులకు, హార్టికల్చర్‌కు ఖర్చు చేయాలని నిర్ణయం చేయడం దుర్మార్గం. వీటిని రాష్ట్ర ప్రభుత్వం తన నిధుల ద్వారా నిర్మిస్తే ఎవరూ అభ్యంతరం చెప్పరు. కానీ పేదలకు ఉపాధి కల్పించడం కోసం వచ్చిన నిధులను గ్రామ పంచాయితీలతో నిమిత్తం లేకుండా కాంట్రాక్టర్లతో ఈ పనులు చేయడమంటే పేదలకు అన్యాయం చేయడమే, గ్రామ సభలను నిర్వీర్యం చేయడమే.

ఈ పథకం పట్ల వ్యతిరేకత కలిగిన గ్రామీణ సంపన్న వర్గాలు చట్టం రావటం వల్ల వ్యవసాయ పనుల్లో కూలీల కొరత ఏర్పడిందని దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ చట్టాన్ని ఎత్తివేయాలి లేదా వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయటమంటే భూస్వాముల పొలాల్లో ఉపాధి హామీ కూలీలు నాట్లు నుంచి కోతల దాకా పనిచేయాలి. వేతనాలను ప్రభుత్వం ఇచ్చే ఉపాధి నిధుల ద్వారా తీసుకోవాలి. ప్రస్తుతం అన్ని వ్యవసాయ పనుల్లో కూలీల పని తగ్గి యంత్రాలతో పని చేయిస్తున్నారు. ఈ లెక్కన కూలీల కోసం వచ్చిన ఉపాధి నిధులను కాంట్రాక్టర్లకు, పెత్తందార్లకు కట్టబెట్టి కూలీల కడుపుగొట్టడమే జరుగుతుంది. అసలు ఉపాధి చట్టం వచ్చిందే– వ్యవసాయ పనులు లేని సమయంలో చన్నీళ్ళకు వేడినీళ్ళు తోడైనట్లు పేదలు వలస పోకుండా కుటుంబానికి 100 రోజులు పని కల్పించి పట్టెడన్నం పెట్టడానికి! ఇది పెత్తందార్లకు ఇష్టం లేదు.

వ్యవసాయానికి అనుసంధానం చేయాలా వద్దా? అని అధ్యయనం చేయడానికి 2012లో నాటి యూపీఏ ప్రభుత్వం బీజేపీ పార్లమెంట్ సభ్యురాలు మిహిర్షా నాయకత్వంలో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ దేశవ్యాప్తంగా పర్యటించి ఇప్పటికే వ్యవసాయానికి అనుబంధంగా భూ అభివృద్ధి, పంట కాలువలు తవ్వడం, చెరువుల పూడిక తీయడం, గట్లు వేయడం, భూగర్భ జలాలు పెరగడానికి చెక్‌డ్యాంలు నిర్మించడం లాంటి 28 రకాల పనులు జరుగుతున్నాయి. కాబట్టి వ్యవసాయానికి అనుసంధానం చేయనవసరం లేదని పార్లమెంట్‌కు నివేదిక సమర్పించింది.

ప్రస్తుత కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆ నివేదికకు తిలోదకాలు ఇచ్చి 10శాతం మెటీరియల్ కాంపోనెంట్‌ను 40 శాతానికి పెంచి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా ఉపాధి హామీ నిధులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టాలని చట్టాన్ని సవరించింది. ఇది చాలదన్నట్టు మన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకుండా పేదల కోసం వచ్చిన ఉపాధి హామీ నిధులను సిమెంట్ రోడ్లకు, ప్రభుత్వ భవనాలకు, ఉద్యాన పంటలకు, లైబ్రరీ భవనాలకు మళ్లించి పేదలకు ద్రోహం చేస్తున్నది.

వ్యవసాయ సంక్షోభం, దారిద్ర్యం, ఆకలి చావులు సంభవిస్తున్న ఈ దేశానికి ఉపాధి హామీ చట్టం ఒక వరం. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని అదే స్ఫూర్తితో అమలు జరిగేలా చూడాలి. దీనిని గ్రామాలతో పాటు పట్టణాలకూ విస్తరింపచేయాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి. వీటి సాధన కోసం పెద్దఎత్తున పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

■ వి. వెంకటేశ్వర్లు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

ఆకాశవీధిలో..

కృష్ణానదిపై సీప్లేన్ సెమీ ట్రయల్ రన్ అదుర్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రకాశం బ్యారేజీ చెంతన, పున్నమి ఘాట్ తీరాన కృష్ణానదిపై శుక్రవారం సీప్లేన్ విన్యాసాలు పర్యాటకులను ఆకర్షించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సీప్లేన్ ట్రయల్ రన్‌ను ప్రారంభించడంతో పాటు సమీక్ష జరపనున్న నేపథ్యంలో శుక్రవారం సెమీ ట్రయల్ రన్ నిర్వహించారు. ఏవియేషన్ అధికారులు, సీప్లేన్ నిర్వాహకులు, జిల్లా అధికారులు, పోలీసుల సమక్షంలోనే ఈ సెమీ ట్రయల్ రన్ జరిగింది. హరిత బెర్మ్‌పార్క్‌లో జరిగిన ఈ విన్యాసాలను చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం ఉదయాన్నే గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి సీ ప్లేన్‌ను తీసుకొచ్చి వాటర్‌జెట్టీ వద్ద నిలుపుదల చేశారు. ఆ తర్వాత గంటకు సెమీ ట్రయల్ రన్ జరిగింది. నీటిపై విమానం దూసుకుపోవటంతో పర్యాటకులు ఆసక్తిగా చూశారు. ప్రకాశం బ్యారేజీ, బరమ్ పార్కు, భవానీ ద్వీపం మీదుగా చక్కర్లు కొట్టింది. చివరిగా శ్రీశైలం వెళ్లింది.

నేటి ట్రయల్ రన్ ఇలా..

శనివారం ఉదయం 9 గంటలకు ప్రకాశం బ్యారేజీ దగ్గర, పున్నమిఘాట్ సమీపాన సీ ప్లేన్ ల్యాండ్ అవుతుంది. దీనిని జెట్టీ పాయింట్ వద్ద పార్క్ చేస్తారు. ముందుగా ఐఅండ్‌ఐ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, విమాన తయారీ సంస్థ అయిన డీ హవిలాండ్ (డీహెచ్) ఎయిర్‌క్రాఫ్ట్ ఆఫ్ కెనడా లిమిటెడ్ అధికారులు ర్యాన్ డెబ్రుస్కీ, యోగేష్ గార్గ్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఆర్‌సీఎస్ ఉడాన్ సీప్లేన్లకు సంబంధించి ఏవీ ప్రదర్శిస్తారు. అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు. ఆ తర్వాత ట్రయల్ రన్‌కు ఆహ్వానించిన వారిని విమానంలోకి ఎక్కించుకుని శ్రీశైలం బయల్దేరుతారు. ఈ ప్లేన్ శనివారం మధ్యాహ్నానికి శ్రీశైలం వెళ్తుంది. ఈ రన్‌తో దక్షిణ భారతదేశంలో ఈ ఘనత సాధించిన రెండో రాష్ట్రంగా ఏపీ నిలవనుంది. విజయవాడ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సీప్లేన్‌లను రూపొందించారు.



నేటి ట్రయల్ రన్‌కు విస్తృత ఏర్పాట్లు

- సీఎం చంద్రబాబు రానుండటంతో భద్రత కట్టుదిట్టం
- పర్యాటకులతో కిటకిటలాడిన పున్నమి ఘాట్
- ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు, పోలీసులు



రెండున్నర గంటల్లోనే శ్రీశైలానికి..

విజయవాడ-శ్రీశైలం మధ్య రాకపోకలు సాగించే పర్యాటకులు, భక్తులను దృష్టిలో పెట్టుకుని ఈ సీప్లేన్ సేవలను ప్రభుత్వం ప్రారంభిస్తోంది. దీనిద్వారా పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కనుంది. ఈ సరికొత్త సీప్లేన్‌లో మొత్తం 14 సీట్లు ఉంటాయి. విజయవాడ-శ్రీశైలం మధ్య రోడ్డు, రైలుమార్గం కంటే అతి తక్కువ సమయంలో శ్రీశైలం వెళ్లొచ్చు. ఇందుకు కేవలం రెండున్నర గంటల సమయమే సరిపోతుంది. షెడ్యూల్, టికెట్ల రేట్లను త్వరలోనే ప్రకటిస్తారు. కాగా, సీప్లేన్ సేవలపై పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక రంగానికి ఇది ఎంతో తోడ్పాటు నందిస్తుందని పర్యాటకాభిమానులు చెబుతున్నారు.





పటిష్ట బందోబస్తు

వన్‌టౌన్ : పున్నమిఘాట్ వద్ద కృష్ణానదిపై శనివారం ట్రయల్ రన్ జరుగుతుండటం, సీఎం చంద్రబాబు రానుండటంతో పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు శుక్రవారం ఘాట్ పరిసరాలను పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రత, పార్కింగ్, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు సూచనలు చేశారు. సీపీ వెంట ఇన్‌చార్జి కలెక్టర్ నిధిమీనా, డీసీపీలు గౌతమీశాలి, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్ష

కృష్ణలంక : సీప్లేన్ ట్రయల్ రన్ కార్యక్రమం విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ నిధిమీనా సూచించారు. ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు బబ్బూరి గ్రౌండ్స్‌లో శుక్రవారం సాయంత్రం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు శనివారం ఉదయం 10.45 గంటలకు పున్నమి ఘాట్ వద్దకు చేరుకుంటారని చెప్పారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు పలు సూచనలు చేశారు.

ఇక అధికారిక రక్షలు

దుర్గగుడిలో అనధికారిక రక్షల వ్యాపారానికి బ్రేక్

- ఈవో ఆకస్మిక తనిఖీల్లో నిర్ణయం
- త్వరలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు
- పురోహితుడి నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై భక్తులకు అనధికారికంగా విక్రయిస్తున్న రక్షలకు అడ్డుకట్ట పడింది. అంతేకాదు.. ఇకపై భక్తులకు శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోనే రక్షలను విక్రయించనున్నారు. ఒక్కో రక్షను రూ.5కు విక్రయిస్తారు. ఇంద్రకీలాద్రిపై విచ్చలవిడిగా సాగుతున్న రక్షల అమ్మకాలపై 'ఆంధ్రజ్యోతి'లో 'ఇంద్రకీలాద్రిపై రక్షల వ్యాపారం' శీర్షికతో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై ఈవో కేఎస్ రామారావు స్పందించారు. అమ్మవారి ఆలయంతో పాటు ఉపాలయాలు, ఘాట్‌రోడ్డు వద్ద ఉన్న ఆలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు మూడు గంటల పాటు ఈ తనిఖీలు జరిగాయి. ప్రధానాలయం వద్ద రావిచెట్టు కింద శఠారి ఇచ్చే ప్రదేశంతో పాటు నటరాజస్వామి ఆలయం, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, ఘాట్‌రోడ్డు వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయంలో ఈ తనిఖీలు జరిగాయి. ఇక్కడ పళ్లాల్లో ఉన్న రక్షలు, నిమ్మకాయలను ఆయన స్వాధీనం చేసుకున్నారు. ఇకపై ఇలాంటి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్చకులను హెచ్చరించారు.

మిగతా 6లో..

దుర్గగుడిలో ఫిర్యాదుల బాక్స్

- దసరా ఉత్సవాల్లో ఏర్పాటు
- మాన్యువల్‌గా, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం
- కేశఖండన శాల, క్లోక్‌రూమ్, చెప్పులస్టాండ్, ప్రసాదాల కౌంటర్లపై అధిక ఫిర్యాదులు

6లో



'నాకు తెలియకుండానే వాట్సాప్ గ్రూపులో నన్ను ఎవరో యాడ్ చేశారు. ఆ విషయం తెలిసేటప్పటికీ చాలా టైమ్ పట్టింది. సుమారు 200 గ్రూపుల్లో నా నెంబర్ ఉంది. ఆ గ్రూపులను నేను ఎప్పుడూ చూడను. కొన్నింటిలో నుంచి బయటకు వచ్చేసినా మళ్లీ యాడ్ చేశారు.'

..నల్లగొండ నుంచి వచ్చిన ఓ యువకుడు సైబర్ క్రైం పోలీసులకు చెప్పిన మాట ఇది. వైసీపీ సోషల్ మీడియా సైకోలు చేస్తున్న మరో వికృత క్రీడకు ఇదొక నిదర్శనం. దొంగ వాట్సాప్ గ్రూపులు సృష్టించి, అందులో తెలియని, తెలిసిన వారిని సైతం యాడ్ చేసి, సీఎం, డిప్యూటీ సీఎం టార్గెట్‌గా అసభ్యకర పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి వందల గ్రూపులు ఇప్పుడు పోలీసుల విచారణలో బయటపడగా, సుమారు 200 మందికి నోటీసులు జారీ చేశారు.



వాట్సాప్.. హ్యాండ్సప్..

వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ సోషల్ మీడియా వికృత చేష్టలు

- సీఎం, డిప్యూటీ సీఎం టార్గెట్‌గా గ్రూపుల్లో పోస్టులు
- సభ్యులుగా ఎంతోమంది అమాయకులు
- తెలియని వారిని సైతం గ్రూపుల్లో యాడ్ చేస్తున్న వైనం
- వందల్లో వెలుగుచూస్తున్న వాట్సాప్ గ్రూపులు
- సుమారు 200 మందికి సైబర్ పోలీసుల నోటీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కూటమి ప్రభుత్వంలోని మంత్రులు, వారి కుటుంబ సభ్యులు.. ముఖ్యంగా సీఎం, డిప్యూటీ సీఎంలను లక్ష్యంగా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా సామాజిక మాధ్యమాల్లో అత్యంత జుగుప్సాకరంగా పోస్టింగ్‌లు పెడుతున్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు 47 కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్ వేదికల్లో ఈ అసభ్యకర పోస్టింగ్‌లను కనుగొన్నారు. అయితే, కథ ఇక్కడితో ఆగిపోలేదు.

తెలియకపోయినా గ్రూపులో సభ్యుడే..

విచారణకు హాజరైన తెలంగాణలోని నల్లగొండకు చెందిన యువకుడు ఈ పోస్టింగ్‌లతో తనకు సంబంధం లేదని చెప్పాడు.

మిగతా 6లో..

200 వాట్సాప్ గ్రూపులు

అసభ్యకరమైన పోస్టింగ్‌లను స్క్రీన్‌షాట్లు తీస్తున్న కొంతమంది వాట్సాప్‌ల్లో ఇతరులకు పంపుతున్నారు. ఇందుకోసం వేర్వేరు పేర్లతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆ గ్రూపుల్లో ఈ పోస్టింగ్‌లు చూసి ఎవరైనా, ఏదైనా వ్యాఖ్యలు చేస్తే, వాటిని కాపీ చేసుకుని అసలు పోస్టింగ్‌ల కింద పెడుతున్నారు. ఈవిధంగా ఏర్పాటు చేసుకున్న గ్రూపుల్లో వైసీపీ సానుభూతిపరులనే కాకుండా పార్టీకి ఏమాత్రం సంబంధం లేని వారి నెంబర్లను కూడా యాడ్ చేసి సభ్యులను చేస్తున్నారు. ఈవిధంగా 200 వరకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసినట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఈ గ్రూపులకు అడ్మిన్‌లుగా ఉన్న వారితో పాటు అందులో ఉన్న సభ్యులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వాట్సాప్‌లోనే పంపుతున్నారు. ఇప్పటికే అనంతపురం, విశాఖపట్నం, బెంగళూరు, నల్లగొండ, హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల్లో ఉన్నవారికి నోటీసులు అందజేసినట్టు తెలిసింది. గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉండటంతో పాటు పోస్టింగ్‌ల స్క్రీన్‌షాట్లను ఫార్వార్డ్ చేసినట్టు గుర్తించారు. ఇలా నోటీసులను వాట్సాప్‌ల్లో చూసిన వారిలో 80 మంది వరకు విజయవాడలోని సైబర్ క్రైం పోలీసుల విచారణకు హాజరయ్యారని తెలిసింది. పోలీసులు వారి స్టైల్లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మరికొంతమంది పోలీసులకు ఫోన్లు చేసి తమకేమీ సంబంధం లేదని చెప్పి వదిలేయమని వేడుకుంటున్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై నేడు తీర్పు

వెలువరించనున్న నూజివీడు కోర్టు

- బాపులపాడు మండలంలో వంశీ హయాంలో పేదలకు పట్టాలు
- సామాజిక కార్యకర్త సూర్యనారాయణ పిటిషన్‌పై విచారణ పూర్తి

విజయవాడ/హనుమాన్ జంక్షన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పదవిలో ఉండగా పంపిణీ చేసిన నకిలీ పట్టాల వ్యవహారంపై నూజివీడు కోర్టు శనివారం తీర్పు ఇవ్వనుంది. ఈ పిటిషన్‌పై సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 2014-19, 2019-2024 మధ్య వంశీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ సమయంలో బాపులపాడు మండలంలో కొంతమంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అవన్నీ నకిలీ పట్టాలని కోడూరుపాడు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చందు సూర్యనారాయణ నూజివీడు కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయవాదులు కిలారు బెనర్జీ, కిలారు మిథున్‌లు దాఖలు చేశారు. దీన్ని స్వీకరించిన న్యాయస్థానం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావుతోపాటు 40 మందిని కోర్టు విచారించింది. వారి వాంగ్మూలాలు నమోదు చేసుకుంది. నాడు పంపిణీ చేసిన పట్టాలను కోర్టు పరిశీలించింది. 2019 ఎన్నికల సమయంలో లబ్ధి పొందడానికి బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో పేదలకు నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న వంశీమోహన్ అప్పటి బాపులపాడు తహసీల్దార్ కె.గోపాలకృష్ణ సంతకాన్ని ఫోర్జరీ చేసి పోరంబోకు, ప్రభుత్వ భూముల్లో నివసించే పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. పేదలకు పట్టాలు ఎర చూపించి ఎన్నికల్లో ఓట్ల ద్వారా లబ్ధి పొందడానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో నకిలీ పట్టాలు తయారు చేసి తన అనుచరులతో పేదలకు అందజేశారు. పట్టాలపై సర్వే నంబరు, సరిహద్దులు లేకుండా పంపిణీ చేయడంతో ఇవన్నీ నకిలీవని దుమారం రేగింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావు ఈ విషయాన్ని బట్టబయలు చేశారు. ఫోర్జరీ సంతకాలు చేసి పట్టాలు పంపిణీ చేశారని తహసీల్దార్ నరసింహారావు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


టీడీపీ నుంచి వైసీపీలోకి మారడంతో..

టీడీపీ నుంచి వైసీపీలోకి మారడంతో ప్రధాన నిందితుడుగా వంశీ మోహన్ పేరును చార్జిషీటులో నమోదు చేయకుండా స్థానిక నాయకులను మాత్రమే చేర్చారు. కోడూరుపాడు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చందు సూర్యనారాయణ నకిలీ పట్టాలు పంపిణీ వ్యవహారంపై 2023లో నూజివీడు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ కేసు వేశారు. ఈ కేసుకు సంబంధించి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో పాటు గన్నవరం మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీరాణి, పెరికీడు ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బేతాళ ప్రమీలరాణి, బడుగు ఝాన్సీరాణి తదితరులను సాక్షులుగా విచారించారు. విచారణలో నకిలీ పట్టాలు పంపిణీ చేసినట్టు కోర్టు నిర్ధారణకు వచ్చింది. దీనిపై తీర్పును శనివారం వెలువరించనుంది.

అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సుకు స్థలాన్వేషణ

పరిశీలనలో మూలపాడు, కొండపల్లి, భవానీద్వీపం

6లో



6లో

బీసీల కోసం కాంగ్రెస్ పోరాటం

- వైసీపీ, టీడీపీ, బీజేపీలు.. బీసీలకు చేసిందేమీ లేదు
- వైఎస్ రాజశేఖరరెడ్డే బీసీల అభివృద్ధికి కృషి చేశారు
- కులగణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

మచిలీపట్నంలో కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రమాణస్వీకారంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



శయన బుద్ధవిహార్‌కు మంచిరోజులు

వైసీపీ ఐదేళ్ల నిర్లక్ష్యం తర్వాత కొత్త అంచనాలు

8లో



శబరిమల సేవలో ఆర్టీసీ, రైల్వే

- పెద్దసంఖ్యలో బస్సులు, రైళ్లు నడిపేందుకు ప్రణాళికలు
- 25 వరకు ప్రత్యేక రైళ్లకు రైల్వే ప్రతిపాదనలు
- నర్సాపూర్, కాకినాడ నుంచి ఆపరేషన్‌కు అవకాశం
- అద్దె ప్రాతిపదికన బస్సులు నడపనున్న ఆర్టీసీ
- నేరుగా పంబ వరకు సర్వీసులు
- గురుస్వామి, వంట మనిషికి ఉచిత ప్రయాణం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు అందుబాటులో బస్సులు, రైళ్లను నడిపేందుకు ఆయా సంస్థలు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాయి. డిసెంబరులో అయ్యప్పల తాకిడి ఎక్కువగా ఉండటంతో నవంబరు నెలాఖరుకే షెడ్యూల్స్ ప్రకటించేందుకు రైల్వే, ఆర్టీసీ ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

● గతేడాది సాధారణ రైళ్లకు అదనంగా 15 స్పెషల్ రైళ్లను విజయవాడ డివిజన్ నుంచి శబరిమలకు నడిపారు. ఈసారి డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో 25 వరకు ప్రత్యేక రైళ్లను నర్సాపూర్, కాకినాడల నుంచి ఎక్కువగా నడిపేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు ఆమోదించాల్సి ఉంది. దీనిపై మరో వారం రోజుల్లో స్పష్టత రానుంది.

● ఇంటర్ స్టేట్ పర్మిట్ల దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు నడపటం సాధ్యం కాకపోవడంతో సమూహంగా శబరిమల వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన బస్సులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమలకు భారీగా అద్దె బస్సులను ఆర్టీసీ సమకూర్చింది. ప్రైవేటు బస్సుల కంటే తక్కువ అద్దెకే బస్సులను కల్పిస్తోంది. దీనికి తోడు ఈ సమూహంతో వచ్చే గురుస్వాములు, వంట వారికి ఉచిత అవకాశం కల్పిస్తోంది. ఆర్టీసీ బస్సులు పంబ వరకు చేరుకుంటాయి. ప్రైవేటు బస్సులు పంబ వరకు వెళ్లటానికి అవకాశం లేదు. ఈ ఏడాది డిమాండ్‌కు అనుగుణంగా శబరిమలకు అద్దె ప్రాతిపదికన బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ప్లాన్ చేస్తోంది.

మైలవరంపై మాట్లాడే అర్హత జోగికి లేదు

- కొండపల్లి టీడీపీ కౌన్సిలర్ల ఆగ్రహం



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణశాఖ మంత్రి పదవి వెలగబెట్టిన ప్రస్తుత మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ సొంత ఇళ్ల నిర్మాణం చేసుకున్నాడే తప్ప ఏరోజైనా నియోజకవర్గంలో ఎన్ని జగనన్న లే అవుట్లను సందర్శించాడో, ఎంతమందికి ఇళ్లు కట్టించాడో చెప్పగలడా అని కొండపల్లి మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో వారు మాట్లాడుతూ, అడ్డగోలుగా భూములు కబ్జాచేసి దొంగ రిజిస్ట్రేషన్స్‌తో కొడుకును కూడా జైలు పాలు చేశాడన్నారు. రాజగోపాల్ తంతే పెడనకు, పెడన ప్రజలు తంతే మైలవరానికి దేవినేని ఉమా తంతే మరల పెడనకు పెడన నుంచి పెనమలూరుకు మారాడని అందుకే.. ఫుట్‌బాల్ ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే తాట తీస్తామని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ చుట్టకుదురు శ్రీనివాసరావు, కరిమికొండ శ్రీలక్ష్మి, మైలా సైదులు, రావి ఫణి, జనసేన నేత చెరుకుమల్లి సురేష్, అప్సర్, కొత్తపల్లి ప్రకాష్, భయ్యా రామోజీ, బసవ ఉమా, వంకా మురళీ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు దండుకున్న బీసీల ద్రోహి జోగి రమేష్ అని టీడీపీ మైలవరం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పటాపంచల నరసింహారావు దుయ్యబట్టారు.

మోటమర్రి బాబాప్రసాద్‌కు సతీ వియోగం



శ్రీదేవి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ సతీమణి మోటమర్రి శ్రీదేవి గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఆరోగ్యంగానే ఉన్న ఆమె మధ్యాహ్నం నిద్రపోయిన అనంతరం సరిగా స్పందించకపోవడంతో మచిలీపట్నం ఆంధ్రా ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. బాబాప్రసాద్‌ను మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్‌లు పరామర్శించారు. శ్రీదేవి భౌతిక కాయాన్ని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య, బత్తిన దాసు, సీతారామయ్య, కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణ ప్రసాద్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, గోపు సత్యనారాయణ, సనకా నాగులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా మోటమర్రి బాబాప్రసాద్‌ను పరామర్శించారు.

275 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



కంకిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈడుపుగల్లు గ్రామంలోని ఓ గోడౌన్‌లో సుమారు 275 బస్తాలు, సుమారు 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్టు పక్కా సమాచారంతో సివిల్ సప్లైస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. జాయింట్ కంట్రోల్ ఆఫ్ లీగల్ మెట్రాలజి బి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి పార్వతి ఘటనా స్థలానికి చేరుకొని రేషన్ బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈడుపుగల్లు గ్రామ పరిధిలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్టు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని, మరికొంత బియ్యం బయటకు తరలిపోయిందని, వాటి వివరాలను సేకరిస్తున్నామని తెలియజేశారు. దాడుల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఉస్మాన్, పలు గ్రామాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ దాంపత్యం..

- భార్య మృతిని తట్టుకోలేక ఆగిన గుండె




వెంకటరమణ, సుగుణవల్లి (ఫైల్)

పెడన, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆలుమగల అనురాగ దాంపత్యానికి నిదర్శనం ఈ దంపతులు. భార్య మృతిని తట్టుకోలేక తల్లడిల్లిన ఆ గుండె కూడా ఆగిపోయింది. పట్టణంలోని కరణం వారి వీధికి చెందిన సింగరాజు వెంకటరమణ, సుగుణవల్లిలు భార్యాభర్తలు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేని దాంపత్య బంధం వీరిది. దురదృష్టవశాత్తు సుగుణవల్లి గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆమె మరణంతో కుంగుబాటుకు గురైన వెంకటరమణ శుక్రవారం ఉదయం మృతిచెందారు. వీరిరువురికి శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. ఆదర్శ దంపతుల మరణంతో విషాదఛాయలు అలముకున్నాయి.

అంతర్జాతీయస్థాయి గోల్ఫ్ కోర్సుకు స్థలాన్వేషణ!

- పరిశీలనలో మూలపాడు, కొండపల్లి, భవానీద్వీపం
- అమరావతిలోనూ సాగుతున్న స్థలాన్వేషణ
- 2 ఏళ్లలో ఏర్పాటుకు కసరత్తు
- సుమారు 150 ఎకరాలు అవసరం



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌ను క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్పోర్ట్స్ పాలసీలో భాగంగా పలు విప్లవాత్మక నిర్ణయాలు ప్రకటించిన సీఎం చంద్రబాబు క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపైనా దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా అమరావతిలో కానీ పరిసర ప్రాంతాల్లో కానీ అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో అమరావతి ప్రాంతం హైదరాబాద్‌ను మించి అభివృద్ధి చెందుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రాజధాని ప్రాంతంలో అన్ని రంగాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. గోల్ఫ్ కోర్సు ఏర్పాటు కూడా అందులో భాగమే. గోల్ఫ్ కోర్సు ఏర్పాటుకు ఇప్పటికే స్థలాన్వేషణ ప్రారంభించారు. నాలుగైదు అనువైన ప్రాంతాలను గుర్తించి, సీఎం తుది ఆమోదం తర్వాత ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

కొద్ది రోజుల క్రితం ప్రముఖ క్రికెటర్, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కపిల్‌దేవ్ సీఎం చంద్రబాబును కలిశారు. ఆ



ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీ అయిన ప్రముఖ క్రికెటర్, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కపిల్‌దేవ్ (ఫైల్‌ఫొటో)

సమయంలో రాష్ట్రంలో గోల్ఫ్ క్రీడను అభివృద్ధి చేయడంపై ఇరువురూ చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సు క్లబ్‌ను ఏర్పాటు చేయాలని ఈ భేటీలో సూత్రప్రాయంగా ఓ నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో అనంతపురం, విశాఖపట్నంలో ప్రీమియర్ గోల్ఫ్ కోర్సు క్లబ్బులను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో కపిల్‌దేవ్‌తోపాటు విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ ఆసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) కూడా ఉన్నారు. గోల్ఫ్ కోర్సు ఎక్కడ ఏర్పాటు చేయాలి.. ఎంత మేర స్థలం అవసరం అవుతుంది.. ఎక్కడ స్థలం అందుబాటులో ఉంది అన్న విషయాల బాధ్యతను కేశినేని చిన్నికి అప్పగించారు.

నాలుగు చోట్ల పరిశీలన

అంతర్జాతీయ స్థాయిలో గోల్ఫ్ కోర్సును ఏర్పాటు చేయాలంటే కనీసం 150 ఎకరాలు అవసరం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద విస్తీర్ణంలో స్థలం ఎక్కడ అందుబాటులో ఉంటుందనే అంశంపై అధికారులు దృష్టి సారించారు. భవానీద్వీపం చెంతనే ఉన్న ద్వీపాల్లో విస్తీర్ణం పరంగా పెద్దగా ఉన్న ద్వీపాన్ని పరిశీలించగా, అక్కడ వరద ముప్పు ఉంటుందని, ఖరీదైన గోల్ఫ్ కోర్సు తరచూ ముంపు బారిన పడితే నష్టతీవ్రత ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో భవానీద్వీపం ఆప్షన్‌ను పక్కన పెట్టేశారు. కొండపల్లి, మూలపాడు ప్రాంతాల్లో భూముల లభ్యత సరిపడా ఉందని, అక్కడ ఏర్పాటు చేస్తే అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానదిలో నిర్మిస్తున్న వంతెన పూర్తయితే రాజధాని ప్రాంతానికి కూడా ఈ ప్రాంతాలు చేరువలో ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అమరావతి ప్రాంతంలో కూడా పలు స్థలాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే మున్ముందు అమరావతిలో భూ అవసరాలు చాలా ఉంటాయని, ఇక్కడ భూమి ధర కూడా భారీగా ఉంటుందనే ఉద్దేశంతో మూలపాడు, కొండపల్లి వైపు అధికారులు మొగ్గుచూపుతున్నారు. కొద్దిరోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

క్రీడాంధ్రగా తీర్చిదిద్దుతాం : కేశినేని చిన్ని

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చింది. యువతను గంజాయి మత్తులో ముంచేసింది. మా ప్రభుత్వం యువతను క్రీడల వైపు మళ్లించి రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చాల్సన్న ఆలోచనతో ముందుకు వెళుతోంది. మన దేశంలో గోల్ఫ్‌కు ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం లభిస్తోంది. రాష్ట్రంలో గోల్ఫ్‌ను ప్రమోట్ చేయాలన్న ఆలోచనతో ముందుకు వెళుతున్నాం. అనంతపురంలో కియా ఉద్యోగులు చాలామంది గోల్ఫ్ కోసం బెంగుళూరు వెళ్లి వస్తున్నారు. అమరావతి కూడా మున్ముందు గ్లోబల్ సిటీగా అభివృద్ధి చెందుతుంది. అప్పుడు గోల్ఫ్‌కు డిమాండ్ బాగా పెరుగుతుంది. క్రికెట్‌లో ఐపీఎల్ మాదిరి గోల్ఫ్ ప్రీమియర్ లీగ్‌లు నిర్వహించాలన్న ఆలోచన కూడా ఉంది. గోల్ఫ్ ప్రీమియర్ లీగ్‌లో ఏపీ నుంచి ఒక టీం ఉండాలన్నది మా ఆకాంక్ష. రెండేళ్లలో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

ఉచిత గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోండి

- మార్చి 31లోగా మొదటి సిలిండర్ బుక్ చేసుకోవచ్చు
- డెలివరీ అయిన 48 గంటల్లో ఖాతాకు డబ్బులు జమ
- సమస్యలుంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయండి



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో భాగంగా మొదటి సిలిండర్ బుక్ చేసుకోలేకపోతున్న వారు కంగారుపడాల్సిన అవసరం లేదు. చాలా మంది మహిళలు తాము బుక్ చేసుకోలేకపుతున్నామని ఆందోళన చెందుతున్నారు. సిలిండర్‌లో గ్యాస్ ఇంకా అవకపోవటం వల్ల చాలామంది బుక్ చేసుకోలేకపోతున్నారు. గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకోవటానికి మార్చి 31 వరకు సమయం ఉంది. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా ఈ విషయాన్ని మీడియాకు బులెటిన్ విడుదల చేస్తూ ప్రకటించారు. అర్హులైన వారందరికీ ఇప్పటికే ఈ పథకం కింద ఎంపికైనట్టుగా లబ్ధిదారులకు మెసేజ్‌లు వచ్చాయి. ఇలా మెసేజ్‌లు వచ్చిన వారంతా కూడా ఉచిత గ్యాస్ సిలిండర్ పొందటానికి అర్హులు సిలిండర్‌ను బుక్ చేసుకోవాలంటే మాత్రం గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లాలి. రైస్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా కాపీలను తీసుకువెళ్లి బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. బుక్ చేసుకున్న సిలిండర్ నేరుగా డెలివరీ బాయ్స్ ద్వారా ఇంటికే పంపిణీ చేస్తారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో దాని మొత్తం ధరను ఖాతాలో జమ చేయటం జరుగుతుంది. ఈ విషయంలో మహిళలు ఏవైనా సమస్యలు ఉన్నా, గ్యాస్ ఏజన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్‌లతో ఇబ్బందులు ఎదుర్కొంటే తక్షణం 1967 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాల్సిందిగా కలెక్టర్ నిధిమీనా సూచించారు. సమీప సచివాలయంలో ఫిర్యాదు చేసినా వెంటనే స్పందించటం జరుగుతుందని చెప్పారు.



వర్సిటీ స్విమ్మింగ్ చాంప్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులు

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ కె.శంకరరావు, కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. వర్సిటీ పరిధిలోని ఆరు కళాశాలల నుంచి స్విమర్లు పోటీపడ్డారు. పోటీల్లో 100 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఎస్.హర్షవర్ధన్ (ప్రథమస్థానం) టి.కార్తీకేయ(ద్వితీయ), ఎం.హర్షవర్ధన్(తృతీయ), 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో ఎండీ పర్వేజ్ మహరూఫ్, టి.కార్తికేయలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవశం చేసుకున్నారు. 50 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో ఎం.పర్వేజ్ మహరూఫ్, టి.కార్తికేయలు ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించినట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ బీసీహెచ్ సంగీతరావు తెలిపారు. వర్సిటీ సెలక్షన్ కమిటీ సభ్యులు డి.యుగంధర్, డి.హేమచంద్రరావులు పర్యవేక్షించారు.

తైక్వాండోకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో ఈనెల 12 నుంచి 15వరకు జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా తైక్వాండో చాంపియన్‌షిప్‌కు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేసినట్టు వర్సిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.బ్లెసీ నేహా(చినవుటపల్లి డాక్టర్ ఎస్‌అండ్ ఎస్ఆర్ఐ డెంటల్ కళాశాల), వల్లూరు ప్రియా(గుడివాడ డాక్టర్ గుర్రాజు ప్రభుత్వ హోమియో కళాశాల), ఎంవీఎస్ నేహితరెడ్డి(విశాఖ ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల) విద్యార్థులను ఎంపిక చేశామని, వీరికి కోచ్ కమ్ మేనేజర్‌గా ఆర్.గుర్నాజీ వ్యవహరిస్తారన్నారు.

17న విజయవాడ మారథాన్

లబ్బీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటంతో పాటు నడకను అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 17న విజయవాడ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరామ ఫైనాన్స్ విజయవాడ మారథాన్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మణి దీపక్ తెలిపారు. బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఎనిమిది మారథాన్‌లు నిర్వహించామని, ఇది తొమ్మిదవదని దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయటం జరిగిందని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికేట్, మెడల్‌తో పాటు ప్రతి విభాగంలో విజేతలకు నగదు బహుమతి అందజేయటం జరుగుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరికి టీషర్టు, ఆర్.ఎఫ్.ఐ.డి టైమింగ్ చిప్, బ్రేక్‌ఫాస్ట్ అందించనున్నట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం విజయవాడ రన్నర్స్ డాట్‌కామ్ ద్వారాగాని, 7815955123, 9885359330 నెంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

అర్ధరాత్రి 12 వరకు అనుమతివ్వండి

- డీజీపీకి హోటల్ వ్యాపారుల అసోసియేషన్ వినతి

ఆటోనగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు తెరిచి ఉంచేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను యథాతథంగా అమలుకు సహకరించాలని కోరుతూ ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధి బృందం శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసింది. 2018, 2022లో ప్రభుత్వం విడుదల చేసిన జీవో కాపీలను జత చేసి అందించినట్లు ఏపీ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి స్వామి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు హోటల్, రెస్టారెంట్లు తెరిచి ఉంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిన విషయాన్ని డీజీపీ వద్ద ప్రస్తావించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన ఉత్తర్వులను అనుమతివ్వాలని కోరామని, అందుకు ఆయన స్పందించి జోవోను విడుదల చేశారని గుర్తుచేశారు. అసోసియేషన్ ప్రతినిధులు అందించిన వినతిపత్రాన్ని పరిశీలించిన డీజీపీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏపీ హోటల్ అసోసియేషణ్ కార్యదర్శి ఎం. నాగరాజు, కోశాధికారి ఇ.వి పూర్ణచంద్, విజయవాడ హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు రమణ, కార్యదర్శి రాఘవలు పాల్గొన్నారు.



డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం

351/6తో అదరగొట్టిన రైల్వేస్..



అంచిత్ యాదవ్(151)

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీకే కల్నల్ నాయుడు ట్రోఫీ క్రికెట్‌లో రైల్వేస్ జట్టు అదరగొట్టింది. ఒక సెంచరీ, రెండు అర్ధసెంచరీలు చేశారు. ఆంధ్రా- రైల్వేస్ జట్ల మధ్య మూలపాడు వేదికగా మల్టీ డేస్ మ్యాచ్ శుక్రవారం ప్రారంభమైంది. జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 351/6 భారీ స్కోర్ చేసింది. అంచిత్ యాదవ్ 151 పరుగులు(187 బంతుల్లో 14 ఫోర్లు, 6 సిక్స్), ఇషాన్ గోయల్ 50 పరుగులు చేసి అవుట్ కాగా, జయంత్ లఖలాన్ 58 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆంధ్రా బౌలర్లు ఇస్మాయిల్, వై.వాసు, జె.సాకేత్‌రామ్‌లు రెండేసి వికెట్లు తీశారు.

పెదపారుపూడిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన
- జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం, పీహెచ్‌సీ సందర్శన

పెదపారుపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదపారుపూడి తహసీల్దార్ కార్యాలయాన్ని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 'మీ కోసం' అర్జీల పరిష్కారం.. ఇచ్చిన ఎండార్స్‌మెంట్లు పరిశీలించారు. భూ సమస్యలకు, ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించిన ఫైళ్లు, ఆర్డీవో రిజెక్షన్స్ మ్యుటేషన్స్ ఫైళ్లు రాండమ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిష్కారం పెండింగ్ లేకుండా సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, ఆ విషయం అర్జీదారులకు తెలియజేయాలని తహసీల్దార్ రంగారావుకి తెలిపారు.

అనంతరం పెదపారుపూడిలో జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కలెక్టర్ సందర్శించి మధ్యాహ్న భోజనం అమలు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసి విద్యార్థులతో ముచ్చటించారు. శుక్రవారం మెనూ ప్రకారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు అందించారా లేదా పరివీలించారు. పెదపారుపూడి పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ ఆరాతీశారు. రోగులకు అందుబాటులో ఉన్న మందులు పరిశీలించారు. రికార్డులు పరిశీలించి లేబరేటరీ తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ డి.సాగరిక ఆసుపత్రిలో ఓపి రోగులకు అందిస్తున్న వైద్యసేవలను గురించి కలెక్టర్‌కు వివరించారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వై.రగంఆరావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి కలెక్టర్ వెంట ఉన్నారు.

బీసీల కోసం కాంగ్రెస్ పోరాటం

మచిలీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని.. భవిష్యత్తులో బీసీల కోసం పోరాటాలు చేస్తామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా శొంఠి నాగరాజు ప్రమాణస్వీకార కార్యక్రమం మచిలీపట్నంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ అన్ని పార్టీలు బీసీ లకు అండగా ఉంటామని చెబుతూనే బీసీలను పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు 2018లో కులగణన చేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు దాటినా ఈ హామీ నెరవేర్చలేదన్నారు. ఇంతకాలంగా కులగణన చేయకుండా ఎందుకు మిన్నకుండి పోయారని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేసే ఉద్దేశం ఏ పార్టీకీ లేదన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలతో తెలంగాణ రాష్ట్రంలో బీసీల కులగణన జరుగుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ప్రస్తుత సీఎం చంద్రబాబుకు బీసీలపై ప్రేమ లేదన్నారు. బీసీలను వైఎస్ రాజశేఖరరెడ్డి గుండెల్లో పెట్టుకున్నారనీ, 93 బీసీ కులాలను 143 కులాలుగా పెంచిన ఘనత వైఎస్‌కే దక్కుతుందన్నారు. కులగణన జరిగితే బీసీలు ఇతర కులాల వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. బీసీల అభ్యున్నతి కోసం పది సూత్రాలతో మాస్టర్ ప్లాన్ తయారు చేస్తానని చంద్రబాబు చెప్పినా ఇంతవరకూ అమలులోకి రాలేదన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఐదేళ్లలో 35 వేల కోట్లను విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజల నుంచీ వసూలు చేశారన్నారు.

ఇంకా రాజధాని లేని రాష్ట్రమే

పక్కనే ఉన్న తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు, తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం నేటికీ రాజధాని లేదన్నారు. గతంలో వైసీపీ, ప్రస్తుతం టీడీపీ బీజేపీతో పొత్తులోనే ఉన్నా రాష్ట్రానికి పది పరిశ్రమలు కూడా రాలేదని విమర్శించారు. గత ముఖ్యమంత్రి జగన్ నా బీసీలు అని చెబుతూ 75 వేల కోట్లను బీసీల కోసం ఖర్చు చేస్తానని చెప్పినా చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయకుండా విద్యార్థులను ఇబ్బందిపెట్టారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు న్యాయం చేయాలని ఉద్యమాలు చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షుడిగా నియమితులైన శొంఠి నాగరాజుకు కాంగ్రెస్ పెద్దలు అండగా ఉంటారని వివరించారు. మాజీ ఎంపీ జేడీ శీలం, ఏఐసీసీ సభ్యులు పాలక్‌వర్మ, గుంటూరు మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొవ్వా మోహన్‌రావు ప్రసంగించారు. ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు మాట్లాడుతూ రానున్న మూడు నెలల వ్యవధిలో బీసీ కులాలన్నింటినీ ఏకం చేసి బీసీల అభ్యున్నతి కోసం పోరాటం చేసేందుకు సమాయత్తం చేస్తామన్నారు.

దుర్గగుడిలో ఫిర్యాదుల బాక్స్

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెకు మంచి స్పందన వస్తోంది. దసరా మహోత్సవాల్లో ఉన్నతాధికారులు, దేవదాయ శాఖ మంత్రి సూచనల మేరకు ఈ పెట్టె ఏర్పాటు చేశారు. 9441820717కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు, సూచనలు, సలహాలు పంపవచ్చు. దీంతో పాటు ఆర్జిత సేవలు, ఇతరత్రా సమాచారాన్ని తెలుసుకోవచ్చు. అలాగే, ఈవో నెంబర్ 9401000634కు ఏదైనా ఫిర్యాదు చేయవచ్చు. కాగా, ఇప్పటి వరకు కేశఖండనశాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. పుట్టు వెంట్రుకలకు డబ్బు డిమాండ్ చేస్తున్నారని, టికెట్ కౌంటర్ వద్ద చిల్లరకు సంబంధించి పేచీలు పెడుతున్నారని ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. అలాగే, చెప్పులస్టాండ్, క్లోక్‌రూమ్ వద్ద కూడా డబ్బు అడుగుతూ ఇబ్బంది పెడుతున్నారని, నియంత్రణ లేని పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. ప్రసాదాల కౌంటర్లకు సంబంధించి కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిర్యాదుల బాక్స్‌ను భక్తులు వినియోగించుకుని ఆలయ అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వటంతో పాటు తాము గుర్తించిన అవకతవకలపై ఫిర్యాదు చేయవచ్చని దేవస్థానం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఇక అధికారిక రక్షలు

(5వ పేజీ తరువాయి)

అనంతరం ఆయన చాంబర్‌లో ఈవో సమావేశమయ్యారు. దేవస్థానం ఆధ్వర్యంలోనే రక్షలను విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందు కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. శివాలయానికి వెళ్లే మార్గంలో ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్, ఫొటోలు విక్రయించే కౌంటర్‌కు పక్కనే ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇక్కడ ఒక అర్చకుడిని కూడా నియమించనున్నారు. ఇందుకోసం భక్తుల నుంచి ఎలాంటి పారితోషకం తీసుకోరు. ఒక రక్షను రూ.5కు విక్రయిస్తారు.

విధుల్లో అనధికార అర్చకులు

ఈవో రామారావు శుక్రవారం చేసిన తనిఖీల్లో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని ఉపాలయాల్లో ఆలయానికి సంబంధం లేని అర్చకులు విధుల్లో ఉన్నట్టు గుర్తించారు. అమ్మవారి ప్రధానాలయం, శివాలయంతో పాటు ఉపాలయాల్లోనూ ఆలయ అర్చకులే విధులు నిర్వహిస్తారు. కొన్ని ఉపాలయాల్లో మాత్రం దేవస్థానానికి సంబంధం లేనివారు ఉంటున్నారు. అధికారులకు తెలియకుండా ఇక్కడ ప్రైవేట్ అర్చకులను నియమిస్తున్నారు. ఇలా వచ్చినవారు భక్తుల ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. ప్లేట్‌లో సంభావన పెడితే ఒకలా, పెట్టకపోతే మరోలా వ్యవహరిస్తున్నారు.

వాట్సాప్.. హ్యాండ్సప్..

(5వ పేజీ తరువాయి)

అటువంటప్పుడు ఆ గ్రూపులో ఫోన్ నెంబర్ ఎందుకు ఉందని పోలీసులు ప్రశ్నించారు. అడ్మిన్ ఎవరో తనకు తెలియదని యువకుడు సమాధానమిచ్చాడు. ఆ గ్రూపుల్లో వచ్చిన పోస్టింగ్‌లను తాను ఏనాడూ చూడలేదని స్పష్టం చేశాడు. పలుమార్లు గ్రూపుల నుంచి బయటకు వచ్చేసినా తిరిగి యాడ్ చేశారని చెప్పాడు. దీన్నిబట్టి కామన్ ఫ్రెండ్స్ ద్వారా తెలిసిన, తెలియని వారి ఫోన్ నెంబర్లను ఈ గ్రూపుల్లో చేర్చినట్టు పోలీసులు గుర్తించారు. విచారణకు హాజరైన వారి ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ఇన్‌స్టా, ఎక్స్ సోషల్ మీడియాలో హ్యాండలర్స్‌గా ఉంటూ అసభ్యకర పోస్టింగ్‌లు చేసిన వారికి, ఫాలోవర్స్‌గా ఉన్న వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం నమోదు చేసిన కేసుల్లో సాంకేతికంగా దర్యాప్తు సాగిస్తున్నారు. కొన్ని కేసుల్లో ఇప్పటికే ఐపీ లాగ్ వివరాలను సేకరించినట్టు సమాచారం.

విజయవాడ తూర్పు

11, 12 తేదీల్లో సర్వోత్తమ గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు

పటమట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యంలో పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోత్తమ గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 11, 12 తేదీల్లో చిత్రలేఖనం కథలు చెప్పటం, పుస్తక సమీక్ష, జ్ఞాపకశక్తి, పద్య పఠనం, బుక్ హంట్‌లపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సర్వోత్తమ గ్రంథాల యంలో గానీ, 7995313131348 నంబర్‌లో అడిగి తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు.



రోడ్డుకు సమానంగా పూడ్చకుండా వదిలేసిన మ్యాన్‌హోల్, గుంతలు ఏర్పడి ప్రమాదభరితంగా ఉన్న రహదారి

ప్రమాదభరితంగా గుంతలు

రోడ్డుకు సమానంగా పూడ్చని మ్యాన్‌హోల్స్‌తో వాహనదారులకు ఇబ్బందులు

ఆటోనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు రింగ్ నుంచి మాచవరం ఆంజనేయస్వామి ఆలయం వరకు మ్యాన్‌హోల్స్ మరమ్మతులు చేసిన మున్సిపల్ సిబ్బంది వాటిని పూడ్చకుండానే వదిలేశారు. దీంతో ఇటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు రోడ్డులో మ్యాన్‌హోల్స్‌లో పూడికతీత నిమిత్తం మ్యాన్‌హోల్స్ చుట్టూ గోతులు పెట్టేవారు. పూడికతీత అనంతరం వాటిని రోడ్డుకు సమానంగా నిర్మించడంలో అధికారులు జాప్యం చేస్తూ వస్తున్నారు.

కొన్ని చోట్ల 6 అంగుళాలపైగా లోతైనా గుంతలు ఏర్పడి ప్రమాదభరితంగా మారాయి. బస్సు, కారు, ఆటో వెనుక వెళ్లే ద్విచక్రవాహనదారులకు గుంతల కనిపించక ఒక్కసారిగా గుంతల్లోకి వెళ్లడంతో ప్రమాదాలకు గురవతున్నారు. వర్షం పడిన సందర్భంలో గుంతల్లో నీరు చేరడంతో గుంతలు కనపడక వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ ద్వారా కొత్త ఖాతాలకు శిబిరాలు

లబ్బీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ ద్వారా కొత్త ఖాతాలను తెరవటం, ఆధార్ లింకు సులభతరం చేయటానికి ఈ నెల 15 వరకు క్యాంపులను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ లబ్ధిదారుల కోసం నిర్వహిస్తున్నట్లు చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ తెలిపారు. స్థానిక జిల్లా యంత్రాంగం సహకారంతో గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త బ్యాంకు ఖాతాలను తెరవటం, ఇప్పటికే ఉన్న ఖాతాలను ఆధార్ లింకు చేయటం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్‌లు సులభతరం చేయటం తమ ప్రాథమిక లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 64.81 లక్షల ఖాతాలను రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకు పైగా ఉన్న పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా పునరుద్ధరించటం జరుగుతుందని తెలిపారు.

సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డులో పటమట శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



విజేతలతో శ్రీ చైతన్య యాజమాన్యం

పటమట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 20 రాష్ట్రాలు... 120 బ్రాంచ్‌లు పదివేల మంది విద్యార్థులతో ఒకటి నుంచి 600 గణిత సూత్రాలు అప్పచెప్పి అబ్బురపరిచి సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డు సృష్టించిన వారిలో విజయవాడ పటమట శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు 235 మంది పాల్గొన్నారని పాఠశాల రీజినల్ ఇన్‌ఛార్జి పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రికార్డులో మా పాఠశాల విద్యార్థులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. చైతన్య పాఠశాల జీఎం ఎంటీ నాగేంద్ర మాట్లాడుతూ జ్ఞానాన్ని సంపాదించడానికి వయస్సుతో పనిలేదని, సాధన వల్లే ఏదైనా సాధించవచ్చునన్నారు. ప్రపంచ రికార్డు సాధించడంలో భాగస్వామ్యులైన విద్యార్థులందర్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, స్టేట్ జోనల్ ఇన్‌ఛార్జి సౌజన్య, ప్రైమరీ జోనల్ ఇన్‌ఛార్జి రోజారాణి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్వహణపై అవగాహన శిబిరం



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు

పటమట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వాసవ్య మహిళా మండలిలో వృద్ధాశ్రమాల నిర్వహణపై అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ వి కామరాజు మాట్లాడుతూ 2007లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్, మెయింటెనెన్స్ యాక్టు ఏర్పాటైందన్నారు. వయోవృద్ధుల కోసం వృద్ధాశ్రమాలను నిర్వహిస్తున్న సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అలా చేయని పక్షంలో వారికి రూ.25వేలు జరిమానా విధించబడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కోసం గడువు ముగియడానికి 60 రోజుల ముందే దరఖాస్తు చేయాలన్నారు. వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వారి వివరాలను తెలిపే రిజిస్టర్‌లను, ఖర్చులు, సిబ్బంది వివరాలు, వార్షిక నివేదికలు, సమావేశాల మినిట్స్ అన్ని రిజిస్టర్లను సంస్థ కలిగి ఉండాలని వివరించారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు బి. కీర్తి మాట్లాడుతూ వృద్ధాశ్రమాలకు ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. బాబూరావు, కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందిస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

బస్ స్టేషన్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్య మంత్రి సహాయ నిధికి ప్రజా రవాణా సంస్థ కార్మిక పరిషత్ రూ.లక్ష విరాళం అందించింది. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి కోసూరి సురేంద్ర చెక్కును అందజేశారు. ఆర్టీసీ విలీన సమస్యలపై సీఎంకు మెమోరాండంను అందజేశారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. రవాణా మంత్రితో చర్చించి అధికారులతో సమీక్షించి సమస్యల పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి చెప్పారని నాయకులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో రివర్స్ పీఆర్సీ వల్ల నష్టపోయామని, ఉద్యోగులు మధ్యంతర భృతి కోసం ఎదురుచూస్తున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

● ఏఐటీయూసీ డిమాండ్

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కనీస వేతన చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజీవ్‌గాంధీ పార్క్ వద్ద కార్మికులతో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 'సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. పార్కులలో పనిచేస్తున్న కార్మికులకు ఈ వేతనం అమలు చేయాలి. కాంట్రాక్టు కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. బుడమేరు వరద సమయంలో కార్మికులు చేసిన కృషికి అదనంగా ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలి.' అని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఒకప్పుడు రూ.1500గా ఉన్న జీతం ఏఐటీయూసీ పోరాట ఫలితంగా దఫదఫాలుగా పెరుగుతూ నేటికి రూ.21వేలు అయ్యిందని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దే రాజా పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడు జక్కి జేమ్స్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, విజయ్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం స్ఫూర్తిదాయకం

● సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ

గవర్నర్‌పేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగం స్ఫూర్తిదాయకమని, ప్రతిఘటన పోరాటాల ఫలితంగానే ఎంతో మంది పేదప్రజలు లక్షల ఎకరాలు సాగుచేసుకుంటున్నారని, తమ హక్కులు సాధించుకున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ అన్నారు.

శుక్రవారం చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో అమరవీరుల సంస్మరణ సభ



అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ

నిర్వహించారు. సభకు జిల్లా కార్యదర్శి రవీంద్ర అధ్యక్షత వహించారు.

అమరవీరుల చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటం మొదలు నేటి వరకు రాజ్యహింసలో, అనారోగ్యంతో అమరులైన వేలాది మంది నేతలకు నాయకులు జోహార్లు అర్పించారు. అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాటాలను కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకరావు, టి.శ్రీను, నాని, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ఉపాధ్యక్షుడు షేక్ మీరావలి, అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీను, బీసీడబ్ల్యూయూ జిల్లా కోశాధికారి సుబ్బారావు, జీకే రామచంద్రరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254
నెక్ కోడిగుడ్డు ధర (100)	

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలి

● గుణదల విద్యుత్ సౌధ కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా



గుణదల విద్యుత్ సౌధ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

గుణదల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాన్య మధ్యతరగతి ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో కరెంటు బిల్లులు పెంచుతూ భారాన్ని మోపడాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో గుణదల విద్యుత్ సౌధ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులనే కూటమి ప్రభుత్వం చేయకుండా కేంద్రంతో మాట్లాడి విద్యుత్ బకాయిలు రద్దు చేయించే ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



కాగితపు సంచుల తయారీపై వర్క్‌షాపు

లబ్బీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణహిత చేతి సంచులను వాడేలా ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు విద్యార్థులు బాధ్యత తీసుకోవాలని జనశిక్షణ సంస్థ ట్రైనర్ జి.రామబ్రహ్మం అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం కళాశాల ఈడీసీ, ఐఐసీ సంయుక్త ఆధ్వర్యంలో జనశిక్షణ పర్యవేక్షణలో కాగితపు సంచుల తయారీ పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాగితపు సంచుల తయారీకి మంచి ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ సంచుల వాడకంతో పర్యావరణహిత సమాజాన్ని చూడవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు సంచుల తయారీ విధానాన్ని నేర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఆర్.మాధవి, పి. వనిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

పటమట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దర్శిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు దర్శిపేట, అంబేద్కర్‌నగర్, కృష్ణవేణి రోడ్డు, పటమట సెంటర్, ఎన్ఎస్ఎం స్కూల్, చిన్నవంతెన సెంటర్, కోనేరు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

లబ్బీపేట: స్క్యూ బ్రిడ్జి సెక్షన్, విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు. ఫకీరు గూడెం, ప్రగతినగర్, టిక్కిల్ రోడ్డు, శ్రీరామ్‌నగర్, చంద్రమౌళిపురం, మెహిద్దిన్ ఎస్టేట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పోస్టాఫీసు రోడ్డు, పటమటలంక, కన్నానగర్, చంద్రబాబు నాయుడు కాలని, బెంజి సర్కిల్, ఈనాడు, రాఘవ నగర్, నేతాజీరోడ్డు, సీతారామా నగర్, ఆశ్రమం రోడ్డు, మసీదు స్ట్రీట్, బాలాజీనగర్, గీతానగర్, పోలీస్‌కాలనీ, రాణిగారితోట, బాపనయ్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.





కార్తీక.. కలువలు

కార్తీక మాసంలో వీటికి యమా డిమాండ్ గురూ!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కార్తీక కలువలివి! కార్తీక మాసంలో విరగకాసే ఈ కలువపూలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పరమ శివుడితో పాటు సాయి బాబాను పూజించటానికి వీటిని ఉపయోగిస్తారు. ధర ఎక్కువైనా దేవుడికి ప్రీతిపాత్రమైనవిగా భావించటం వల్లే అంత డిమాండ్. ఇవి అరుదుగా దొరుకుతాయి. కృష్ణాజిల్లా గన్నవరం మండలం బీబీ గూడెం గ్రామంలో కలువపూలు పెరిగే రెండు చెరువులున్నాయి. కార్తీక మాసం వచ్చిందంటే చాలు.. ఈ రెండు చెరువులు రంగురంగుల కలువపూలతో అందంగా మారిపోతాయి. ఎక్కువగా గులాబీ వర్ణం కలిగిన కలువ పూలు, కొన్ని తెలుపు, మరికొన్ని కెంపు ఇలా విభిన్న రంగుల్లో పూస్తాయి. బీబీ గూడెం గ్రామ పంచాయతీకి ఈ చెరువలపై ఏటా రూ.3లక్షల ఆదాయం వస్తుంది. ఏటా గ్రామ పంచాయతీ పాట పెట్టినప్పుడు గ్రామస్థులు పాటను దక్కించుకోవటానికి పోటీలు పడతారు. ఈ ఏడాది స్థానికులే పాటను కైవసం చేసుకున్నారు. రోజూ భారీగా కలువపూలను కోసి విజయవాడలోని పూల మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి రకరకాల పూల వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు కొని తీసుకు వెళతుంటారు. కార్తీక పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు చేసేవారు తప్పకుండా కలువ పూలను ఉపయోగిస్తారు. ఆ రోజున మార్కెట్‌లో కలువపూలకుండే డిమాండ్ అంతా, ఇంతా కాదు. ఇటీవల అయ్యప్పలు కూడా భజనల్లో కలువపూలనే ఉపయోగిస్తున్నారు.

- కృష్ణాజిల్లా బీబీగూడెం చెరువులో విరగపూసిన కలువలు
- ఏటా గ్రామ పంచాయతీకి రూ.3 లక్షల ఆదాయం
- పంచాయతీ పాటకు గ్రామస్థుల నుంచి డిమాండ్
- కార్తీక మాసంలో కోతకు వచ్చే కలువలు
- విజయవాడ పూల మార్కెట్‌కు ఎగుమతి
- పౌర్ణమి రోజున కలువ పూలతో భక్తుల పూజలు



ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసిన అసోసియేషన్ నేతలు

ఆటోమొబైల్ అభివృద్ధికి

సహకరిస్తా

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆటోమొబైల్ రంగంలో వస్తున్న సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకునేలా మెకానిక్‌లు, కార్మికులు అప్‌గ్రేడ్ అయ్యేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఆటోనగర్‌లోని అన్ని అసోసియేషన్ల అభివృద్ధికి కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కోడూరు అంజనేయవాసు ఆధ్వర్యంలో ఫ్యూయల్ ఇంజక్షన్ పంపు క్యాలిబ్రైటర్స్, రీ బోరింగ్ వర్క్‌షాపుల అసోసియేషన్ నేతలు గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం శివనాథ్‌ను కలిశారు. అనంతరం వారి సమస్యలను పేర్కొంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ వారి సమస్యలు విని సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఐదేళ్లుగా పనులు లేవని నేతలు చెప్పటంతో ఎంపీ స్పందిస్తూ బందరు పోర్టు, పరిటాలలో గూడ్స్ హబ్, విజయవాడలో ఇన్నర్ రింగ్ రోడ్డు, అమరావతి నిర్మాణ పనులు వచ్చే ఏడాది జనవరి నుంచి పుంజుకుంటాయని ఆటోనగర్‌కు పనులు వస్తాయన్నారు. ఫ్యూయల్ ఇంజెక్షన్ పంపు క్యాలిబ్రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.నాగేశ్వరరావు, కోశాధికారి ఎస్.సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ ఫణీంద్ర, జాయింట్ సెక్రటరీ ఎం.కోటేశ్వరరావు, కమ్మిలి ప్రసాద్, రీ బోరింగ్ వర్క్‌షాపుల అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.అర్జునరావు, సెక్రటరీ నాగేశ్వరరావు, ఎ.గోపిచంద్, మైత్రీ మోహన్‌రావు, ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సెక్రటరీ జాస్తి సురేష్, ఐలా మాజీ సభ్యుడు, సీనియర్ మెకానిక్ షేక్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

జీఐఎస్ సాంకేతికతో రాజధాని పనులు వేగవంతం

- సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్



కృష్ణలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి జీఐఎస్ సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతాయని ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్ అన్నారు. ఎస్రీ ఇండియా అధ్వర్యంలో శుక్రవారం జీఐఎస్ మ్యాపింగ్ టెక్నాలజీపై విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఉద్యోగులకు కార్యశాల జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జీఐఎస్ సాంకేతికతతో నిర్మాణాన్ని ఒక ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తిచేయగలమన్నారు. ఈ టెక్నాలజీని ఉద్యోగులు అందిపుచ్చుకొని అత్యున్నత లక్ష్యాలను అధిగమించాలన్నారు. నిత్య జీవితంలో చరవాణితో సాంకేతికతను ఎలా పెంపొందించుకొంటున్నామో అలాగే జీఐఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా రాజధాని నిర్మాణ పనులు వేగంగా పారదర్శకంగా జరుగుతాయని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్రీ ఇండియా ప్రతినిధి డాక్టర్ రమా చక్రవర్తి జీఐఎస్ మ్యాపింగ్ వినియోగదాన్ని దృశ్య మాధ్యమం ద్వారా ఉద్యోగులకు వివరించి ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యశాలలో ఏపీ సీఆర్‌డీఏ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ ఎస్‌జీటీ ఉచిత శిక్షణ

- 12లోగా దరఖాస్తు చేసుకోవాలి: బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్

కృష్ణలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-ఎస్‌జీటీ పరీక్షకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా పొందిన దరఖాస్తుకు బయోడేటా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టీసీ, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, టెట్ మార్కుల జిరాక్సు కాపీలను సమర్పించాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదన్నారు. మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేసి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏదైనా సందేహం ఉంటే విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్‌ను సంప్రదించాలని కె.శ్రీనివాసరావు సూచించారు.



శ్రీశ్రీ భవన్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నగర నేతలు

ప్రజాపోరును జయప్రదం చేయండి: సీపీఎం

గవర్నర్‌పేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14 వరకు నిర్వహించే ప్రజా పోరును జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ కోరారు. ఇందులో భాగంగా ఈనెల 14న విజయవాడ కలెక్టర్ ఆఫీసు వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం స్థానిక శ్రీశ్రీ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ అధిక ధరలు, మద్యం నియంత్రణ, విశాఖ ఉక్కు అమ్మకం, మహిళలు, దళితులు, పిల్లలపై దాడులు, వరద బాధితులకు సాయం, స్థానిక సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపడుతున్నామన్నారు. భారాలు మోపే ప్రభుత్వాన్ని, నిరంకుశ కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు సీపీఎం పోరాటాలు చేస్తోందన్నారు. సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, వెస్ట్ సిటీ కార్యదర్శి బి. సత్తిబాబు, ఈస్ట్ సిటీ నేత పి. కృష్ణ ప్రసంగించారు.

రేపు అఖిల భారతీయ ముదిరాజ్ సమాజ్ ఎన్నికలు

- పాల్గొననున్న రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది గురునాథం

విజయవాడ లీగల్, నవంబరు 8: ఈనెల 10న ఢిల్లీలో జరుగనున్న కోలి/ముదిరాజ్/ముత్తారయ్యార్ కులానికి సంబంధించిన ఎన్నికల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వి.గురునాథం పాల్గొననున్నట్టు అఖిల భారతీయ కోలీ సమాజ్ సంఘం ప్రధాన కార్యదర్శులు డీపీ శంఖ్వర్, మను భాయి ఛాడాలు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10న తిరిగి సంఘానికి ఎన్నికలు జరిపేందుకు అఖిల భారత కోలి/ముదిరాజ్ సమాజ్ సంఘం నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో సిమ్లా నుంచి బీజేపీ నేత, పార్లమెంట్ మాజీ సభ్యుడు వీరేంద్ర కాశ్యప్, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉజ్జయిని మాజీ ఎంపీ సత్యనారాయణ పవర్ మధ్య పోటీ జరగనుందన్నారు. సదరు ఎన్నికల సందర్భంగా రాష్ట్రం నుంచి కోలి/ముదిరాజ్ సమాజ్ సంఘం అధ్యక్షుడైన వి.గురునాథం ఎన్నికల్లో పాల్గొనాల్సిందిగా జాతీయ కమిటీ కోరినందున ఆయన ఢిల్లీకి వెళ్లి ఓటింగ్‌లో పాల్గొననున్నట్టు తెలిపారు.

చెట్టు కొమ్మ పడి 20 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రసాదంపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సమీపంలో ఆటలాడుతున్న విద్యార్థులపై చెట్టు కొమ్మ విరిగి పడిన ఘటనలో విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. శుక్రవారం విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని వివేకానంద పాఠశాల ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో విద్యార్థులు ఆటలు ఆడుతున్నారు. ఆ సమయంలో సమీపంలో చెట్టు కొమ్మ విరిగి పడి విద్యార్థులు పై పడింది. ఈ ఘటనలో సూమారు 20 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం వెంటనే విద్యార్థులను ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. విద్యార్థులందరూ క్షేమంగా ఉండటంతో తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

క్రీస్తుశకం 1, 2 శతాబ్దాలకు చెందిన ప్రాచీన బౌద్ధస్థూపం, బౌద్ధ భిక్షువులు ధ్యానం చేసుకునే ధ్యాన మందిరాలు ఇక్కడ ఉండటంతో పాటు ప్రాచీన బౌద్ధ చరిత్రకు చెందిన అనేక ఆనవాళ్లతో కూడిన శిల్ప సంపదను పరిశీలించేందుకు ఘంటసాల ప్రాంతానికి దేశవిదేశాల నుంచి చారిత్రక పరిశోధకులు తరలి వస్తుంటారు. అలాంటి ప్రాంతంలో శయన స్థితిలో ఉన్న బుద్ధుడి మందిరాన్ని నిర్మించి అందులో భారత దేశ బౌద్ధ చరిత్రకు సంబంధించిన గ్రంథాలయాన్ని, పురాతన శిల్పసంపదను, పరిశోధన కోసం అందుబాటులో ఉంచటంతో పాటు ధ్యాన మందిరం కూడా ఏర్పాటు చేస్తే పలు దేశాల నుంచి యాత్రికులు వస్తారన్న అంచనాతో పర్యాటక శాఖ ఈ ప్రాజెక్టును నిర్మించ తలపెట్టింది. గత టీడీపీ ప్రభుత్వం రూ.కోటి 50లక్షల అంచనాతో శంకుస్థాపన చేసి మొదలు పెట్టింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావటంతో ఈ బుద్ధ విహార్ ప్రాజెక్టుకు గ్రహణం వీడింది. సవరించిన అంచనాలతో పనులు పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

- అవనిగడ్డ/ఘంటసాల, ఆంధ్రజ్యోతి



శయన బుద్ధవిహార్‌కు

మంచిరోజులు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మూలనపడిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కదలిక



నిలిచిపోయిన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు భవనం

- వందడుగుల శయన బుద్ధుడి విగ్రహ నిర్మాణానికి ప్రతిపాదన
- 2017లో టీడీపీ హయాంలో నిర్మాణం ప్రారంభం
- బిల్లులు చెల్లించకపోవటంతో నిలిచిన ప్రాజెక్టు
- కలెక్టర్‌తో కలిసి ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే మండలి
- రూ.5కోట్లతో అంచనాలు రూపొందించామన్న అధికారులు

దివి ప్రాంత చారిత్రక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే లా కృష్ణాజిల్లాలోని ప్రఖ్యాత బౌద్ధక్షేత్రం ఘంటసాలలో నిర్మించ తలపెట్టిన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు ఐదేళ్ల వైసీపీ నిర్లక్ష్య పాలనకు బలైంది. ఈప్రాంతానికున్న ప్రాచీన బౌద్ధ చరిత్ర నేపథ్యంలో గౌతమబుద్ధుడి మహాపరి నిర్యాణానికి గుర్తుగా 2017లో ఘంటసాలలో శ యన బుద్ధవిహార్ ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.1.50 కో ట్లు కేటాయించగా, ఘంటసాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐ గొ ర్రెపాటి రంగనాథ్‌బాబు దాదాపు రూ.కోటి పైగా విలువైన 2.2 ఎకరాల స్థలాన్ని పర్యాటక శాఖకు విరాళంగా అందజేశారు. 2017, సెప్టెంబరు 16న నాటి కలెక్టర్ లక్ష్మీకాంతంతో కలిసి ప్రస్తుత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. బుద్ధగయా తర్వాత దేశంలో గౌతమబుద్ధుడి మహాపరి నిర్యాణానికి గుర్తుగా శయనిస్తున్న స్థితిలో 2018, ఫిబ్రవరి 4న ఘంటసాలలో పనులు మొదలు పెట్టారు. నాటి కలెక్టర్ లక్ష్మీకాంతం, పర్యాటక శాఖ ఏడీ రేగుళ్ల మల్లికార్జునరావు ప్రత్యేక శ్రద్ధతో యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు జరిగాయి. దాదాపు రూ.70 లక్షల మేర ఖర్చు చేయగా, రెండంతస్థుల భవన నిర్మాణానికి కావాల్సిన స్ట్రక్చర్ మొత్తం దాదాపు పూర్తయింది.

వైసీపీ రాకతో నిలిచిన పనులు

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావటంతోనే శయన బుద్ధవిహార్ ప్రాజెక్టుపై నీలినీడలు అలముకున్నాయి. అప్పటి వరకు నిర్మించిన నిర్మాణాలకు కూడా బిల్లులు చెల్లించకుండా నిలిపేయటంతో పాటు ప్రాజెక్టును పక్కన పడేశారు.

ఘంటసాల ప్రాంత ప్రాశస్త్యం

కృష్ణాజిల్లాలో బౌద్ధధర్మానికి ప్రతీకగా నిలిచే అతి కొద్ది ప్రాంతాల్లో ఘంటసాల ఒకటి. క్రీస్తుశకం 1, 2 శతాబ్దాల్లో ఈ ప్రాంతంలో బౌద్ధమతం పరిఢవిల్లిందని ఖగోళ శాస్త్రవేత్త టోలమి, చైనా యాత్రికుడు హూయాన్ ట్సాంగ్ సైతం తమ పర్యటనలు పొందుపరిచే గ్రంథాల్లో ప్రస్తావించినట్టు చరిత్రకారులు చెబుతున్నా రు. క్రీస్తుశకం 1, 2 శతాబ్దాల్లో ఘంటసాల ఓడరేవుగా విరాజిల్లిందని, ఇక్కడున్న బౌద్ధస్థూపాన్ని 2005లో జరిగిన కాలచక్ర కార్యక్రమానికి ముందు పునరుద్ధరించారని, మరే ఇతర ప్రాంతాల్లో లేనట్టు ఇక్కడ బౌద్ధస్థూ పం నిర్మాణం విభిన్నంగా ఉంటుందని పరిశోధకులు చెబుతుంటారు. ఈ ప్రాంతం నాణేలను ముద్రించే టంకశాలగా కూడా ప్రసిద్ధి చెందిందని అంటారు.

పునఃప్రారంభమెప్పుడు..?

శయన బుద్ధ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందా అని పర్యాటకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2017లో ఉన్న ధరల ప్రకారం ప్రభుత్వం రూ.1.50 కోట్లు కేటాయించగా, 2022 నాటికి దాదాపు రూ.2.50 కోట్లకు పెరిగాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ ప్రాజెక్టును ఎలాగైనా ముందుకు తీసుకెళ్లాలన్న తలంపులో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఉన్నారు. కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి ఆయన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టును పరిశీలించారు. పాత టెండర్లను రద్దు చేసి, కొత్తగా అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు కలెక్టర్‌కు తెలిపినట్టు సమాచారం.

ప్రాజెక్టును పూర్తిచేయాలి

గొర్రెపాటి వెంకట రమణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్, ఘంటసాల

ఘంటసాల చారిత్రక ప్రాంతం. ఇక్కడ శైవం, బౌద్ధం రెండూ పరిఢవిల్లాయి. చుట్టుపక్కల ఎక్కడ చూసినా చారిత్రక ఆనవాళ్లుంటాయి. ఇక్కడున్న బౌద్ధ స్థూపాన్ని చూసేందుకు, ఆరామం వద్ద ప్రార్థనలు చేసేందుకు నిత్యం బౌద్ధ ఆరాధకులు వస్తుంటారు. 2018లో దాదాపు 640 మంది బౌద్ధ సన్యాసులు వివిధ దేశాల నుంచి వచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

కొత్తగా అంచనాలు రూపొందించాం

జి.రామలక్ష్మణరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి కొద్దిరోజుల క్రితం ఘంటసాల శయన బుద్ధ ప్రాజెక్టును సందర్శించాం. వారి సూచనల మేరకు రూ.5కోట్లతో మళ్లీ అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. మరిన్ని సౌకర్యాలు జతచేస్తూ ఈ ప్రతిపాదనలు రూపొందించాం. ప్రభుత్వం నుంచి త్వరలోనే ఆమోదం వస్తుందని ఆశిస్తున్నాం.



విద్యుల్లతకు శుభాకాంక్షలు తెలుపుతున్న పట్టణ ప్రణాళికా సంఘం నేతలు

ప్రణాళికాబద్ధమైన నిర్మాణాలు భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు

- రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకురాలు విద్యుల్లత

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా ఉంటే భవిష్యత్తు తరాలకు బంగారు బాటలుగా నిలిచి ఎంతో మేలు చేస్తాయని రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకురాలు ఆర్.జె.విద్యుల్లత అన్నారు. ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని టౌన్, కంట్రీ ప్లానింగ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, కార్యదర్శి మోహన్‌బాబు తదితరులు శుక్రవారం రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకురాలు ఆర్.జె.విద్యుల్లత, అదనపు సంచాలకుడు శ్రీనివాసులు జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి కె. ప్రభాకర్ రావు, తదితర సంచాలకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం కేక్‌కట్ చేసి ఆనందోత్సాహాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యుల్లత మాట్లాడుతూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో పట్టణ ప్రణాళిక శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. చిన్న నగరాలు మెట్రో నగరాలుగా రూపాంతరం చెందుతూ మహానగరంలా ఆరేందుకు పట్టణ ప్రణాళికాధికారులు, సిబ్బంది ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. మునిసిపాలిటీ, కార్పొరేషన్, మహానగరాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అనేక ఒత్తిడిలకు గురవుతూ, అరకొర సిబ్బందితో తీవ్రమైన పనిభారంతో పనిచేస్తున్నారని, వారిని కృషిని ఆమె అభినందించారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణాలు, నగరాల అభివృద్ధికి రహదారుల విస్తరణతో పాటు అనేక నగరాల రూపకల్పనలో పట్టణ ప్రణాళిక అధికారుల కృషి ఎనలేనిదన్నారు. పట్టణ ప్రణాళిక సంఘం ప్రాంతీయ అధ్యక్షుడు బేగ్, కోశాధికారి కృష్ణ, రాజ్యలక్ష్మి, ఏపీవో పి.నాయుడు, టీపీవో సీఆర్‌డీఏ శైలజ, సంజీవ్ రత్నకుమార్ పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి విశేష అర్చనలు



సహస్ర లింగార్చనలో పాల్గొన్న ఈవో

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామికి విశేష అర్చనలు జరిగాయి. రానున్న సోమవారం, ఏకాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి రోజుల్లో బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రాభిషేకం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరుగుతాయని, రూ.2వేలు చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని రామారావు తెలిపారు. అలాగే రోజువారీ నిర్వహిస్తున్న సహస్రలింగార్చనను శుక్రవారం అర్చకులు నిర్వహించారు. ఈవో కె.ఎస్.రామారావు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ఊంజల్ సేవ అనంతరం సహస్ర దీపాలంకరణను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గంగా, పార్వతీ మల్లేశ్వరుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు.

భక్తుల రద్దీ

దుర్గగుడిలో కనకదుర్గమ్మ, మల్లేశ్వరస్వామి దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వారిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులకు అమ్మవారి శీఘ్ర దర్శనం అయ్యేందుకు ఏర్పాట్లు చేశారు. పలువురు భక్తులు ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చండీ హోమం, వంటి సేవల్లో పాల్గొన్నారు.

కళావేదికపై సంగీత విభావరి

కళావేదికపై విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన అన్నమయ్య సంకీర్తన గాన ప్రచార భక్త బృందం భక్తి సంగీతం నిర్వహించింది. పప్పు సదాశివశాస్త్రి శిష్య బృందం భక్తి సంగీత కచేరిలో పాల్గొంది. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై చావలి కృష్ణమోహన్‌లు సహకరించారు. ఈవో కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళా బృందాన్ని ప్రశంసించి ప్రసాదం, చిత్రపటం, ప్రశంసా పత్రాలను అందజేశారు. ముఖ్య అర్చకులు చెరువు ఆదినారాయణ యాంకర్‌గా వ్యవహరించారు.



మహిళలకు గాజుల పంపిణీ

దుర్గగుడిలో శుక్రవారం మహిళలకు అమ్మవారికి అలంకరించిన గాజులను ఈవో రామారావు పంపిణీ చేశారు. ఉచితంగా పుస్తకాలనూ అందజేశారు. గాజులు తీసుకోవటానికి మహిళలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపించారు. ఇటీవల నిర్వహించిన గాజుల ఉత్సవంలో అమ్మవారికి అలంకరించిన గాజుల పంపిణీతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

దుర్గగుడిలో నిత్యాన్నదాన నిమిత్తం శుక్రవారం హైదరాబాద్ రాయదుర్గానికి చెందిన కె.రామకృష్ణ రూ.1,00,116 విరాళం అందజేశారు. అధికారుల ద్వారా విరాళాన్ని దేవస్థానానికి అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదాశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, పుస్తకాలు అందజేశారు.

ప్రశ్నించడమంటే ఏమిటి జగన్ రెడ్డీ?

- టీడీపీ నేత గన్నే ప్రసాద్

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించడమంటే ఏమిటో సైకో జగన్ రెడ్డి చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) శుక్రవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. జగన్ సైకో టెర్రర్ సోషల్ మీడియా చేతిలో అతడి తల్లి, చెల్లీ బాధితులేనన్నారు. సోషల్ మీడియాలో అవమానకర పోస్టింగ్‌లు భరించలేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చట్టసభలో వైసీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబు సతీమణిపై కారుకూతలు కూసినప్పుడు జగన్ వికృతంగా చిరునవ్వులు చిందించిన అంశం ప్రతి తెలుగువారి కళ్లల్లోనూ మెదులుతూనే ఉందన్నారు. జగన్ నీచబుద్ధి చూసి ప్రజలు ఛీ కొట్టారనే అక్కసుతోనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిల్లలు, లోకేష్, మహిళా మంత్రులపై జగన్ సైకో టెర్రర్ సోషల్ మీడియా బరితెగించి చేస్తున్న వికృత పోస్టులకు చట్ట ప్రకారం ప్రభుత్వం తప్పకుండా బుద్ధి చెబుతుందన్నారు.


వైసీపీని భూస్థాపితం చేస్తేనే మేలు: లుక్కా

వైసీపీని భూస్థాపితం చేస్తేనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత రావటంతో ఎమ్మెల్సీ బరి నుంచి జగన్ రెడ్డి తప్పుకున్నాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ రెడ్డి డిగ్రీ చదవని వ్యక్తుల పేర్లను ఓటర్లుగా చేర్చి ఎన్నో అక్రమాలకు పాల్పడినా రాయలసీమలో 2, ఉత్తరాంధ్రలో 1 చొప్పున ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాభవాన్ని గుర్తించి తోకముడిచాడని విమర్శించారు. వర్రా రవీంద్ర రెడ్డి పోస్టుల గురించి వివరిస్తూ జగన్ రెడ్డి ఎలాంటి స్పందన లేకుండా వికృత ఆనందం పొందాడన్నారు.









ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

శనివారం • 9 నవంబరు 2024

cinema@andhrajyothy.com



అరకులో వెంకీ

వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ సినిమా చిత్రీకరణ ముగింపు దశలో ఉంది. శుక్రవారం ఆఖరి షెడ్యూల్‌ను అరకులో యూనిట్ ప్రారంభించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియోలో విద్యార్థులు వెంకటేశ్‌కు స్వాగతం చెబుతున్న సన్నివేశం ఆకట్టుకుంది.

ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ కథానాయికలు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి.



కియారా

ఒకే సంస్థలో మూడు సినిమాలు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరో రెండు చిత్రాలకు పచ్చజెండా ఊపారు. ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ బేనర్‌లో ఆయన ఈ రెండు సినిమాలను చేయబోతున్నారు. ప్రస్తుతం ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'సలార్ 2' చిత్రం కూడా ఇదే బేనర్‌లో తెరకెక్కుతోంది. ఈ సినిమాతో కలిపితే ప్రభాస్-హోంబలే కాంబినేషన్‌లో మొత్తం మూడు చిత్రాలు రానున్నాయి. "సలార్ 2' పూర్తవ్వగానే ఈ రెండు సినిమాలు సెట్స్‌పైకి వెళ్లనున్నాయి. హోంబలే అధినేత విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ 'ప్రభాస్‌తో కలసి మరపురాని చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నాం. 'సలార్ 2' షూటింగ్ మొదలైంది. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ సినిమాలు ఉండబోతున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకు వినోదం పంచే దిశగా మా నిర్మాణ సంస్థ వేస్తున్న గొప్ప ముందడుగు ఇది' అని పేర్కొన్నారు. ప్రస్తుతం హోంబలే సంస్థ 'సలార్ 2', 'కాంతార 2', 'కేజీఎఫ్ 3' చిత్రాలను నిర్మిస్తోంది. ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్', 'స్పిరిట్', 'యానిమల్ పార్క్'తో పాటు హనూ రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు.

సూర్యతో సినిమా మిస్సయ్యా

రాజమౌళి



"రాజమౌళితో సినిమా చేసే అవకాశం వచ్చినా విఎస్సయ్యాను' అని ఓ సందర్భంలో సూర్య చెప్పాడు. కానీ ఆయనతో సినిమా చేసే అవకాశాన్ని నేనే మిస్సయ్యాను. ఆయన నటనంటే నాకు చాలా ఇష్టం. సూర్య కథానాయకుడిగా నటించిన 'కంగువ' చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఇలాంటి సినిమాను థియేటర్లలోనే చూడాలి. అప్పుడే ఆ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను పొందుతాం' అని దర్శకుడు రాజమౌళి అన్నారు. సూర్య కథానాయకుడిగా శివ దర్శకత్వంలో తెరకెక్కిన 'కంగువ' చిత్రం ఈనెల 14న విడుదలవుతోంది. చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజమౌళి మాట్లాడుతూ 'తెలుగు సినిమా మార్కెట్ ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే నా ఆలోచనకు స్ఫూర్తినిచ్చిన హీరో సూర్య. ఆయన 'గజిని' సినిమాను తెలుగులో ప్రమోషన్ చేసిన తీరును ఇప్పటికీ నా నిర్మాతలకు, హీరోలకు ఓ కేస్ స్టడీలా చెబుతుంటాను. అలా పాన్ ఇండియా సినిమాలు చేయాలనే ఆలోచనకు సూర్య కారణమయ్యారు' అని ప్రశంసించారు. సూర్య మాట్లాడుతూ "కంగువ' లాంటి స్పెషల్ మూవీని ఇచ్చినందుకు శివకు థాంక్స్. ఇది ఎవర్‌గ్రీన్ మూవీగా నిలవబోతోంది. నాకు మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిన సినిమా. దీనికోసం రెండేళ్లు కష్టపడ్డా. ప్రతి రోజూ ఎగ్జైటింగ్‌గా వర్క్ చేశాం. సెట్‌లో మూడు వేల మందిని సమన్వయం చేసుకుంటూ శివ పని చేయించుకున్న తీరు అద్భుతం. థియేటర్లలో మరో దీపావళిని సెలబ్రేట్ చేసుకుందాం' అన్నారు. శివ మాట్లాడుతూ "కంగువ' చిత్రం దృశ్యకావ్యంలా ఉంటుంది. గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి" అని కోరారు.

టెర్రిఫిక్ రోల్‌లో



క్రిష్ దర్శకత్వంలో అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'ఘాటీ'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. అనుష్క ఫెరోషియస్ అవతార్‌ని పరిచయం చేస్తూ మేకర్స్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఆదివాసి ప్రజలు తమ వస్తువులన్నింటినీ తీసుకుని కొండపైకి నడుస్తున్నప్పుడు గ్లింప్స్ మొదలవుతుంది. కార్లలో కొంత మంది వ్యక్తులు ఘాట్ రోడ్లపైకి వస్తారు. తన శరీరం అంతటా ట్రైబల్ టాటూస్‌తో, బస్ వైపు కొడవలితో నడుచుకుంటూ వచ్చిన అనుష్క స్టన్నింగ్ ఎంట్రీ ఆసక్తిని రేపుతోంది. అనుష్క బస్సులోకి ఎంటరై ఒక వ్యక్తి మెడను నరికి అద్దంలో తనను తాను చూసుకోవడం టెర్రిఫిక్‌గా ఉంది. అతని మెడని నరికిన తర్వాత రక్తం చిందే తలని పట్టుకొని నడుస్తూ, పొగ తాగుతున్నట్లు కనిపించిన విజువల్స్ అదిరిపోయాయి. ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

లెక్కలు మారిపోవడానికి ఒక్క శుక్రవారం చాలు

దిల్ రాజు



'ఈ సారి దీపావళి బరిలో నిలిచిన సినిమాలు గట్టి పోటీ ఇచ్చినా వాటన్నింటినీ తట్టుకొని 'క' సినిమా ఘన విజయాన్ని అందుకొంది. ఈ రోజు ఈ సినిమా సక్సెస్ మీట్‌లో పాలు పంచుకొంటున్నందుకు ఆనందంగా ఉంది' అని నిర్మాత దిల్ రాజు అన్నాడు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'క' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'పెద్ద సినిమాల మధ్యన మీ సినిమా ఎందుకు అన్నారు. 'మంచి సినిమా అని మేం చెప్పినా ఎవ్వరూ నమ్మలేదు. కానీ ప్రేక్షకులు సినిమా చూసి పెద్ద విజయాన్ని అందించారు. వారందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఏ హీరోనూ అతని మార్కెట్‌ను బట్టి అంచనా వేయవద్దు. ఆ లెక్కలన్నీ మారిపోవడానికి ఒక్క శుక్రవారం చాలు' అని స్పందించారు. మంచి సినిమాను చేశామనే సంతృప్తిని 'క' మాకు విగిల్చింది అని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి అన్నారు. "క' సినిమా క్లైమాక్స్‌ను నేను ఊహించలేకపోయాను. ఇటీవల కాలంలో వచ్చిన బెస్ట్ స్క్రీన్‌ప్లే మూవీ ఇది' అని నిర్మాత బన్నీవాస్ అభినందించారు. నెగెటివ్ ప్రచారాన్ని తట్టుకొని 'క' లాంటి సూపర్‌హిట్‌ను ఇచ్చిన కిరణ్‌ను అభినందిస్తున్నాను అన్నారు సందీప్ కిషన్.

నా అనారోగ్య సమస్య విని భయపడ్డా

శివ రాజ్‌కుమార్



'నా అనారోగ్య సమస్య గురించి విని మొదట భయపడ్డా. కానీ దాన్ని ధైర్యంగా ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసం పొందా. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నా. ఇప్పుడంతా బాగానే ఉంది' అని చెప్పారు కన్నడ నటుడు, 60 ఏళ్ల శివ రాజ్‌కుమార్. తను నటించిన 'భైరతి రంగల్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతున్న సందర్భంగా ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తను అనారోగ్యంతో బాధపడుతున్నట్లు శివ రాజ్‌కుమార్ చెప్పారు. అయితే తన అనారోగ్య సమస్య ఏమిటో ఆయన వెల్లడించలేదు కానీ 'ఇప్పటికి నాలుగు సెషన్స్ ట్రీట్‌మెంట్ పూర్తయింది. అమెరికా వెళ్లి ఆపరేషన్ చేయించుకుంటున్నాను. ఆ తర్వాత నెల రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటా. నా అనారోగ్యం గురించి అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని ఆ ఇంటర్వ్యూలో తెలిపారు శివ రాజ్‌కుమార్.

వాకిలి పద్మ



భీముడి మనవడు, ఘటోత్కచుడి కుమారుడు బార్బరిక్(బార్బరికుడు) పాత్ర ఆధారంగా 'త్రిబాణధారి బార్బరిక్' సినిమా మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో రాబోతోంది. విజయపాల్ రెడ్డి అదిదల నిర్మాత. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేయడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్డేట్ వదిలారు. ఉదయభాను పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి మరింత హైప్ పెంచారు. మూవీలో వాకిలి పద్మ అనే పాత్రను ఆమె పోషించారు. పోస్టర్‌లో ఉదయభాను యాటిట్యూడ్, కూర్చున్న తీరు కొత్తగా ఉన్నాయి.

కొత్తగా..

విడుదలకు సిద్ధం



తెలుగుతో పాటు ఐదు భాషల్లో దర్శక నిర్మాత మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన చిత్రం 'M4M'. ప్రధాన నటిగా జో శర్మ, ప్రధాన నటుడిగా సంబీత్ ఆచార్య నటించారు. విడుదలకు సిద్ధంగా ఉన్న మూవీ పోస్టర్‌ను చిత్రయూనిట్ విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఒకే ఒక కిల్లర్ క్యారెక్టర్ కనిపిస్తుంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ.. 'కంటెంట్ ఈజ్ ద కింగ్ అనే ప్రిన్సిపల్‌తో మూవీని తెరకెక్కించాం' అన్నారు.

కేసీఆర్ కథేమిటి?



గరుడవేగ అంజి దర్శకత్వంలో రాకింగ్ రాకేశ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్'(కేసీఆర్). అనన్య కృష్ణన్ కథానాయిక. లంబాడీ వర్గానికి చెందిన యువకుడి నిజ జీవిత స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని 'బలగం' దర్శకుడు వేణు లాంచ్ చేశారు.

ప్రేక్షకులను మెప్పించే పెళ్లి కథ



వివాహం నేపథ్యంలో పూర్తిగా కొత్త నటీనటులతో రూపొందుతున్న చిత్రం 'లగ్గం టైమ్'. ప్రజోత్ కె వెన్నం దర్శకత్వంలో కె. హిమబిందు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు సాగర్ కె. చంద్ర విడుదల చేశారు. ఇంటిల్లిపాదిని అలరించేలా సినిమా ఉండబోతోందని నిర్మాణ సంస్థ ట్వంటీయత్ సెంచరీ ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలిపింది. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుందని దర్శకుడు చెప్పారు. రాజేశ్ మేరు, నవ్య చిట్యాల హీరో హీరోయిన్లు.

స్పోర్ట్స్

రాహుల్.. అదే తీరు

ఓటమిదిశగా భారత్ 'ఎ'

రెండో ఇన్నింగ్స్ 73/5



రాహుల్ (10)

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో భారత్ 'ఎ' టాపార్డర్ వైఫల్యం కొనసాగుతోంది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (10) మరోసారి నిరాశపర్చగా.. భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 73 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం 11 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండగా.. క్రీజులో జురెల్ (19 బ్యాటింగ్), నితీశ్ (9 బ్యాటింగ్) ఉన్నారు. ఈ జోడీ మినహా స్పెషలిస్ట్ బ్యాటర్లు లేకపోవడంతో జట్టుకు మరో ఓటమి ఖాయంగా కనిపిస్తోంది. అంతకుముందు ఆసీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 223 వద్ద ఆలౌటై 62 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. హారిస్ (74), రోకిచోలి (35), పీర్సన్ (30) రాణించారు. ప్రసిద్ధ్‌కు నాలుగు, ముకేశ్‌కు మూడు, ఖలీల్‌కు రెండు వికెట్లు దక్కాయి. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేసింది.

సెమీస్‌కు కిరణ్ జార్జ్

ఇక్సాన్ సిటీ (కొరియా): భారత యువ షట్లర్ కిరణ్ జార్జ్ కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. 41వ ర్యాంకరైన కిరణ్ శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 21-14, 21-16తో జపాన్‌కు చెందిన టకుమా ఒబయాషిని కంగుతినిపించాడు. సెమీస్‌లో టాప్‌సీడ్, ప్రపంచ ఐదో ర్యాంకర్ కున్లావత్ (థాయ్‌లాండ్)తో కిరణ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.

శిక్షణ కోసం దక్షిణాఫ్రికాకు నీరజ్

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మెరుగైన సాధన కోసం ఈనెలాఖరులో దక్షిణాఫ్రికా వెళ్లనున్నాడు. వచ్చే ఏడాది పోటీల కోసం దక్షిణాఫ్రికాలోని పాచెఫ్‌స్ట్రోమ్‌లో నీరజ్ 31 రోజుల పాటు శిక్షణ తీసుకోనున్నాడు. దక్షిణాఫ్రికాలో ఉన్నన్ని రోజులు నీరజ్‌తో పాటు అతని ఫిజియోథెరపిస్ట్‌కయ్యే ఖర్చులన్నీ భరించనున్నట్టు క్రీడామంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీరజ్.. టోక్యో, పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కూడా పాచెఫ్‌స్ట్రోమ్‌లో శిక్షణ తీసుకున్నాడు.

సంజూ.. అంతా తానై

47 బంతుల్లో మెరుపు శతకం

భారత్ ఘన విజయం

దక్షిణాఫ్రికాతో తొలి టీ20

డర్బన్: టీ20 ఫార్మాట్‌లో సంజూ శాంసన్ (50 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సర్లతో 107) తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై సైతం ఎలాంటి బెదురు లేకుండా మెరుపు శతకంతో మెరిశాడు. అతడికి తోడు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి (3/25), రవి బిష్ణోయ్ (3/28) సుడులు తిరిగే బంతులతో ప్రత్యర్థిని స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. దీంతో శుక్రవారం సఫారీలతో జరిగిన తొలి టీ20లో భారత్ 61 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆదివారం రెండో మ్యాచ్ జరుగుతుంది. మరోవైపు శాంసన్‌కిది వరుసగా రెండో టీ20 సెంచరీ కావడం విశేషం. తన చివరి మ్యాచ్ (బంగ్లాతో)లోనూ అతడు మూడంకెల స్కోరు సాధించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 202 పరుగులు చేసింది. తిలక్ వర్మ (18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 33), సూర్యకుమార్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 21) రాణించారు. పేసర్ కొట్జీకి మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. క్లాసెన్ (25), కొట్జీ (23), రికెల్టన్ (21) మాత్రమే రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శాంసన్ నిలిచాడు.

హోరెత్తించాడు..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. బౌలర్ ఎవరైనా హిట్టింగ్‌ను మాత్రం ఆపలేదు. భారీ షాట్లతో కింగ్స్‌మీడ్‌ను హోరెత్తిస్తూ అంతా తానై పరుగుల వరద పారించాడు. కానీ తను వెనుదిరిగాక మాత్రం భారత్ తడబడింది. చివరి ఆరు ఓవర్లలో సఫారీ బౌలర్లు 40 పరుగులే ఇచ్చి ఆరు వికెట్లు తీయగా జట్టు ఆశించిన భారీ స్కోరు సాధించలేకపోయింది. మూడో ఓవర్‌లో శాంసన్ వరుసగా 4,6తో ఎదురుదాడికి తెర లేపాడు. అటు మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (7) తన పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. కెప్టెన్ సూర్య వచ్చీరాగానే 4,6తో ఆకట్టుకున్నాడు. అలాగే ఐదో ఓవర్‌లో శాంసన్ 4,6 సూర్య 4తో 15 రన్స్ వచ్చాయి. ఇక ఆరో ఓవర్‌లో సంజూ మరో సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 56/1 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా పరుగుల వేగం మరింత పెరిగిందే కానీ తగ్గలేదు. లెగ్ స్పిన్నర్ పీటర్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే తొమ్మిదో ఓవర్‌లో సూర్య అవుట్ కావడంతో రెండో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత 'బర్త్‌డే బాయ్' తిలక్ వర్మ అండతో శాంసన్ మరింతగా చెలరేగాడు. ఇద్దరూ పోటాపోటీ బౌండరీలతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అటు 13వ ఓవర్‌లో సంజూ 4,4,6 బాదగా, తర్వాతి ఓవర్‌లోనే తిలక్ 4,6తో చెలరేగాడు. ఇక 47 బంతుల్లోనే శాంసన్ వరుసగా రెండో సెంచరీతో సంబరాలు చేసుకున్నాడు. అయితే 15వ ఓవర్‌లో ఫోర్ బాదిన వెంటనే తిలక్‌ను కేశవ్ అవుట్ చేయగా.. 16వ ఓవర్‌లో సిక్సర్ బాదిన వెంటనే శాంసన్‌ను పీటర్ పెవిలియన్‌కు చేర్చడంతో మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పేసర్ కొట్జీ కట్టడి చేస్తూ హార్దిక్ (2), రింకూ (11) వికెట్లను తీయడంతో భారత్ పరుగుల వేగం తగ్గింది. ఆఖరి ఓవర్‌లో మరో రెండు వికెట్లు కోల్పోయిన జట్టు 200 పరుగులు దాటగలిగింది.

దెబ్బతీసిన స్పిన్నర్లు: భారీ ఛేదనలో ఆరంభం నుంచే దక్షిణాఫ్రికా వెనుకబడింది. తొలి ఓవర్‌లోనే కెప్టెన్ మార్‌క్రమ్ (8)ను పేసర్ అర్ష్‌దీప్ అవుట్ చేయగా, ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేదు. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, బిష్ణోయ్ తమ మ్యాజిక్ బంతులతో మిడిలార్డర్‌ను దెబ్బతీశారు. ఓపెనర్ రికెల్టన్, స్టబ్స్ (11) సైతం పవర్‌ప్లేలోనే వెనుదిరగడంతో కష్టాలు మరింత పెరిగాయి. అయితే క్లాసెన్, మిల్లర్ (18) క్రీజులో ఉండడంతో గట్టి పోటీ ఇస్తారనుకున్నా వారి నుంచి మెరుపులే కరువయ్యాయి. ఈ ఇద్దరినీ వరుణ్ 12వ ఓవర్‌లో అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే బిష్ణోయ్ మరో రెండు వికెట్లు తీశాడు. దీంతో 93/7 స్కోరుతో సౌతాఫ్రికా విజయానికి అందనంత దూరంలో నిలిచింది. టెయిలెండర్లలో కొట్జీ సిక్సర్లతో చెలరేగినా 17వ ఓవర్‌లో సూర్య సూపర్‌త్రోతో రనౌటయ్యాడు. అప్పటికి 18 బంతుల్లో 68 పరుగులు చేయాల్సి ఉండడంతో సఫారీలకు పరాభవం తప్పలేదు.



సంజూ శాంసన్ (50 బంతుల్లో 107)

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (సి) స్టబ్స్ (బి) పీటర్ 107; అభిషేక్ (సి) మార్‌క్రమ్ (బి) కొట్జీ 7; సూర్యకుమార్ (సి) సిమెలానె (బి) క్రుగెర్ 21; తిలక్ వర్మ (సి) జాన్సెన్ (బి) కేశవ్ 33; హార్దిక్ (సి) జాన్సెన్ (బి) కొట్జీ 2; రింకూ (సి) క్లాసెన్ (బి) కొట్జీ 11; అక్షర్ (సి) స్టబ్స్ (బి) జాన్సెన్ 7; అర్ష్‌దీప్ (నాటౌట్) 5; బిష్ణోయ్ (రనౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 202/8. వికెట్ల పతనం:** 1-24, 2-90, 3-167, 4-175, 5-181, 6-194, 7-199, 8-202. **బౌలింగ్:** జాన్సెన్ 4-0-24-1; మార్‌క్రమ్ 1-0-10-0; కేశవ్ 4-0-34-1; కొట్జీ 4-0-37-3; పీటర్ 3-0-35-1; క్రుగెర్ 2-0-35-1; సిమెలానె 2-0-27-0.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (సి) సంజూ (బి) అర్ష్‌దీప్ 8, రికెల్టన్ (సి) తిలక్ (బి) వరుణ్ 21; స్టబ్స్ (సి) సూర్య (బి) అవేశ్ 11; క్లాసెన్ (సి) అక్షర్ (బి) వరుణ్ 25; మిల్లర్ (సి) అవేశ్ (బి) వరుణ్ 18; క్రూగర్ (సి) హార్దిక్ (బి) రవి 1; జాన్సెన్ (సి) హార్దిక్ (బి) రవి 12; సిమెలానె (ఎల్బీ) రవి 6; కొట్జీ (రనౌట్) 23; కేశవ్ (బి) అవేశ్ 5; పీటర్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 17.5 ఓవర్లలో 141 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-8; 2-30; 3-44; 4-86; 5-87; 6-87; 7-93; 8-114; 9-135; 10-141; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-25-1; అవేశ్ 2.5-0-28-2; హార్దిక్ 3-0-27-0; వరుణ్ చక్రవర్తి 4-0-25-3; రవి బిష్ణోయ్ 4-0-28-3; అక్షర్ 1-0-8-0.

1

భారత్ తరఫున టీ20ల్లో వరుసగా రెండు శతకాలు సాధించిన బ్యాటర్‌గా సంజూ శాంసన్. ఓవరాల్‌గా గుస్తావ్ మెకాన్ (ఫ్రాన్స్), ఫిల్ సాల్ట్, రోసో కూడా ఈ ఫీట్ సాధించారు.

భారత్ తరఫున ఓ టీ20 మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (10) బాదిన ప్లేయర్‌గా రోహిత్‌తో సమంగా నిలిచిన శాంసన్.

బోథమ్ బచ్‌గయా!

చేపల వేటకు వెళ్లి.. మొసలి బారిన పడి



సిడ్నీ: ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ ఇయాన్ బోథమ్ త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మెర్వ్ హ్యూస్ కాపాడకుంటే నదిలో మునిగి మొసళ్లకు ఆహారమయ్యేవాడట. ఈ విషయాన్ని స్వయంగా బోథమ్ వెల్లడించాడు. వివరాల్లోకెళితే.. ఇటీవల హ్యూస్‌తో కలిసి బోథమ్ పడవలో నాలుగు రోజుల ఫిషింగ్ ట్రిప్ కోసమని నార్త్ ఆస్ట్రేలియా ప్రాంతంలోని మోయ్లే నదికి వెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి సరదాగా చేపలు పడుతుండగా.. బోథమ్ పొరపాటున కాలు జారి పడవలో నుంచి నీళ్లలో పడిపోయాడు. భారీ షార్క్‌లు, మొసళ్లుండే ఆ నదిలో నుంచి ఓ భారీ మొసలి వచ్చి బోథమ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించింది. వెంటనే అప్రమత్తమైన హ్యూస్ అమాంతం బోథమ్‌ను పట్టుకొని పడవలోకి లాగాడు. కానీ, అప్పటికే మొసలి దంతాలతో గాయపరచడంతో బోథమ్‌కు వీపు పక్కభాగం, మరికొన్ని చోట్ల గాయాలయ్యాయి.

అగ్రస్థానంలో అర్జున్

చెన్నై: ప్రపంచ నెంబర్ 2 ఇరిగేసి అర్జున్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ నాలుగో రౌండ్‌లో అర్జున్ విజయం సాధించాడు. ఇరాన్ జీఎం అమీన్‌తో తలపడిన అర్జున్ 52వ ఎత్తులో ప్రత్యర్థికి చెక్ చెప్పాడు. ప్రస్తుతానికి అర్జున్ 3.5 పాయింట్లతో టాప్‌లో, అమెరికా జీఎం అరోనియన్ 2.5 పాయింట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. ఇక చెన్నై చాలెంజర్స్ టోర్నీలో ద్రోణవల్లి హారిక మూడో ఓటమిని చవి చూసింది. భారత జీఎం కార్తికేయన్ మురళీతో తలపడిన హారిక 43వ ఎత్తులో పరాజయం పాలైంది.

హంపికి ఐదో స్థానం

షైంకెంట్: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీలో తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి ఐదో స్థానంతో నిరాశపర్చింది. ఆఖరి రౌండ్‌ను డ్రాగా ముగించిన రష్యా జీఎం అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినా 7 పాయింట్లతో విజేతగా నిలవగా, చైనా జీఎం టాన్ ఝోంగీ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. శుక్రవారం ముగిసిన ఆఖరిదైన తొమ్మిదో రౌండ్‌ను హంపి డ్రా చేసుకుంది.

ఆంధ్ర లక్ష్యం 321

ఉత్తరాఖండ్‌తో రంజీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే ఆంధ్ర 321 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సివుంది. మ్యాచ్‌కు మూడోరోజైన శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 92/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 146 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఉత్తరాఖండ్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 9 వికెట్లకు 128 వద్ద డిక్లేర్ చేసింది. ఉత్తరాఖండ్ 192 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి మొత్తం 321 రన్స్ లక్ష్యాన్ని ఆంధ్రకు నిర్దేశించింది. ఛేదనలో ఆంధ్ర మూడో రోజు ఆట చివరికి 8/0 పరుగులు చేసింది. ఆంధ్ర విజయానికి ఇంకా 313 పరుగులు చేయాల్సి ఉంది. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 338 రన్స్ చేసింది.

చెన్నై.. సూపర్

కాన్పూర్.. చెత్త

భారత్‌లో పిచ్‌లపై ఐసీసీ రేటింగ్

న్యూఢిల్లీ: ఇటీవల స్వదేశంలో భారత జట్టు ఆడిన టెస్టు సిరీస్‌లకు ఆతిథ్యమిచ్చిన పిచ్‌లకు ఐసీసీ రేటింగ్‌లను ప్రకటించింది. బంగ్లాతో తొలి టెస్టు జరిగిన చెన్నైలోని చెపాక్ స్టేడియం పిచ్ చాలా బాగుందని పేర్కొన్న ఐసీసీ.. రెండో టెస్టు జరిగిన కాన్పూర్ మైదానం అవుట్‌ఫీల్డ్‌పై మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇక, కివీస్‌తో టెస్టులకు వాడిన మూడు పిచ్‌లపై ఐసీసీ సంతృప్తి వ్యక్తం చేసింది. ఇక, బంగ్లాతో జరిగిన మూడు టీ20 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్, గ్వాలియర్, ఢిల్లీ మైదానాల పిచ్‌లు బాగున్నాయని ఐసీసీ వెల్లడించింది.

పట్నా ఫటాఫట్

జైపూర్‌పై విజయం

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో పట్నా పైరేట్స్ జట్టు నాలుగో విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో పట్నా 43-41తో జైపూర్ పింక్‌పాంథర్స్‌ను ఓడించింది. ఆరంభంలో దూకుడుగా ఆడిన పింక్‌పాంథర్స్ ఆఖర్లో పట్నా ఆటగాళ్ల అనూహ్య విజృంభణకు చేతులెత్తేసింది. పట్నా తరఫున అయాన్ 14, దేవాంక్ 11 పాయింట్లతో సత్తాచాటారు. జైపూర్‌లో అర్జున్ దేశ్వాల్ 20 పాయింట్లతో చెలరేగినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 39-26తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది.

ఆసీస్‌పై పాక్ ఘనవిజయం

అడిలైడ్: ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫలితంగా సిరీస్ 1-1తో సమం కాగా, ఆఖరి మ్యాచ్ ఆదివారం జరుగుతుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌ను పేసర్లు హారీస్ రౌఫ్ (5/29), షహీన్ అఫ్రీది (3/26) దెబ్బతీశారు. దీంతో ఆతిథ్య జట్టు 35 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప ఛేదనలో పాక్ 26.3 ఓవర్లలో 169/1 స్కోరుతో నెగ్గింది. సయీమ్ అయూబ్ (82), అబ్దుల్లా షఫీక్ (64 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించి తొలి వికెట్‌కు 137 పరుగులు జత చేశారు. అలాగే అడిలైడ్‌లో పాక్ 28 ఏళ్ల తర్వాత ఓ వన్డే మ్యాచ్‌ను గెలవడం గమనార్హం.

బిజినెస్

ఎస్‌బీఐ భళా

క్యూ2లో 23 శాతం వృద్ధితో రూ.19,782 కోట్లకు లాభం

ముంబై: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) బ్యాంక్ రూ.19,782 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి ఆర్జించిన రూ.16,099 కోట్ల లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధి కనబరిచింది. వడ్డీయేతర ఆదాయం పుంజుకోవడం, ట్రెజరీ కార్యకలాపాల ద్వారా లాభాలు పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. కాగా, ఈ క్యూ2లో ఎస్‌బీఐ స్టాండ్‌ఎలోన్ లాభం రూ.18,331 కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో నమోదైన రూ.14,330 కోట్లు, ఈ జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో గడించిన రూ.17,035 కోట్ల స్టాండ్‌ఎలోన్ లాభం కంటే అధికమిది. బ్యాంక్ కొత్త చైర్మన్‌గా తెలంగాణకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి బాధ్యతలు చేపట్టిన ఈ సెప్టెంబరు త్రైమాసికంలో ఎస్‌బీఐ మొత్తం ఆదాయం రూ.1.29 లక్షల కోట్లకు ఎగబాకింది. 2023-24 క్యూ2లో రెవెన్యూ రూ.1.12 లక్షల కోట్లుగా నమోదైంది. అయితే, మొత్తం వ్యయాలు సైతం రూ.92,752 కోట్ల స్థాయి నుంచి ఈ క్యూ2లో రూ.99,847 కోట్లకు పెరిగాయి.



బ్యాంక్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

వచ్చే ఫిబ్రవరి తర్వాతే రెపో తగ్గింపు

వచ్చే ఏడాది ఫిబ్రవరికి ముందు ఆర్‌బీఐ ప్రామాణిక వడ్డీ (రెపో) రేటును తగ్గించకపోవచ్చని శ్రీనివాసులు శెట్టి అన్నారు. అయితే, తమ రుణాల్లో 42 శాతం.. రెపో వంటి బహిరంగ మార్కెట్ ప్రామాణిక రేట్లతో అనుసంధానితమై లేవని.. బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) మెరుగైన స్థాయిలో కొనసాగించేందుకు ఇది దోహదపడుతున్నదన్నారు. బ్యాంకుల ఎన్‌ఐఎంలు నిలకడగా సాగనున్నాయని, డిపాజిట్లపై వడ్డీ రేట్లు ఇప్పటికే పతాక స్థాయికి చేరాయన్నారు.

- ఈ జూలై-సెప్టెంబరు కాలానికి ఎస్‌బీఐ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 5.37 శాతం పెరుగుదలతో రూ.41,620 కోట్లుగా నమోదైంది. ఈ సమయంలో బ్యాంక్ రుణాల్లో 15 శాతం వృద్ధి నమోదైనప్పటికీ, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 0.15 శాతం తగ్గి 3.14 శాతానికి జారుకోవడం వడ్డీ ఆదాయ వృద్ధిని పరిమితం చేసింది.
- వడ్డీయేతర ఆదాయం 42 శాతం వృద్ధితో రూ.15,271 కోట్లకు పుంజుకుంది. ఫారెక్స్, ట్రెజరీ లాభాలు పెరగడం ఇందుకు తోడ్పడింది.
- ఆస్తుల నాణ్యత విషయానికొస్తే, ఈ క్యూ2లో కొత్తగా రూ.3,831 కోట్ల రుణాలు మొండి పద్దులుగా మారాయి. ఈ జూన్ 30 నాటికి 2.21 శాతంగా ఉన్న బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) సెప్టెంబరు 30 నాటికి 2.13 శాతానికి తగ్గాయి. అయితే, మొండి బకాయిల కోసం కేటాయింపులు మాత్రం దాదాపు రెట్టింపై రూ.3,631 కోట్లకు పెరిగాయి.
- గతంలో బ్యాంక్ పద్దుల్లోంచి కొట్టివేసిన మొండిబాకీల్లో రూ.2,300 కోట్లను ఈ క్యూ2లో తిరిగి వసూలు చేయగలిగినట్లు శ్రీనివాసులు శెట్టి తెలిపారు.
- బ్యాంక్ అనుబంధ విభాగాల విషయానికొస్తే, జీవిత బీమా వ్యాపారం లాభం ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబరు) రూ.1,049 కోట్లకు పెరిగింది. క్రెడిట్ కార్డు వ్యాపార విభాగ లాభం రూ.999 కోట్లకు పరిమితం కాగా.. ఫండ్స్ మేనేజ్‌మెంట్ విభాగ లాభం రూ.1,347 కోట్లకు పెరిగింది. జనరల్ ఇన్సూరెన్స్ విభాగ లాభం రూ.414 కోట్లకు పుంజుకుంది.

వార్షిక లాభం.. రూ.లక్ష కోట్ల లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరానికి 14-16 శాతం రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. అయితే, డిపాజిట్ల వృద్ధిని మాత్రం గతంలో అంచనా వేసిన 12-13 శాతం నుంచి 10 శాతానికి తగ్గించుకున్నట్లు తెలిపారు. దేశంలోని వాణిజ్య సంస్థల్లోకెల్లా ఎస్‌బీఐదే అత్యధిక నికర లాభమన్న శెట్టి.. పూర్తి ఆర్థిక సంవత్సర నికర లాభాన్ని రూ.లక్ష కోట్ల స్థాయికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ లక్ష్యంలో భాగంగా తొలుత బ్యాంక్ నిర్వహణ లాభాన్ని రూ.లక్ష కోట్ల స్థాయికి పెంచి, ఆ తర్వాత నికర లాభాన్నీ ఆ స్థాయికి చేర్చాలనుకుంటున్నట్లు శుక్రవారం బ్యాంక్ ఆర్థిక ఫలితాలు విడుదల చేసిన అనంతరం మీడియాతో అన్నారు. అయితే, ఎప్పటిలోగా ఈ లక్ష్యాన్ని చేరుకోనున్న విషయంపైన మాత్రం ఆయన స్పష్టతనివ్వలేదు. సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధంలో ఎస్‌బీఐ నిర్వహణ లాభం రూ.63,895 కోట్లకు చేరుకుంది.

విప్రో ల్యాబ్స్ లాభంలో 110% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా 109.9 శాతం వృద్ధి చెంది రూ.17 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.8.1 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 26.4 శాతం వృద్ధితో రూ.67.6 కోట్ల నుంచి రూ.85.4 కోట్లకు చేరుకుందని కంపెనీ వెల్లడించింది. ఈ కాలంలో ఫార్మాస్యూటికల్ సర్వీసుల వ్యాపారం మంచి పనితీరు కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని పేర్కొంది. రానున్న త్రైమాసికాల్లో కొత్త ప్లాంట్ అందుబాటులోకి రానుండటంతో పాటు ఫార్మా సేవల వ్యాపారం ఇదే జోరును కొనసాగించే వీలుండటంతో మంచి ఫలితాలను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

టాటా మోటార్స్ లాభంలో క్షీణత

ముంబై: అమ్మకాలు అత్యంత నీరసంగా ఉండడంతో టాటా మోటార్స్ కన్సాలిటేడ్ లాభం సెప్టెంబరు త్రైమాసికంలో లాభం 9.9 శాతం క్షీణించి రూ.3,450 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.3,832 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.1,00,534 కోట్లుగా ఉండగా మొత్తం వ్యయాలు రూ.97,330 కోట్లుగా నమోదయ్యాయి. బ్రిటన్‌లోని కంపెనీ అనుబంధ సంస్థ జేఎల్ఆర్ ఆదాయాలు 5.6 శాతం క్షీణించి 650 కోట్ల పౌండ్లకు తగ్గడం, అల్యూమినియం సరఫరాలకు ఏర్పడిన తాత్కాలిక అంతరాయం లాభదాయకతను దెబ్బ తీసినట్టు కంపెనీ ప్రకటించింది.

తగ్గిన ఓలా ఎలక్ట్రిక్ నష్టం

ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ కన్సాలిడేటెడ్ నష్టం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.495 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో ఏర్పడిన నష్టం రూ.524 కోట్లుంది. కంపెనీ ఆదాయం రూ.873 కోట్ల నుంచి రూ.1,214 కోట్లకు పెరిగింది. అమ్మకాలు 74 శాతం పెరిగి 98,169కి చేరాయి.

ఎల్ఐసీ లాభం రూ.7,621 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) సెప్టెంబరు 30వ తేదీతో ముగిసిన రెండో త్రైమాసిక నికర లాభంలో 3.8 శాతం క్షీణత నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం రూ.7,925 కోట్ల నుంచి రూ.7,621 కోట్లకు తగ్గింది. అయితే ప్రీమియంల ద్వారా సమకూరిన ఆదాయం మాత్రం రూ.1,09,397 కోట్ల నుంచి రూ.1,19,901 కోట్లకు పెరిగింది. ఇతర ఆదాయం మాత్రం రూ.248 కోట్ల నుంచి రూ.145 కోట్లకు పడిపోయింది. క్యూ2 మొత్తం ఆదాయం రూ.2,29,620 కోట్లుగా, మొత్తం వ్యయాలు రూ.2,22,366 కోట్లుగా నమోదయ్యాయి. సాల్వెన్సీ నిష్పత్తి 190 శాతం నుంచి 198 శాతానికి పెరిగింది. రెండో త్రైమాసికం ముగిసే నాటికి స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.43 శాతం నుంచి 1.72 శాతానికి తగ్గాయి. కొత్త ప్రీమియం ఆదాయం రూ.29,538 కోట్లుగా నమోదైంది.

ఆరోగ్య బీమాలోకి ప్రవేశం

ఆరోగ్య బీమా అందిస్తున్న ఏదైనా ఒక కంపెనీలో వాటాలు కొనుగోలు చేసే విషయంలో నిర్ణయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకుంటామని ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి పని జరుగుతోందని, సరైన కంపెనీ కోసం అన్వేషణ కొనసాగుతున్నదని ఆయన చెప్పారు. ఎంత మొత్తంలో వాటా తీసుకుంటారు అన్న ప్రశ్నకు కంపెనీ విలువ సహా పలు అంశాలపై అది ఆధారపడి ఉంటుందన్నారు. క్షేత్ర స్థాయి పని పూర్తి కాగానే అనుమతి కోరుతూ బోర్డుకు ప్రతిపాదన పంపుతామని మొహంతి తెలిపారు.

27 నుంచి హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరోసారి పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోకు వేదికవుతోంది. ఈ నెల 27 నుంచి 29 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ కాంప్లెక్స్‌లో 'పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో- 2024' జరగనుంది. హైదరాబాద్‌లో ఈ ఎగ్జిబిషన్ జరగడం వరుసగా ఇది 16వసారి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో దేశ, విదేశాలకు చెందిన పౌల్ట్రీ పరిశ్రమ కంపెనీలు 400కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేయబోతున్నాయి. దీనికి తోడు 35కుపైగా దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, ఏటా ఈ ఎక్స్‌పోను నిర్వహించే ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) జాతీయ అధ్యక్షుడు ఉదయ సింగ్ బయాస్ విలేకరులతో చెప్పారు. ఎక్స్‌పో ప్రారంభానికి ముందు రోజు 26న నాలెడ్జ్ డే పేరుతో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా పౌల్ట్రీ పరిశ్రమలోకి ప్రవేశించాలనుకునే ఔత్సాహికులకు పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో చక్కటి వేదిక అన్నారు. మన దేశ జనాభా ఎదుర్కొంటున్న పోషకాహారలేమి సమస్యను అధిగమించేందుకు చౌకగా లభించే కోడి గుడ్లు చక్కటి ప్రత్యామ్నాయమని విలేకరుల సమావేశంలో పాల్గొన్న వెంకటేశ్వర హేచరీస్ ఉన్నతాధికారి కేజీ ఆనంద్ అన్నారు.

ఐఐటీ భువనేశ్వర్‌తో ఎంటిసార్ట్ ల్యాబ్స్ జట్టు

వీఎల్ఎస్ఐ ఎడ్యుటెక్ స్టార్టప్ ఎంటిసార్ట్ ల్యాబ్స్.. డిప్లొమా ప్రోగ్రామ్ కోసం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) భువనేశ్వర్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా సెమీకండక్టర్, చిప్ డిజైన్‌లో ఇన్నోవేటివ్ ప్రొఫెషనల్ డిప్లొమా కార్యక్రమాన్ని ఎంటిసార్ట్ అందించనుంది. సెమీకండక్టర్ టెక్నాలజీ, అనలాగ్ డిజైన్, డిజిటల్ డిజైన్ వెరిఫికేషన్ వంటి వీఎల్ఎస్ఐ స్పెషలైజేషన్స్‌లో పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దటం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపింది. ప్రధానంగా బీటెక్ ఈసీఈ, ఈఈఈ మూడు, నాలుగు సంవత్సరాల విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఈ కోర్సులను డిజైన్ చేసినట్టు తెలిపింది.

స్నాక్స్ తయారీలోని హల్దీరామ్ భుజియవాలా.. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ విధానంలో స్వల్ప వాటాలు విక్రయించడం ద్వారా పాంతోమత్ భారత్ వాల్యూ ఫండ్ (బీవీఎఫ్) నుంచి రూ.235 కోట్లు సేకరించింది. తయారీ సామర్థ్యాలు, మార్కెట్ల విస్తరణకు ఈ నిధులు ఉపయోగించుకోనున్నట్టు తెలిపింది.

మార్కెట్లో మళ్లీ నష్టాలే..

» సెన్సెక్స్ 55 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 424 పాయింట్లకు పైగా క్షీణించినప్పటికీ, చివరికి 55.47 పాయింట్ల నష్టంతో 79,486.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 51.15 పాయింట్లు కోల్పోయి 24,148.20 వద్ద ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 13 నష్టపోగా.. ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్ 2 శాతానికి పైగా క్షీణించి సూచీ టాప్ లూజర్లుగా మిగిలాయి. కాగా, ఆర్‌ఐఎల్ 1.66 శాతం, ఎస్‌బీఐ 1.86 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.53 శాతం తగ్గాయి. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో మాత్రం అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎస్ఈలోని స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 1.52 శాతం వరకు పతనమయ్యాయి.


ఈనెల 20న మార్కెట్లకు సెలవు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఈ నెల 20న (బుధవారం) సెలవు పాటించనున్నాయి. ఆ రోజు ఈక్విటీ, ఎఫ్ అండ్ ఓ, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ (ఎస్ఎల్‌బీ) విభాగాల్లో ట్రేడింగ్ జరగదు.

సంక్షోభంలో చక్కెర పరిశ్రమ

ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్


న్యూఢిల్లీ: దేశీయ చక్కెర పరిశ్రమ మరోసారి సంక్షోభంలో పడింది. చెరకు మద్దతు ధర పెంచినంతగా.. ప్రభుత్వం చక్కెర ధర పెంచకపోవడం పెద్ద సమస్యగా మారిందని చక్కెర పరిశ్రమ తెలిపింది. ప్రస్తుత చక్కెర సీజన్‌లో టన్ను చెరకు మద్దతు ధరను 8 శాతం పెంచి రూ.3,400గా నిర్ణయించిన ప్రభుత్వం, కిలో చక్కెరకు మిల్లులకు చెల్లించే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను 2018-19 నుంచి రూ.31 వద్దే కొనసాగించడాన్ని జాతీయ సహకార చక్కెర మిల్లుల సమాఖ్య (ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్) తప్పుపట్టింది. ప్రస్తుతం కిలో చక్కెర ఉత్పత్తి ఖర్చులే రూ.41.66 చేరినట్టు తెలిపింది. దీనికి తోడు ఎగుమతులపై నిషేధంతో ఈ సీజన్ చివరికి దేశీయ వినియోగం పోనూ 115 లక్షల టన్నుల చక్కెర నిల్వలు పేరుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి నుంచి ప్రభుత్వమే పరిశ్రమను ఆదుకోవాలని కోరింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,470 ▲	72,850 ▲	1,03,000 ▲
ముంబై	77,382 ▲	70,882 ▲	91,130 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	107
కర్నూలు	120	నెల్లూరు	107
విశాఖపట్నం	111	అనంతపురం	107
గోదావరి	120		

భోజన కుతూహలం

జొన్నకు జై

ఈ మధ్యకాలంలో జొన్నలను తినే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే జొన్నల వల్ల వచ్చే మంచి ఫలితాలను మన పూర్వీకులు ఎప్పుడో గమనించారు. అనేక గ్రంథాల్లో ప్రస్తావించారు.

జొన్నలను మన పూర్వీకులు దేవధాన్యం అనేవారు. ఇవి మానవులకు అమృతోపమానంగా పనిచేస్తాయని భావించేవారు. జొన్నలకు యావనాళం అనే మరో పేరు కూడా ఉంది. సాధారణంగా తెల్లగా కనిపించే గింజలను యవలంటారు. నాళ అనే శబ్దానికి "గొట్టంగా ఉండేవి"



- జొన్న గింజలను బాగా ఉడకబెట్టి.. దానిలో పాలు లేదా పెరుగు కలిపి తింటారు. కొందరు దీనిలోనే రకరకాల కూరగాయల ముక్కలను వేసి సూపుగా తయారుచేస్తారు.
- జొన్న రొట్టెలు ప్రతి రోజూ తింటే బరువు తగ్గుతారు. జొన్నలను బార్లీని కలిపి పిండిగా చేసి- రొట్టెలు చేసుకుంటే ఎక్కువ పోషకాలు లభిస్తాయి.
- కొన్ని ప్రాంతాల్లో జొన్నలను బీరు తయారీలో కూడా ఉపయోగిస్తారు.

అనే అర్థం కూడా ఉంది. దీనితో పాటు పసుపు రంగు అనే మరో అర్థం కూడా ఉంది. వీటన్నింటిని కలిపి చూస్తే- యావనాళం అంటే పచ్చజొన్నలు అని మనం అర్థం చేసుకోవచ్చు.

అనేక రకాలు...

జొన్నలను మన పూర్వీకులు జాగ్రత్తగా పరిశీలించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను గ్రంథస్థం చేశారు. జొన్నలు పచ్చగా కాకుండా తెల్లగా కూడా ఉంటాయి. పచ్చజొన్నలు వగరుగా ఉంటే- తెల్ల జొన్నలు తీపిగా ఉంటాయి. అందువల్ల ఆహార పదార్థాల తయారీలో తెల్ల జొన్నలనే ఎక్కువగా ఉపయోగిస్తారు. తెల్ల, పచ్చ జొన్నలతో పాటుగా- మహాయావనాళం అనే వేరే రకం గింజలు ఉంటాయని భోజన కుతూహలంలో పేర్కొన్నారు. ఈ మహాయావనాళాలే మొక్కజొన్నలు. ఇవి మంచి రుచిగా ఉంటాయి. తింటే సంతృప్తిని ఇస్తాయని.. వాతాన్ని తగ్గించి వేడిని పెంచుతాయని భోజన కుతూహలంలో శాస్త్రకారుడు పేర్కొన్నాడు. ఇక వాగ్భటుడు రాసిన అష్టాంగ హృదయం అనే గ్రంథంలో 'జూర్న' అనే చిన్న రకం జొన్నల ప్రస్తావన ఉంది.

ప్రయోజనాలెన్నో...

జొన్నల్లో తడి తక్కువగా ఉంటుంది. గరుకు గుణాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల ఇవి రక్తంలో పోషకాలను త్వరగా చేరుస్తాయి. ఇక తెల్ల జొన్నలు - బలప్రదంగా ఉంటాయని.. శరీరానికి స్థిరత్వాన్నిస్తాయని..వాతాన్ని, పైత్యాన్ని ,కఫాన్ని కూడా హరిస్తాయని.. స్త్రీపురుషుల శక్తిని పెంపుచేస్తాయని..మొలలు, గాయాలు, గడ్డల్ని తగ్గిస్తాయనీ.. రాజనిఘంటువు అనే వైద్యగ్రంథం పేర్కొంది. ఈ జొన్నల్లో ఉండే ఆహార పీచు పేవుల్ని సంరక్షిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. జొన్నల్లో కాల్షియం అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే ఎముకలు బలంగా ఉంటాయి. అంతే కాదు. జొన్నలు రక్తంలో కొవ్వును అదుపు చేస్తాయి. అందువల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోదు.

జీవనశైలి

ఒత్తిడి వదలడం కోసం...

ఒత్తిడితో ఒళ్లు హూనమవుతుంది. రక్తపోటు పెరగడం మొదలు, నిద్రలేమి వరకూ ఒత్తిడితో ఒరిగే దుష్ప్రభావాలకు అంతంటూ ఉండదు. కాబట్టి దైనందిన ఒత్తిడిని ఎప్పటికప్పుడు వదిలించుకుంటూ ఉండాలి. అందుకోసం కొన్ని నియమాలు పాటించాలి.

- మధ్యాహ్నం నిద్రతో ఒత్తిడి వదులుతుంది. అయితే ఆ కునుకును 10 - 15 నిమిషాలకే పరిమితం చేయాలి
- కొత్త అభిరుచులను అలవరుచుకోవాలి. నచ్చిన సంగీతం వినాలి.
- గ్రీన్ టీ తాగినా ఫలితం ఉంటుంది.
- ఇంటి పనులు చేసుకోవడం వల్ల కూడా ఒత్తిడి తగ్గుతుంది.
- వ్యాయామంతో శరీరం, మనసు తేలికపడి ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి
- అప్పుడప్పుడూ విహారయాత్రలకు వెళ్తూ ఉండాలి
- కుటుంబసభ్యులు, స్నేహితులతో సరదా సమయాన్ని గడుపుతూ ఉండాలి
- పెంపుడు జంతువుల వల్ల ఒత్తిడి మటుమాయమవుతుంది. ఆ ప్రయత్నమూ చేయొచ్చు.
- యోగా, ధ్యానం లాంటి వ్యాయామాలతో మనసు ప్రశాంతంగా మారుతుంది.



వంటిల్లు



'వీలైనంత బరువు తగ్గాలి. వీలైనంత తక్కువ నూనె వాడాలి. వీలైనంత వరకు అనారోగ్యాన్ని దగ్గరకు రానివ్వకూడదు.' ఈమధ్య కాలంలో ఎక్కువ మంది పాటిస్తున్న సూత్రాలివే. వీటికి అనుగుణంగా తయారు చేసుకోగలిగిన రుచికరమైన కూరలే ఇవి. మీరూ ప్రయత్నించండి.

ఆరోగ్యానికి అసలైన కూరలు





బెండకాయ చికెన్ పులుసు

కావాల్సిన పదార్థాలు: బెండకాయలు- అరకిలో, చికెన్ కైమా- అరకిలో, చింతపండు గుజ్జు- రెండు స్పూనులు, ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూనులు, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, మెంతులు- ఒక స్పూను, బెల్లం పొడి- రెండు స్పూనులు, పసుపు- అర స్పూను, అల్లం వెల్లుల్లి



పేస్ట్- రెండు స్పూన్లు, ధనియాల పొడి- ఒక స్పూను, జీలకర్ర పొడి- అర స్పూను, కొత్తిమీర (తరిగినది)- రెండు స్పూనులు, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- బెండకాయలను చిన్న చిన్న ముక్కలుగా తరగాలి. కైమాను ముక్కల్లా చేసుకోవాలి.
- మూకుడులో నూనె పోసి వేడి చేయాలి. ఈ నూనెలో ఆవాలు, జీలకర్ర, మెంతులు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, ఉప్పు వేసి వేయించాలి. ఈ మిశ్రమంలో చికెన్ ముక్కలను కలిపి పైన మూత పెట్టి పది నిమిషాలు మగ్గించాలి.
- ఇలా మగ్గిన మిశ్రమంలో బెండకాయ ముక్కలు, చింతపండు గుజ్జు వేసి తగినన్ని నీళ్లు పోసి.. ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి.
- ఆ తర్వాత ధనియాల పొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర వేసి కలయబెట్టి కిందకు దింపేయాలి.

జాగ్రత్తలు

- లేత బెండకాయల వల్ల కూర రుచిగా ఉంటుంది.
- చింతపండు గుజ్జును ముందుగా వేస్తే కూర ఉడకదు. అందువల్ల చింతపండు గుజ్జును ఆఖర్లో వేయాలి.



శైలజ ఏచూరి
శైలాస్ కిచెన్

దోసకాయ డైట్ కూర

కావాల్సిన పదార్థాలు: దోసకాయలు- అరకిలో, ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూన్లు, పసుపు- పావు స్పూను, ఎండుమిర్చి- నాలుగు, ధనియాలు- ఒక టేబుల్ స్పూను, మెంతులు- ఒక టేబుల్ స్పూను, జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, కారం- ఒక స్పూను, ఆవాలు- ఒక స్పూను, మినపప్పు- ఒకటిన్నర స్పూనులు, శనగపప్పు- ఒకటిన్నర స్పూనులు, ఎండుకొబ్బరి (తురుము)- రెండు స్పూన్లు, కొత్తిమీర (తరిగినది)- రెండు స్పూన్లు, చింతపండు గుజ్జు- రెండు స్పూన్లు, నీళ్లు- తగినన్ని

జాగ్రత్తలు

- ఈ కూరలో నూనెను వాడాల్సిన అవసరం లేదు.
- దీనిలో కూర దోసకాయను మాత్రమే వాడాలి. కీరాదోసను వాడకూడదు.

తయారీ విధానం

- దోసకాయల తొక్క తీయకుండా ముక్కలుగా తరగాలి. వాటిని ఒక కుక్కర్‌లో వేసి తగినన్ని నీళ్లు పోయాలి. వాటిలో ఉప్పు, పసుపు, కారం వేసి ఒక విజిల్ వచ్చేదాకా స్టౌ మీద ఉంచి.. ఆ తర్వాత దించేయాలి.



- ఒక మిక్సీ జార్‌లో పచ్చిమిర్చి, ఎండుమిర్చి, ధనియాలు, మెంతులు, జీలకర్ర, ఆవాలు, మినపప్పు, శనగపప్పు, ఎండుకొబ్బరి, చింతపండు గుజ్జు వేసి ముద్దగా చేయాలి.
- కుక్కర్ మూత వచ్చిన తర్వాత దానిలో ఈ ముద్దను, ఉల్లిపాయల ముక్కలను వేసి బాగా కలపి- ఐదు నిమిషాలు స్టౌ మీద పెట్టి ఉడకనివ్వాలి. దింపే ముందు కొత్తిమీర వేయాలి.

పొట్లకాయ ఫ్రై

కావాల్సిన పదార్థాలు: లేత పొట్లకాయ- పావు కిలో, ఆవాలు- ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, నూనె- రెండు స్పూనులు, కరివేపాకు- ఒక రెబ్బ, వెల్లుల్లి- రెండు పాయలు, ఉల్లిపాయముక్కలు- పావు కప్పు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూన్లు, కొబ్బరిపాలు- పావు కప్పు, పసుపు- పావు స్పూను, మసాలా కారం- ఒకటిన్నర స్పూను, కొత్తిమీర- తగినంత, ఉప్పు- తగినంత

జాగ్రత్తలు

- లేత పొట్లకాయలో గింజలు ఎక్కువగా ఉండవు. వీలైనంత వరకు లేత పొట్లకాయతో ఫ్రై చేసుకుంటే మంచిది. ముదురు పొట్లకాయతో కూర చేయాలనుకుంటే- గింజలను తీసేస్తే మంచిది.
- పొట్లకాయ తొక్కపై పొట్టులాంటి పదార్థం ఉంటుంది. అందువల్ల దీనిని ఎక్కువ సేపు నీళ్లలో కడగాలి.

తయారీ విధానం:

- లేత పొట్లకాయను చక్రాలుగా తరిగి బాగా కడగాలి. వాటిలో ఉప్పు వేసి కుక్కర్‌లో పెట్టి పదినిమిషాలు ఉడకనివ్వాలి.



- ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దీనిలో ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, కరివేపాకు వేసి బాగా దోరగా వేయించాలి. దీనిలో పొట్లకాయ ముక్కలు వేసి వేయించాలి.
- ఆ తర్వాత కొబ్బరిపాలు, మసాలా కారం, కొత్తిమీర వేసి దగ్గర పడనివ్వాలి.



గృహ హింసపై నిరసన ధ్వని

"గృహ హింస మహిళల సమస్య మాత్రమే కాదు. దాని ప్రభావం సమాజంలోని అనేక స్థాయిల్లో ఉంటుంది. మహిళలు ధైర్యంగా ముందుకు వస్తేనే దీన్ని నిరోధించగలం" అంటారు డాక్టర్ ప్రసన్న గెట్టు. గృహ హింస నిరోధం కోసం, బాధితుల రక్షణ కోసం 23 ఏళ్ల కిందట ఆమె ఏర్పాటుచేసిన సంస్థ... వేలాది మంది కన్నీళ్లు తుడుస్తోంది, వాళ్ల భవిష్యత్తుకు భరోసా ఇస్తోంది.





"అత్తింట్లో ఆరళ్ళతో, భర్తల వేధింపులతో సతమతమయ్యే ఎందరో మహిళలను నేను బాల్యం నుంచి చాలా దగ్గరగా చూశాను. కనీసం వారి వేదన వినేవారు కూడా లేని దుస్థితి నాకు బాధ కలిగించింది. అలాంటి వారికి మేమున్నామని ధైర్యం చెప్పే ఒక వ్యవస్థ మన సమాజంలో అవసరం. నేను చేస్తున్నది అటువంటి ప్రయత్నమే" అని చెబుతారు డాక్టర్ ప్రసన్న గెట్టు. చెన్నైకి చెందిన ఆమె సారథ్యంలో ఏర్పాటైన 'ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్' (పిసివిసి) ఎన్నో వేలమంది గృహ హింస బాధితులకు అండగా నిలుస్తోంది. ఈ సంస్థ ఏర్పాటు వెనుక ఎంతో ఆలోచన ఉందంటారు ప్రసన్న. "అది 1998-99 మధ్య కాలం. నేను మద్రాసు విశ్వవిద్యాయంలో క్రిమినాలజీ విభాగంలో పిహెచ్‌డి చేస్తున్నాను. ఒక రోజు మా విభాగం అధిపతి నన్ను పిలిచారు. జపాన్‌లోని 'టోకివా యూనివర్సిటీ'లో... విక్టిమాలజీలో డిప్లమా చేయడానికి ఎంపిక చేసిన ముగ్గురిలో నా పేరు కూడా ఉందని చెప్పారు. నా ఆనందానికి అవధులు లేవు. వెంటనే జపాన్ ప్రయాణానికి సిద్ధమయ్యాను. అక్కడ 'వరల్డ్ సొసైటీ ఆఫ్ విక్టిమాలజీ'లో ఆ కోర్సును అప్పుడే ప్రవేశపెట్టారు. మాదే మొదటి బ్యాచ్. ఆ కోర్సు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఎందుకంటే క్రిమినాలజీలో భాగంగా అప్పటివరకూ నేరస్తులు, వారి మనస్తత్వాల గురించి మాత్రమే మేము చదువుకున్నాం. కానీ విక్టిమాలజీలో బాధితులు, వాళ్ల సమస్యలు, వాటికి పరిష్కారాలు లాంటి అంశాలను కూడా అధ్యయనం చేసే అవకాశం కలిగింది" అంటారు ప్రసన్న.

ఏ సమయంలోనైనా...

క్షేత్రస్థాయి పరిశీలన కోసం జపాన్‌లో బాధిత సహాయ కేంద్రాలను కూడా తన తోటి విద్యార్థులతో పాటు ప్రసన్న సందర్శించారు. బాధితులతో నేరుగా మాట్లాడారు. "వారు తమ గురించి చెబుతున్నప్పుడు మాకు కన్నీరు ఆగలేదు. వారి కోసం ఒక స్థిరమైన వ్యవస్థ ఉన్న దేశంలోనే ఇలా ఉంటే... ఇక మన దేశంలో పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న మమ్మల్ని వెంటాడింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత.. చెన్నైలో బాధిత సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకున్నాం. అలా 2001లో 'పిసివిసి' ప్రారంభమయింది" అని ఆమె గుర్తు చేసుకున్నారు. మొదట్లో బాధితుల కథలను వినడం, వారికి, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, న్యాయసహాయం చెయ్యడం లాంటి కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ సమస్య లోతులకు వెళ్లే కొద్దీ చెయ్యాల్సింది చాలా ఉందని గ్రహించారు. గృహ హింస భరించలేక ఇంటినుంచి బయటకు వచ్చిన మహిళలకు, ఆపదలో ఉన్న స్త్రీలకు ఆశ్రయాన్ని కల్పించాలని నిర్ణయించుకున్నారు. దానికోసం అమెరికా వెళ్ళి, అక్కడ షెల్టర్ హోమ్స్, కమ్యూనిటీ షెల్టర్లను పరిశీలించారు. వాటి పనితీరును తెలుసుకున్నారు. అలాగే బాధితుల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటుకు అవసరమైన శిక్షణ కూడా తీసుకున్నారు. ఆ తరువాత 'ధ్వని' అనే హాట్‌లైన్‌ను జాతీయ స్థాయిలో ఏర్పాటు చేశారు. అది రోజంతా పని చేస్తుంది. బాధితులెవరైనా, ఏ సమయంలోనైనా కాల్ చేసి, తమ సమస్యను వివరించవచ్చు. వారికి అవసరమైన సలహాలు ఇవ్వడానికి, ఆశ్రయపరమైన, న్యాయపరమైన, ఉపాధిపరమైన సాయాన్ని సూచించడానికి సామాజిక కార్యకర్తలు, మానసికవేత్తలతో కూడిన ఒక బృందం ఉంటుంది.

ఈ ధోరణి మారాలి

"ఇల్లు అనేది ప్రేమను, సంరక్షణను అందించే ప్రదేశం అని మనం నమ్ముతాం. కానీ యాభై శాతానికి పైగా ఏదో రూపంలో గృహహింస జరుగుతోందని జాతీయ రికార్డులు చెబుతున్నాయి. ఇది మహిళలపైనే కాదు, ఈ హింసను చూస్తూ పెరిగే పిల్లల మనస్తత్వాల మీద కూడా ప్రభావం చూపిస్తోంది. పక్కింట్లో ఇలాంటివి జరుగుతున్నాయని తెలిసినా... 'అది వాళ్ల గొడవ, మనకెందుకు' అని చాలామంది పట్టించుకోరు. అధికారులకు ఫిర్యాదు చేసినా సర్దుకుపోవాలని సలహాలు ఇస్తారు. ఈ ధోరణి మారాలి" అంటారు ప్రసన్న. ఆ దిశగా చైతన్యం తేవడానికి, అవగాహన పెంచడానికి 'పిసివిసి' కృషి చేస్తోంది.

సంరక్షణ... ఉపాధి కల్పన...

మరోవైపు గృహహింస బాధితులకు అందించే సేవలను కూడా 'పిసివిసి' విస్తృతం చేసింది. బాధితులకు అత్యవసర సాయం అందించడానికి, దీర్ఘకాలికంగా పునరావాసం కల్పించడానికి తమిళనాడులో 11 కేంద్రాలను నడుపుతోంది. ఎవరైనా హాట్‌లైన్‌కు ఫోన్ చేసిన వెంటనే వారి వివరాలను వాలంటీర్లు నమోదు చేసుకుంటారు. దగ్గరలో ఉన్న కేంద్రానికి వివరాలు పంపిస్తారు. "మాకు రోజూ వందల కాల్స్ వస్తూ ఉంటాయి. వివిధ రాష్ట్రాల్లో పలు సంస్థలు మాతో కలిసి పని చేస్తున్నాయి. ఆ రాష్ట్రాల నుంచి వచ్చే కాల్స్‌ను వాటికి ఫార్వర్డ్ చేస్తాం. మా దగ్గర ఆశ్రయం కోరేవాళ్ళు కూడా ఎక్కువే. వారి సంరక్షణకు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇక గృహ హింస బాధితుల్ని సమాజం చూసే తీరులో కూడా మార్పు రావాలి. హింసను ఏ రూపంలోనూ సహించకూడదు. అందరూ హుందాగా, గౌరవంగా బతకాలన్నదే నా ఆకాంక్ష" అంటున్నారు ప్రసన్న.

మేకప్

చలిలో చమక్కుమనేలా...

పొడిచర్మం కలిగినవాళ్లకు చలికాలం ఇక్కట్లు తప్పవు. ఈ కాలంలో చర్మం చిట్లి, పొట్టు రేగే గుణం కలిగినవాళ్లు మేకప్ వేసుకునేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. అవేంటంటే...

ఫేస్‌వాష్: చర్మంలో మిగిలి ఉన్న తేమను వదిలించే సబ్బులకు బదులుగా విటమిన్‌సిని కలిగి ఉండే ఫేస్‌వాష్ ఎంచుకోవాలి. దీంతో చర్మంలోని మలినాలు తొలగడంతో పాటు చర్మపు తేమ భద్రంగా ఉంటుంది. ఫేస్‌వాష్‌తో ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత, అదనపు తేమ కోసం హైడ్రేటింగ్ సీరమ్‌ను పూసుకోవాలి. తర్వాత ప్రైమర్‌ను ముఖానికి అద్దుకుని, ఆ తర్వాతే మేకప్ వేసుకోవడం మొదలుపెట్టాలి.

ఫౌండేషన్: తేమను కలిగి ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకుంటే, ముఖం మరింత పొడిబారకుండా ఉంటుంది. అలాగే దీన్ని ముఖానికి పూసుకోవడం కోసం తడిపి పిండిన స్పాంజి వాడుకోవాలి. ఫౌండేషన్‌లో కొద్దిగా ఫేసియాల్ నూనెను కలిపి ముఖం మీద సమంగా అద్దుకోవాలి.

ఉత్పత్తులు: ఈ కాలంలో పౌడర్ ఆధారిత ఉత్పత్తులకు బదులుగా క్రీమ్ ఆధారిత ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవైతే చర్మంలో చక్కగా ఇంకిపోయి, చక్కని మెరుపునూ, మృదుత్వాన్నీ ఇస్తాయి.

ఐ మేకప్: కళ్ల చుట్టూ ముడతలు, వలయాలను కనిపించకుండా చేయడం కోసం, వీలైనంత తక్కువ ఫౌండేషన్ అద్దుకోవాలి. దీన్లో కాస్త ముదురు రంగు బ్లష్‌ను కలిపి కనురెప్పల దిగువన అద్దుకుంటే కళ్ల కింద నలుపు చర్మంలో కలిసిపోతుంది. కనురెప్పల పైన వేసుకునే ఐషాడో కూడా లేత రంగులో క్రీమ్ ఆధారితమైనదై ఉండేలా చూసుకోవాలి.



లిప్‌స్టిక్: లిప్‌స్టిక్ వేసుకునే ముందు పెదవుల మీద మృత కణాలను తొలగించి, తేమ కోసం అదనపు ఉత్పత్తులు వాడుకోవాలి. ఇలా పెదవులను మృదువుగా మార్చుకున్న తర్వాత లిప్‌స్టిక్ వేసుకుంటే, పెదవులు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. పెదవుల పగుళ్లు కూడా దూరమవుతాయి.

అలంకరణ

ఇలా అలంకరిస్తే ఆహ్లాదకరం

ఇంట్లో ముందు గది (లివింగ్ రూమ్)లోనే మనం ఎక్కువ సమయం గడుపుతూ ఉంటాం. కాబట్టి ఆ గదిని వీలైనంత సౌకర్యంగా, ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా మలచుకోవాలి. అందుకోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించాలి.

టీవి చూడడానికీ, కుటుంబంతో సరదా సమయాన్ని గడపడానికీ, అతిథులతో కాలక్షేపం చేయడానికీ లివింగ్ రూమ్‌నే ఎంచుకుంటాం. వీలైనంత సౌకర్యంగా ఉండేలా మెత్తని సోఫాలు, తివాచీలను కొంటూ ఉంటాం. అయితే దుకాణాల్లో మనకెంతో నచ్చిన అలంకరణ సామాగ్రి, కర్టెన్లు, తివాచీలు మన ఇంట్లో లివింగ్ రూమ్‌కు నప్పకపోవచ్చు. కొని తెచ్చిన తర్వాత వాటిని వెనక్కి తిరిగి పంపడం వీలు పడదు కాబట్టి అన్ని విధాలా నప్పే సామాగ్రినే ఎంచుకోవాలి. అందుకోసం ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

కచ్చితమైన కొలతల ఆధారంగా...

ముందు గది అలంకరణకు పూనుకునే ముందు, ఆ గది వైశాల్యాన్ని లెక్కించాలి. కచ్చితమైన కొలతలు అందుకు తగిన సోఫాలు, కుర్చీలు, కర్టెన్లు, తివాచీలను ఎంచుకోవడానికి తోడ్పడతాయి. చిన్న గదిలో పెద్ద పూల కర్టెన్లు వేలాడదీస్తే, గది మరింత చిన్నదిగా కనిపిస్తుంది. అలాగే సోఫాలు, తివాచీలు ఖరీదైనవి. కాబట్టి వాటిని కొనే ముందు గది కొలతలు తీసుకోవాలి. సోఫాను ఎక్కడ ఉంచాలో, తివాచీని ఎక్కడ పరచాలో, టివిని ఏ గోడకు, ఎంత ఎత్తులో బిగించాలో ముందుగానే అంచనా వేసుకోవాలి.

ఆలోచనలకు తగ్గట్టు...

కిటికీ దగ్గర కూర్చుని పుస్తకం చదువుకోవడం, సోఫాలో జారగిలబడి టివి చూడడం, తివాచీ మీద కుషన్లు వేసుకుని సేద తీరడం లాంటివి మీకిష్టమైన పనులైతే గది అలంకరణ అందుకు తగ్గట్టుగానే ఉండాలి. పిల్లలున్న ఇల్లైతే గాజు టేబుళ్లు లాంటి లేకుండా చూసుకోవాలి. గోడలోకి ఇమిడి ఉండే అల్మారాలైతే స్థలం కలిసొస్తుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. అలాగే గదిలో అమర్చే సోఫా తయారీకి ఉపయోగించే మెటీరియల్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా గది శుభ్రం చేయడానికి వీలుగా, ఇరుకు లేకుండా ఉండేలా చూసుకోవాలి.



గోడల అలంకరణ ఇలా...

క్యాలండర్ల కాలం చెల్లిపోయింది. అలాగే ఫొటో ఫ్రేములకు కూడా! ఇప్పుడంతా కళాత్మకతకే పెద్ద పీట. కాబట్టి ఆహ్లాదకరమైన పెయింటింగ్‌లు, మ్యూరల్స్‌కు చోటు కల్పించాలి. వాల్‌పేపర్లు, డూడ్లింగ్ తాజా ట్రెండ్ కాబట్టి వీలైతే ఒక గోడను అందుకే పరిమితం చేయాలి. గోడలకు వేసే రంగులు లేతగానే ఉండాలి. ఎరుపు, గోధుమ, నీలం లాంటి రంగులకు బదులుగా తెలుపు, లేత గులాబీ రంగులను ఎంచుకోవాలి. ఇలా కాస్త లోతుగా ఆలోచించి, ముందస్తు జాగ్రత్తలతో మసలుకుంటే లివింగ్ రూమ్‌లో ఆ జీవం ఉట్టిపడుతుంది.

కబ్జా భూముల్లో కేతిరెడ్డి కోట

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం శివారులో కేతిరెడ్డి నిర్మించుకున్న గుర్రాల కోట, చెరువులో ఫాంహౌస్



కళ్ల ముందే కనిపిస్తున్నా... ఐదేళ్లూ కళ్లు మూసుకున్నారు

- చెరువు భూములు మింగేసి.. రైతు పొలాలు చదును చేసి..
- ధర్మవరంలో విలాసవంతమైన ఫాంహౌస్
- 31 ఎకరాల్లో రేస్‌లు, బోటింగ్.. గుర్రపు స్వారీ..
- కేతిరెడ్డి సరదాలకు నాడు దాసోహం
- ప్రభుత్వం మారగానే ఆ భూములపై ఆరా
- వారంలోగా ఖాళీ చేయాలంటూ నోటీసులు
- రాజకీయ ఒత్తిళ్లతోనే నోటీసులు: కేతిరెడ్డి

(ధర్మవరం - ఆంధ్రజ్యోతి)

విలాసవంతమైన ఫాంహౌస్.. విస్తారమైన మైదానంలో రేసింగ్ ట్రాక్.. సేద తీరేందుకు చెరువులో స్పెషల్ బోటింగ్ ఏర్పాటు.. సరదాకు గుర్రపు స్వారీలు.. ఒక్కమాటలో అది కబ్జాభూముల్లో నిర్మించిన పేద్ద కోట! అంతంత భూముల్లో ఎంతెంతో హడావుడి కనిపిస్తున్నా, గత ఐదేళ్లూ రెవెన్యూ అధికారులు కనీసం అటు వైపు చూడలేదు. అది మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఎస్టేట్ కావడంతో వైసీపీ ప్రభుత్వంలో అధికారులు కళ్లు మూసేసుకున్నారు. ఈ ప్రాంతాన్ని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ప్రజలు 'గుర్రాల కోట' అని పిలుస్తుంటారు. ఆ స్థాయిలో పెద్ద పెద్ద షెడ్లు వేసి పదులసంఖ్యలో గుర్రాలను ఉంచారు. టీడీపీ నేత నారా లోకేశ్ గత ఎన్నికలకు ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రతో కేతిరెడ్డి కోట వ్యవహారం తొలిసారి పతాకశీర్షికలకు ఎక్కింది. తాజాగా కేతిరెడ్డి బంధువులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ధర్మవరంలో అడ్డగోలుగా భూకబ్జాలకు కేతిరెడ్డి పాల్పడ్డారు. కంటికి కనిపించిన ప్రతి స్థలాన్నీ సొంతం చేసుకున్నారు. అది రైతుల పొలమా.. చెరువు భూమా అనేది లేకుండా భారీఎత్తున భూఆక్రమణలు సాగించారు. ఈ విధంగా.. ధర్మవరంలోని సర్వే నంబరు 661-1 (908, 909, 910)లో 20.61 ఎకరాల ఇరిగేషన్ స్థలాన్ని, మల్లాకాల్వ గ్రామ పరిధిలో 1-1, 2-1, 2-2 సర్వే నంబర్లు, పోతులనాగేపల్లి గ్రామ పరిధిలోని 43.ఏ, 43.2ఏ, 43.2బీ సర్వే నంబర్లలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు.

రెవెన్యూ మాయాజాలం

ధర్మవరంలోని కేతిరెడ్డి ఎస్టేట్‌లోని ప్రతి ఎకరం మరదలు గాలి వసుమతి పేరుతోనే ఉంది. ధర్మవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని 904, 905, 908, 909 సర్వే నంబర్లలో వసుమతి పేరిట రైతుల నుంచి 25 ఎకరాలు కొనుగోలు చేసినట్లు రికార్డులో ఉంది. రైతులను బెదిరించి అతితక్కువ ధరకు వీటిని కొన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. రైతుల నుంచి కొనుగోలుచేసిన భూమిలో కొంత వసుమతికి పిత్రార్జితంగా వచ్చినట్లు అప్పటి రెవెన్యూ అధికారులు రికార్డులు సృష్టించారు. అయితే, వసుమతిది కర్నూలు జిల్లా. కేతిరెడ్డి తమ్ముడు వెంకటకృష్ణారెడ్డిని పెళ్లాడి ధర్మవరంలో అడుగుపెట్టారు. అలాంటప్పుడు.. ఆమెకు ధర్మవరంలో పిత్రార్జితం ఎలా సంక్రమించింది? అయితే, ఇది పక్కా అప్పటి రెవెన్యూ అధికారుల మాయ అని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ భూములను అనుకుని ఉన్న 661-1 (908, 909, 910) సర్వే నంబరులో ఉన్న చెరువు స్థలంలో 20.61 ఎకరాల వరకు ఆక్రమించి, కలిపేసుకున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ భూముల్లో గుర్రాల కోటను నిర్మాణం చేశారు. అలాగే...ధర్మవరం మండలం పోతులనాగేపల్లి, మల్లాకాల్వ గ్రామాలలో ఆక్రమించిన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని గాలి వసుమతి, తన అనుచరుడు జోగన్నగారి సూర్యనారాయణ పేరుతో ఉంచినట్లు సమాచారం. ఈ భూములకు సంబంధించి.. తాజాగా వారిద్దరికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు.

వారంలో అప్పగించాల్సిందే..

గాలి వసుమతి పేరిట ఆక్రమించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆక్రమించిన మైనర్ ఇరిగేషన్ శాఖ, చెరువు భూములు, ప్రభుత్వ భూములను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. వివిధ సర్వే నంబర్లలో ఆక్రమించిన సుమారు 30.61 ఎకరాల భూములను ఈ నెల 13వ తేదీలోగా అప్పగించాలని, లేదంటే తామే స్వాధీనం చేసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తమ నోటీసులలో కబ్జాలు జరిగిన తీరును విశ్లేషించారు. వాటిని అనుసరించి.. ధర్మవరంలోని క్రియాశక్తి వడయార్ చెరువు భూమిని ఎలాంటి అనుమతి పొందకుండా కేతిరెడ్డి ఆక్రమించుకున్నారు. 1984 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 15వ యాక్టు, సెక్షన్ 38తోపాటు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ జీవో జీవో 188(21-07-2011) ప్రకారం నోటీసులు ఇస్తున్నామని ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 6న నోటీసులు ఇచ్చిన అధికారులు.. వారంలోగా ఆక్రమిత భూములను ఖాళీ చేయాలని హెచ్చరించారు. ఆ భూముల్లో ఉన్న పంటలు, చెట్లు, కట్టడాలను కూడా తొలగించాలని, లేదంటే వాటిని ప్రభుత్వానికి అప్పగించినట్లు భావిస్తామని పేర్కొన్నారు. కబ్జా భూమిని ఖాళీ చేయకపోతే ఎలాంటి సమాచారం లేకుండా, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తాము స్వాధీనం చేసుకుంటామని నోటీసులలో పేర్కొన్నారు.



శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని చిక్కవడయార్ చెరువులో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బోటింగ్ (ఫైల్)

'కౌంటరు' పడిందిగా..

ధర్మవరం పట్టణానికి అనుకుని ఉన్న చిక్కవడయార్ చెరువు(క్రియాశక్తి వడయార్) భూములు, ప్రభుత్వ భూములను కేతిరెడ్డి ఆక్రమించారని 2023 ఏప్రిల్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. యువగళం పాదయాత్రలో భాగంగా ధర్మవరం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. కేతిరెడ్డి కబ్జాల గురించి బహిరంగ ఆరోపణలు చేశారు. దీంతో స్పందించిన కేతిరెడ్డి.. విజయవాడలో టీడీపీ అధినేత చంద్రబాబు నివాసం ఉంటున్న ప్రాంతానికి వెళ్లారు.. తన కబ్జాలను నిరూపించాలని అక్కడ నుంచి సవాల్ చేశారు. తాను కబ్జాలకు పాల్పడలేదని అన్నారు. ఆ మరుసటి రోజే చెరువు కబ్జా ఆధారాలను ఫొటోలతో లోకేశ్ విడుదల చేశారు. ఆ తరువాత కేతిరెడ్డి నోరు మెదపలేదు.

అధికారుల నోటీసులపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోషల్ మీడియా ద్వారా స్పందించారు. తమ స్వాధీనంలో ఉన్న భూములు ఏవీ ఆక్రమించుకున్నవి కాదన్నారు. అన్నీ న్యాయబద్ధంగానే ఉన్నాయని తెలిపారు. వీటిపై గతంలో కోర్టుకు వెళ్లారని, కోర్టు తమకే వాటిని కేటాయించిందన్నారు. ప్రభుత్వం మారడంతో తనను ఇబ్బంది పెట్టేందుకు అధికారులపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు పెరిగాయని, అందుకే నోటీసులు ఇచ్చారని తెలిపారు. వీటిపై కోర్టుకు వెళుతున్నామని కేతిరెడ్డి అన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే నోటీసులు: కేతిరెడ్డి



ధర్మవరం శివారు ప్రాంతంలోని కోటలో జీపుపై గుర్రాలతో కేతిరెడ్డి (ఫైల్)

భూ మార్పిడి పేరుతో 100 కోట్ల దోపిడీ

- ద్వారంపూడి మేనమామపై ఎమ్మెల్యే వనమాడి ఆరోపణ

కాకినాడ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భూ మార్పిడి పేరుతో రూ.100 కోట్ల విలువైన భూమిని మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మేనమామ కాజేశారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన రాగంపేట, శ్రీవిద్యా కాలనీలోని 'చేంజ్ ఆఫ్ ల్యాండ్' స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ద్వారంపూడి మేనమామ సత్తి గోపాలరెడ్డి. ఆయనకు కాకినాడ బ్యాంకుపేటలో స్థలం ఉంది. తన మేనల్లుడు ద్వారంపూడి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన సహకారంతో తన స్థలాన్ని పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఇచ్చాడు. దానికి బదులు శ్రీవిద్యా కాలనీలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని తీసుకున్నారు. ఈ మేరకు జీవో జారీ చేయించుకున్నారు. గోపాలరెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన రాగంపేటలోని స్థలంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి 2008లో అప్పటి సీఎం వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారు. నాటి నుంచి నేటి వరకూ అక్కడ ఎలాంటి ఇళ్లనూ నిర్మించలేదు. పైగా నేటికీ ఈ స్థలాన్ని గోపాలరెడ్డి ప్రభుత్వానికి అప్పగించలేదు. ఆ భూమి విలువ రూ.100 కోట్ల వరకూ ఉంది. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాను. భూమిని స్వాధీనం చేసుకొని, అక్కడ పేదలకు ఇళ్లు కట్టించేలా చర్యలు చేపడతా' అని ఎమ్మెల్యే తెలిపారు.

తిరుమలలో శారదాపీఠం అతిక్రమణలు నిజమే

- నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు గుర్తించిన నిపుణుల బృందం

తిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో విశాఖ శారదా పీఠం నిర్మిస్తున్న కట్టడాల్లో నిబంధనలు అతిక్రమించినట్లు ప్రత్యేక నిపుణుల బృందం తేల్చింది. విశాఖ శారదాపీఠానికి గత జగన్ సర్కారు అక్రమంగా కట్టబెట్టిన అదనపు స్థలం కేటాయింపును ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా అదనపు స్థలాన్ని ఆక్రమించి ఆ పీఠం నిర్మాణాలు చేపట్టడంపై తీవ్రస్థాయిలో దుమారం రేగిన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని టీటీడీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఏర్పాటైన నిపుణుల కమిటీ గత పదిరోజులుగా మరాన్ని పరిశీలించింది. అతిక్రమణలపై ప్రాథమిక నివేదిక రూపొందించింది. బేస్‌మెంట్‌లో పార్కింగ్ మాత్రమే ఉండాల్సిన చోట 456.51 చదరపు మీటర్లలో రెండు గదులతో పాటు రెండు హాళ్లను కట్టారని, ఎన్‌బీసీ నిబంధనల ప్రకారం కింద ఫ్లోర్‌లో ఎలాంటి కట్టడాలు ఉండకూడదని నివేదిక పేర్కొంది. అలాగే 1,009.4 చదరపు మీటర్ల స్థలాన్ని పెంచుకుని జీప్లస్3 నిర్మాణాలు చేపట్టారని తేల్చింది. దీంతో పాటు అనుమతులు లేకుండానే 471.41 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నాలుగో అంతస్తు కడుతున్నారని గుర్తించారు. ఇక, బ్లాక్-ఏ, ఓల్డ్ బ్లాక్ భవనాలను 17 మీటర్లకు, బ్లాక్-బీని 19 మీటర్లకు ఎత్తు పెంచినట్లు నిర్ధారించారు. నిపుణుల కమిటీ త్వరలో పూర్తిస్థాయి నివేదికను టీటీడీకి సమర్పించనుంది.

విద్యుత్తు చార్జీల పెంపు దుర్మార్గం

- 19న విజయవాడలో వామపక్షాల నిరసన

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):సర్దుబాటు పేరుతో ప్రజలపై విద్యుత్తు చార్జీల భారాన్ని మోపడం దుర్మార్గమంటూ వామపక్షాలు కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. పెంచిన చార్జీలను రద్దు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామంటూ ఈ నెల 19న విజయవాడలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. విద్యుత్తు చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు, రౌండ్ టేబుల్ మీటింగ్‌లు, సదస్సులు నిర్వహించాలని నిర్ణయించాయి. సీపీఐ, సీపీఎంల తోసహా వివిధ వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు శుక్రవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర ప్రజలపై రూ.6,072 కోట్ల మేర విద్యుత్తు సర్దుబాటు చార్జీల భారాన్ని మోపగా.. ఇప్పుడు మరో రూ.11వేల కోట్ల భారం వేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్తు చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు నెపాన్ని గత జగన్ సర్కారుపైకి నెట్టేయడం దుర్మార్గమన్నారు.

'ఉపాధి'లో క్షేత్రస్థాయి బదిలీలేవి?

- వైసీపీ హయాంలో ఇతర జిల్లాలకు తప్మదీయులు
- కొత్త ప్రభుత్వంలో ఇంకా బదిలీలకు దక్కని మోక్షం
- అదే సిబ్బంది కావడంతో కొనసాగుతున్న దొంగ మస్టర్లు
- స్థానిక నేతలు, కూలీల నుంచి కూడా ఒత్తిళ్లు
- సొంత జిల్లాకు వచ్చేందుకు కొంత మంది ఎదురుచూపులు

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలైనా గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది బదిలీలు నిర్వహించకపోవడంతో పథకం నిర్వహణ గందరగోళంగా మారింది. వైసీపీ హయాంలో టీడీపీ సానుభూతిపరులంటూ కొంతమంది ఉపాధి సిబ్బందిని టార్గెట్ చేసి మరీ జిల్లాలు దాటించారు. కడప జిల్లాకు చెందిన ఏపీఓలు కొందరు తిరుపతి జిల్లాకు వెళ్లి ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి! వారు నేడు బదిలీల కోసం ఎదురుచూస్తున్నా.. గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. మరోవైపు వైసీపీ హయాంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన ఉద్యోగులు ఇప్పటికీ కొనసాగుతుండటం, గ్రామాల్లోని అధికార పార్టీ నేతలకు వారితో సఖ్యత లేకపోవడంతో కొన్నిచోట్ల సిబ్బందిపై దాడులు జరుగుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన దొంగ మస్టర్ల వంటి అవినీతి కార్యకలాపాలు యథాతథంగానే కొనసాగుతున్నాయి. ఇప్పుడు కూడా అదేవిధంగా మస్టర్లు వేయాలంటూ కూలీలు, స్థానిక నేతలు ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా స్థాయి డ్వామా పీడీ అధికారులను బదిలీ చేసిన కూటమి ప్రభుత్వం.. క్షేత్రస్థాయి సిబ్బందిని బదిలీ చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యేల ఒత్తిడితో కొంత మంది సిబ్బందిని బదిలీ చేసినా, మరి కొన్ని చోట్ల మాత్రం కమిషనరేట్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చేదాకా బదిలీలు చేపట్టబోమని పీడీలు పేర్కొంటున్నారు. గత నెలలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ నవంబరు నుంచి ఉపాధి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలు చేపడతామని, ఆ మేరకు షెడ్యూల్ సిద్ధం చేయాలని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్‌ను ఆదేశించారు. అయితే ఇప్పటి వరకు ఆ షెడ్యూల్ తయారు చేయకపోవడంతో.. ఈ నెలలో బదిలీలు ఉండవేమోనన్న ఆందోళనతో సిబ్బంది ఉన్నారు.

అప్పుడేసి... ఇప్పుడెందుకు వేయరు?

గత ప్రభుత్వ హయాంలో మండల కార్యాలయాల్లో ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ముందు కూర్చొని మస్టర్లు నమోదు చేసిన పరిస్థితులు ఉన్నాయి. ఉన్నతాధికారులు రాష్ట్ర స్థాయి నుంచి టార్గెట్లు పెట్టి మరీ మస్టర్లు నమోదు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రం నుంచి మెటీరియల్ నిధులు రాబట్టుకునేందుకు ఈ దొంగ మస్టర్లు వేయించారు. దీంతో కూలీలకు పనులకు వెళ్లకపోయినా వేతనాలు దక్కాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదే సిబ్బంది కొనసాగుతుండడంతో.. ఇప్పుడు కూడా గతంలో చేసినట్లుగానే కూలీలు పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దొంగ మస్టర్లు వేయకపోతే సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. అప్పట్లో వేసిన మస్టర్లు ఇప్పుడు ఎందుకు వేయరంటూ నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో దొంగ మస్టర్లకు తావులేదని, పనులకొస్తేనే మస్టర్లు వేస్తామని కొంతమంది సిబ్బంది చెప్పినా.. వారిపై కూలీలు గొడవలకు దిగుతున్నారు. గ్రామంలో పనులు కల్పించలేదంటూ ఓ మహిళా ఏపీఓపై తిరుపతి జిల్లా కోట మండలంలో ఇటీవల దాడులకు దిగారు. దీంతో సిబ్బంది పాత తరహాలోనే మస్టర్లు పంథాను కొనసాగించాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓ వైపు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉపాధి హామీ పథకంలో లొసుగులు లేకుండా కట్టడి చేసేందుకు ఇప్పటికే సోషల్ ఆడిట్ డైరెక్టర్‌ను మార్చడంతో పాటు చీఫ్ విజిలెన్స్ అధికారిగా పోలీసుశాఖకు చెందిన అదనపు ఎస్పీని నియమించారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

బదిలీలతోనే దొంగ మస్టర్లకు చెక్

క్షేత్రస్థాయి సిబ్బందిని సమూలంగా బదిలీ చేస్తే తప్ప దొంగ మస్టర్లను అడ్డుకోలేమని అధికారులు అంటున్నారు. ఏపీడీలు,టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేసి.. కొత్త వారిని నియమించడం ద్వారా దొంగ మస్టర్ల నమోదును అరికట్టవచ్చని చెబుతున్నారు. దీంతో పాటు వైసీపీ హయాంలో జిల్లాలు దాటి ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సొంత జిల్లాకు వచ్చేందుకు అవకాశమివ్వాలని కోరుతున్నారు.

ఏడీసీఎల్‌కు స్వతంత్ర డైరెక్టర్ నియామకం

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్(ఏడీసీఎల్)కు స్వతంత్ర డైరెక్టర్‌గా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్‌ను నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

షర్మిల బదిలీపై 'స్టే' ఇవ్వండి

- ఎన్సీఎల్టీని కోరిన జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ
- మా అమ్మ నోటీసులు తీసుకోలేదు
- వేచి చూడాల్సిన అవసరం లేదు: జగన్
- కౌంటర్‌కు సమయమివ్వండి: విజయలక్ష్మి
- విచారణను డిసెంబరు 13కు వాయిదా వేసిన ట్రిబ్యునల్





హైదరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్'కు సంబంధించి తమ పేర్లతో ఉన్న ఈక్విటీ షేర్లు తల్లి విజయలక్ష్మి(మూడో ప్రతివాది) పేరిట జరిగిన బదిలీని కొట్టివేయాలని.. మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన భార్య భారతి, వారి కంపెనీ క్లాసిక్ రియాల్టీ తరఫు న్యాయవాదులు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్సీఎల్టీ)కు విన్నవించారు. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. 2019లో జరిగిన ఎంవోయూలో భాగంగా విజయలక్ష్మి పేరిట షేర్లు బదిలీ చేశామని.. ఈడీ, హైకోర్టులో ఉన్న కేసులు తేలే వరకు వాటిని ఆమె వేరేవారికి బదిలీ చేయడానికి వీల్లేదని పేర్కొన్నామని తెలిపారు. అయినప్పటికీ రెండో ప్రతివాది(వైఎస్ షర్మిల) పేరిట షేర్ల బదిలీకి ప్రయత్నిస్తున్నారని, ఈ నేపథ్యంలో బదిలీని కొట్టేస్తూ.. స్టే ఇవ్వాలని పేర్కొన్నారు. జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ గతంలోనే దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం ట్రిబ్యునల్‌లోని రాజీవ్ భరద్వాజ్, సంజయ్‌పురి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. జగన్, భారతి తరఫున న్యాయవాది స్పందిస్తూ.. ఈ కేసును అత్యవసర విచారణ కింద చేపట్టాలని కోరారు. మూడో ప్రతివాది విజయలక్ష్మికి నోటీసులు జారీ అయినప్పటికీ 'అన్‌క్లెయిమ్డ్' అని వచ్చిందని.. నోటీసులు తీసుకోవడానికి నిరాకరించారని పేర్కొన్నారు. నోటీసులు తీసుకోకపోయినా వారి తరఫున న్యాయవాది హాజరయ్యారని తెలిపారు. కాబట్టి నోటీసులు అందినట్లే భావించి మధ్యంతర పిటిషన్లపై విచారణ చేపట్టి వాదనలు వినాలని కోరారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుని.. ప్రధాన పిటిషన్, మధ్యంతర పిటిషన్‌లలో ఒకే విధమైన విజ్ఞప్తులు ఎందుకు చేశారని ప్రశ్నించింది. దీనికి వాదనల సందర్భంగా సమాధానం చెబుతామని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

సమయం కావాలి: విజయలక్ష్మి

మూడో ప్రతివాది విజయలక్ష్మి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో తాము మొదటిసారి హాజరవుతున్నామని, వకాల్తా, కౌంటర్ వేయడానికి సమయం కావాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రతివాదులు కౌంటర్‌లు దాఖలు చేయడానికి వీలుగా విచారణను జనవరికి వాయిదా వేస్తామని పేర్కొంది. మధ్యంతర ఉత్తర్వులపై అత్యవసరంగా వాదన వినాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో విచారణను డిసెంబరు 13కు వాయిదా పడింది.

జగన్ క్యాంపు ఆఫీసులో ఫర్నిచర్.. వైసీపీ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌ను వెనక్కి తీసుకెళ్లాలని, అందులో కొంద ఫర్నిచర్‌కు విలువ ఖరారు చేస్తే చెల్లిస్తామంటూ తాము చేసిన అభ్యర్థనపై సాధారణ పరిపాలనశాఖ అధికారులు స్పందించడంలేదని పేర్కొం టూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. వ్యాజ్యం వెరిఫికేషన్ కాలమ్‌లో వివరాలు తప్పుగా నమోదు చేశారన్నారు. అయితే, వ్యాజ్యానికి నంబర్ ఎలా ఇచ్చారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ప్రశ్నించారు. పిటిషనర్ అభ్యర్థన మేరకు వ్యాజ్యంలో వివరాలను సరిచేసుకొనేందుకు సమయం ఇస్తూ రెండు వారాలకు వాయిదా వేశారు.

ఎస్ఐఆర్‌డీ తిరిగి పీఆర్‌లో విలీనం

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ శిక్షణా సంస్థ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఐఆర్‌డీ)ను ఎట్టకేలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో విలీనం చేశారు. పంచాయతీరాజ్ శాఖలో అంతర్భాగమైన ఈ శిక్షణా సంస్థను గత ప్రభుత్వం సచివాలయాల శాఖలో విలీనం చేసింది. ఇక్కడ శిక్షణ పొందే స్థానికసంస్థల ప్రతినిధులు పంచాయతీరాజ్ చెందిన వారు కాగా, దానికి అవసరమైన నిధులు, అధికారులు పంచాయతీరాజ్ శాఖకు చెందిన వారు. దీంతో గత ఐదేళ్లలో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. ఆగస్టు 20న సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ఈ తప్పును దిద్దాలని ఆదేశించడంతో అధికారులు ఫైల్‌ను సీఎం కార్యాలయానికి పంపారు. ఆ ఫైల్ సీఎంవో నుంచి క్లియర్ అయి రాకపోవడంతో ఈనెలఒకటో తేదీన 'గ్రామీణ శిక్షణా సంస్థకు గ్రహణం వీడేనా?' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. సీఎంవో వెంటనే స్పందించి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోశుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

వర్రా ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. మంగళవారం అర్ధరాత్రి వర్రా కడపలో పోలీసులను ఏమార్చి తప్పించుకున్నాడు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కడప ఎస్పీని బదిలీ చేయడంతోపాటు... సీఐపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆ క్షణం నుంచే వర్రా కోసం వేట మొదలైంది. 'గ్రేట్ ఎస్కేప్' తర్వాత అతను బెంగళూరుకు చేరుకున్నట్టు పోలీసులు అనుమానించారు. కానీ... బెంగళూరు సేఫ్ కాదనే ఉద్దేశంతో శుక్రవారం వర్రా కారులో హైదరాబాద్‌కు బయలుదేరినట్లు తెలిసింది. కర్నూలు మీదుగా తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించాక... పోలీసులు వర్రాను అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం సాయంత్రం ప్రచారం జరిగింది. కానీ, పోలీసులు దీనిని ధ్రువీకరించలేదు.

త్రుటిలో తప్పించుకున్నాడు: డీఐజీ

వర్రా రవీంద్రా రెడ్డిని అరెస్టు చేయలేదని, అతని కోసం నాలుగు బృందాలతో గాలింపు కొనసాగుతోందని కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. "వర్రా కదలికలపై నిఘా పెట్టాం. అతను కర్నూలు దాటి హైదరాబాద్ వెళ్తున్నట్లుగా సెల్‌ఫోన్ సిగ్నల్ ద్వారా గుర్తించాం. అయితే... మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వరకు సెల్‌ఫోన్ సిగ్నల్ ట్రాక్ అయ్యింది. కొన్ని నిమిషాల్లో అరెస్టు చేయడం ఖాయమని భావించాం. కానీ... ఫోన్ ఆఫ్ చేయడంతో సిగ్నల్ కట్ అయింది. వర్రా రవీంద్రా రెడ్డి కోసం గాలిస్తున్నాం. త్వరలోనే అరెస్టు చేస్తాం" అని డీఐజీ స్పష్టం చేశారు. జడ్చర్ల సమీపంలో అతని ఫోన్ సిగ్నల్ మిస్ అయ్యిందని, అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాడో గుర్తించాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

బూతు, రోతల వర్రా

వర్రాపై రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల కేసులున్నాయి. శ్రుతిమించిన బూతు, రోత భాషతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటాడు. చివరికి... జగన్ సోదరి షర్మిలను, వివేకా కుమార్తె సునీతా రెడ్డినీ నీచంగా దూషించాడు. దీనిపై షర్మిల తీవ్ర ఆవేదన చెందారు. ఇక... సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితపై వర్రా దారుణమైన పోస్టులు పెట్టాడు. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వర్రాపై 2018లో విజయవాడ సిటీ, సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌లో 2 కేసులు, 2022లో తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో 2, పెదనందిపాడు, పొన్నూరు, మదనపల్లె, పోరుమామిళ్ల, రాజంపేట తదితర స్టేషన్లలోనూ అతనిపై కేసులు నమోదయ్యాయి.

'పట్టభద్రులు' భయపెడుతున్నారా?

- 2023 నాటి దెబ్బ గుర్తుండిపోయిందా..!
- అసెంబ్లీలో టీడీపీని గేలి చేసిన ఘటనలు మరిచిపోలేదా?
- అందుకే గ్రాడ్యుయేట్ ఎన్నికలకు, అసెంబ్లీకి జగన్ దూరం..!

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయం... 11 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాం' అంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన ప్రకటనపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తాను అధికారంలో ఉండగా ప్రతిపక్షం పట్ల వ్యవహరించిన తీరు జగన్‌కు బలంగా గుర్తుండిపోయిందనీ, రివర్స్ గేర్‌లో అదే అనుభవం తనకు ఎదురవుతుందన్న భయం ఆయనను వెంటాడుతోందని, అందుకే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదంటూ వైసీపీ అధినేత ప్రకటించారన్న విమర్శ బలంగా వినిపిస్తోంది. 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్న అహంకారంతో నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు వయస్సుకు కూడా గౌరవం ఇవ్వకుండా గేలి చేస్తూ మాట్లాడిన విషయాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కేవలం 11 మంది సభ్యులతో ప్రతిపక్షం హోదా కూడా లేకుండా ఓ మూల కూర్చోవలసిన పరిస్థితి. దీంతో అధికార పక్షాన్ని బలంగా ఎదుర్కోలేక పేలవమైన ప్రదర్శనతో మరింత బలహీనంగా కనిపిస్తామేమోనన్న భయం జగన్ వెంటాడుతోందనీ, అందుకనే సమావేశాలు జరుగుతున్నన్ని రోజులూ తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో తనకు అనుకూల బ్లూ మీడియాను మాత్రమే పిలిచి కాలక్షేపం చేయాలని జగన్ నిర్ణయించుకున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 2023 మార్చిలో మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వైసీపీ అధికారంలో ఉంది. ఆ సమయంలో బలీయంగానూ కనిపించింది. తెలుగుదేశం ఏమాత్రం పోటీ ఇవ్వలేదని సీఎంగా జగన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. వైసీపీ అంచనాలను, జగన్ ఊహలను తారుమారు చేస్తూ ఆ మూడు ఎమ్మెల్సీలనూ టీడీపీ చేజిక్కించుకుంది. వైసీపీ అభ్యర్థులు ముగ్గురూ ఓడిపోవడాన్ని జగన్ జీర్ణించుకోలేక పోయారు. వైసీపీ ముఖ్య నేతలు మాత్రం ఆ ఫలితాలపై భయాందోళనలు వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సమయంలో వచ్చిన ఆ ఫలితాలను నాటి మంత్రి బొత్స సత్యనారాయణ తక్కువ చేసి చూపే ప్రయత్నం చేశారు. 'వాళ్లు మా ఓటర్లు కాదు. వైసీపీకి వేరే ఓటర్లు ఉన్నారు' అంటూ వ్యాఖ్యానించారు. కాని, ఆ ఫలితాలే 2024 ఎన్నికల్లోనూ ప్రతిఫలించాయి. నాడు పట్టభద్రులు కొట్టిన దెబ్బతో జగన్‌కు బానే బొప్పి కట్టిందనీ, అందుకనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో వైసీపీ లేదని జగన్ తేల్చి చెప్పారని అంటున్నారు.

వరదలను ఎదుర్కొనే ప్రణాళికపై శిక్షణ

- నిర్వహించనున్న విపత్తు నిర్వహణ సంస్థ

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో వరద సమస్యను ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు అమలు చేయాల్సిన ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సన్నద్ధమైంది. ఈ మేరకు విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్, శాంతి భద్రతల ఏఐజీ సిద్దార్థ్ కౌశల్ శుక్రవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీ మూడో బెటాలియన్ డీఐజీ సీతారాం,ఎస్టీఎంఎ ఈడీ నాగరాజుతదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే రాజీనామా చేయాలి

జగన్, వైసీపీ ఎమ్మెల్యేలకు షర్మిల హితవు.. ఏపీలోనూ కుల గణన చేపట్టాలని డిమాండ్

మచిలీపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే రాజీనామా చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా శౌంరి నాగరాజు ప్రమాణస్వీకార కార్యక్రమం శుక్రవారం మచిలీపట్నంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. 'జగన్మోహన్‌రెడ్డి అయినా, ఆయన ఎమ్మెల్యేలైనా అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే రాజీనామా చేయాలి. ఏపీలోనూ కులగణన జరపాలి. బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే అన్ని రాజకీయ పార్టీలు చూస్తున్నాయి. బీసీ కులానికి చెందిన నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ఉండటం గర్వకారణమే. దేశంలో 70కోట్ల మందికిపైగా బీసీలే ఉన్నారు. బీసీనని చెప్పుకునే ప్రధాన మంత్రి ఇంతకాలంగా బీసీలకు ఏం చేశారు? అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని చెప్పిన బీజేపీ పాలకులు ఇంతవరకు కులగణన ఎందుకు చేయలేదు? బీసీలు ఎంతమంది ఉన్నారో తెలిస్తేనే వారికి మేలుచేసే అవకాశం ఉంటుంది. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో చంద్రబాబు బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదు. పది సూత్రాలతో బీసీల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ తయారుచేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. అయినా ఇంత వరకు ఎలాంటి కార్యక్రమాలు అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఒక్క గ్యాస్ సిలిండర్‌లు మాత్రమే ఇచ్చింది. జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో విద్యుత్ బిల్లుల పేరుతో రూ.35 వేల కోట్లను ప్రజలపై భారం వేస్తే, ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం రూ.17 వేల కోట్ల భారం వేసేందుకు సిద్ధమయింది. ఏపీలోనూ కుల గణన జరగాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది' అని షర్మిల అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

'భూ'చోళ్ల పనిపడతాం!

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేయించాలనుకున్నా వెనక్కి తగ్గినట్లు తెలిసింది. స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తేనే జగన్ ప్రభుత్వంలో జరిగిన భూ దందాల్లోని చీకటి కోణాలు బయటకు వస్తాయని సర్కారు భావిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వానికి అందిన ఫిర్యాదులు, జిల్లాల నుంచి వచ్చే రికార్డుల పునఃపరిశీలన నివేదికల ఆధారంగా విచారణను ఎవరికి అప్పగించాలన్నది నిర్ణయిస్తుందని తెలిసింది. ప్రభుత్వం ఇప్పటికే అసైన్డ్, చుక్కల భూములు, షరతుగల పట్టాలు, ఇనామ్ భూముల రికార్డులపై పునఃపరిశీలన చేయిస్తోంది. ఈ నెల 17 నాటికి ఈ కార్యక్రమం పూర్తిచేయాలని రెవెన్యూ శాఖకు లక్ష్యాన్ని నిర్దేశించింది. జిల్లాల వారీగా వచ్చే నివేదికల ఆధారంగా అక్రమాలు, భూ కబ్జాలపై స్పష్టత వస్తుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 18 మంది డిప్యూటీ కలెక్టర్లపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు తెలిసింది. అందులో ఇప్పటికే ఇద్దరిని 'మదనపల్లె ఫైల్స్' విషయంలో సస్పెండ్ చేశారు. మరో 12 మందిపై తీవ్ర అభియోగాలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసినప్పుడు వాటిని అడ్డుకునేందుకు సరిగా చర్యలు తీసుకోకపోవడం... ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా కోర్టులు తీర్పులు ఇచ్చినప్పుడు తిరిగి అప్పీలు చేయకపోవడం... ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన రెవెన్యూ రికార్డులను ఆర్కైవ్స్‌లో ఉన్న వాటితో సరిపోల్చకుండా అవే సరైనవని నిర్ధారించడం వంటి తీవ్రమైన తప్పిదాలకు పాల్పడినవారు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఓ అధికారి గతంలో విశాఖ జిల్లా భీమిలిలో తహసీల్దార్‌గా పనిచేశారు. ఆ సమయంలో 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారు. కోర్టులో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అది ప్రభుత్వ భూమి అని నిరూపించే ఆధారాలు, డాక్యుమెంట్లు ఉన్నా వాటిని ప్రభుత్వం తరఫున కేసు వాదించిన న్యాయవాదికి అందించలేదని తాజాగా గుర్తించారు. అంతేగాక హైకోర్టులో అప్పీల్ చేసే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారని తేల్చారు. ఈ కేసులో ఆ అధికారిని కాపాడేందుకు కడప వైసీపీ నేత గత ప్రభుత్వంలో శతవిధాలా ప్రయత్నాలు చేశారు.

వైసీపీ నేతలతో కుమ్మక్కు

విజయనగరం, విశాఖపట్నం, కడప, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు జిల్లాల పరిధిలో గతంలో తహసీల్దార్లుగా పని చేసినవారు కొందరు (ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందారు) విలువైన భూములను వైసీపీ నేతలు స్వాహా చేసేలా మంత్రాంగం నడిపారు. ఇలాంటి వారికి సంబంధించిన అక్రమాల చిట్టాను సిద్ధం చేశారు. ఆర్డీవోలుగా పనిచేస్తూ వైసీపీ నేతలతో కుమ్మక్కై విలువైన ప్రభుత్వ భూములను పరాధీనం చే యించిన అధికారులు మరికొందరు ఉన్నారు. ఇప్పటికే వీరందరి అక్రమాల చిట్టాను సిద్ధం చేశారు. రికార్డుల పునఃపరిశీలన పూర్తి కాగానే ఫిర్యాదులు, అభియోగాలున్న వారిపై విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. భూముల సర్వే అనంతరం రూపొందించిన రికార్డుల తయారీలోనూ భారీ గోల్‌మాల్ జరిగింది. ఇందులోనూ అధికారుల పాత్ర ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ప్రధానంగా 50 మంది సర్వేయర్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. భూముల విస్తీర్ణం, సర్వే నంబర్, సబ్ డివిజన్ నంబర్లను నిర్ధారించడం, వాటిని రికార్డుల్లో నమోదు చేసే విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేశారని, కొందరు డబ్బులు డిమాండ్ చేశారన్న ఫిర్యాదులు వచ్చాయి. మరో 18 మందిపై భూముల కొలతలకు డబ్బు డిమాండ్ చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి.

రీ సర్వే పేరిట భూమంతర్

రాష్ట్రంలో 2019కు ముందు అనేక భూ వివాదాలు ఉన్నాయి. అవి న్యాయస్థానాల్లో, రెవెన్యూ అధికారుల స్థాయిలో పరిష్కరించగలిగినవి. 2019లో జగన్ భూముల సర్వే మొదలు పెట్టిన తర్వాత వచ్చిన భూ వివాదాలు, సమస్యలు రైతులను కల్లోలానికి గురిచేశాయి. అంతవరకు రైతులకు లేని భూ సమస్యలను బలవంతంగా రుద్దారు. సర్వే సరిహద్దుల చట్టం ప్రకారం భూములు సర్వే చేయాలి. రైతులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో కొలతలు వేయాలి. కానీ జగన్, ఆయన అనుంగ అధికారులు చేసిన హడావుడితో నిబంధనలను బేఖాతర్ చేశారు. అత్యధిక చోట్ల ఆఫీసుల్లో కూర్చొనే సర్వేలు చేసినట్లుగా రికార్డులు రూపొందించారు. దీంతో పాటు విలువైన ప్రైవేటు, ప్రభుత్వ భూములపై కన్నేసిన నేతలు అధికారులను ప్రలోభపెట్టి తమకు అనుకూలంగా రికార్డులను మార్చుకున్నారు. తమకు రాజకీయంగా ప్రత్యర్థులుగా ఉన్న వారి భూములు, ఇంకా నోరు లేని పేదల భూములను తమ పేరిట రికార్డుల్లోకి ఎక్కించుకున్నారు. ఇలా ఈ ఒక్క అంశంపైనే దాదాపు రెండున్నర లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వ భూములను ప్రైవేటుగా చూపిస్తూ రికార్డులను తారుమారు చేశారు. ఈ కోణంలో 65 వేల ఫిర్యాదులు అందాయి. నాటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భూముల సర్వేను శాసించారు. కొన్నిచోట్ల విదేశాల్లో స్థిరపడ్డ వారి భూముల రికార్డులను కూడా తారుమారు చేయించారు. దీంతో బాధితులు వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతల చుట్టూ తిరిగి డబ్బులు ముట్టచెప్పి సెటిల్‌మెంట్ చేసుకున్నారు. రీ సర్వే అనంతరం 38 రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూముల విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రైవేటు భూముల రికార్డులు తారుమారు అయ్యాయన్న ఫిర్యాదులు వచ్చాయి. వీటిని నాటి తహసీల్దార్లు, ఆర్డీవోలు బుట్టదాఖలు చేశారు. కొలతలు వేయడం, అనంతరం భూముల స్కెచ్‌లు రూపొందించడంలో సర్వేయర్లు, తహసీల్దార్లు ప్రైవేటు పార్టీలతో కుమ్మక్కయ్యారన్న ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు అందాయి.

అడ్డగోలుగా భూములు స్వాహా

అసైన్డ్, షరతుగల పట్టా, ఇనామ్, గ్రామకంఠం భూములపై నాడు వైసీపీ నేతలు కన్నేశారు. వాటిని కాజేసేందుకు ప్రభుత్వ పెద్దలతో మంత్రాంగం నడిపించారు. అప్పటి వరకు ఉన్న సెటిల్‌మెంట్ నిబంధనలను సులభతరం చేయించారు. సులభతర పరిష్కారం పేరిట మార్గదర్శకాలు జారీ చేయించారు. ఆ తర్వాత తహసీల్దార్, ఆర్డీవోలతో కుమ్మక్కై విలువైన అసైన్డ్, ఇనామ్, గ్రామకంఠం, చుక్కల భూములను వైసీపీ నేతలు హస్తగతం చేసుకున్నారు. ఈ వ్యవహారాల్లో తహసీల్దార్, ఆర్డీవోలు కీలకపాత్ర పోషించినట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో విడుదల చేసిన శ్వేతపత్రంలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సులభతరం పేరిట ఇచ్చిన మార్గదర్శకాలే విలువైన భూములు చేజారడానికి కారణం అయ్యాయని పేర్కొంది. ఇలాంటి మార్గదర్శకాలను అడ్డం పెట్టుకొని కొందరు ఆర్డీవోలు, తహసీల్దార్లు ఖరీదైన చుక్కల భూములు, గ్రామకంఠం భూములను వైసీపీ నేతలకు దోచి పెట్టారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భూ అక్రమాల్లో వైసీపీ నేతలతో పాటు రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ప్రభుత్వం గుర్తించింది.

జగన్ బంధువులకు లబ్ధి

ఉమ్మడి కడప జిల్లాలో నాటి ముఖ్యమంత్రి జగన్ బంధువులు, అస్మదీయుల నియంత్రణ లో ఉన్న చుక్కల భూముల దరఖాస్తులను నాటి కడప ఆర్డీవో, తహసీల్దార్ సెటిల్ చేశారు. ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ దందా జరిగింది. భూ వినియోగ మార్పిడి చేయకుండా నేరుగా లే అవుట్‌లు వేసి భూములను విక్రయించేశారు. దీనిపై ప్రజాందోళనలు పెల్లుబికినా నాటి ప్రభుత్వం తొక్కిపెట్టింది.

ఇవీ తీవ్ర ఆరోపణలు

- వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు సహకరించినట్టు 18 మంది డిప్యూటీ కలెక్టర్లు, 46 మంది తహసీల్దార్లు, 68 మంది సర్వేయర్లపై ఫిర్యాదులు
- ఓ డిప్యూటీ కలెక్టర్ గతంలో విశాఖ జిల్లా భీమిలి తహసీల్దార్‌గా పనిచేసినపుడు 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల కబ్జా
- వైసీపీ నేతలు అధికారులను ప్రలోభపెట్టి తమకు అనుకూలంగా రికార్డులను మార్చుకోవడం, ఇతర భూములను రికార్డుల్లో ఎక్కించుకున్నట్టుగా 2.50 లక్షల ఫిర్యాదులు వచ్చాయి
- విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటుగా చూపిస్తూ అధికారులు రికార్డులను తారుమారు చేసినట్టు 65 వేల ఫిర్యాదులు అందాయి
- రీ సర్వే అనంతరం 38 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ప్రభుత్వ భూముల విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రైవేటు భూముల రికార్డులు తారుమారు

సీఎం చంద్రబాబుపై అసభ్య పోస్టులు

అనంతపురం జిల్లాలో వైసీపీ కార్యకర్త అరెస్ట్



అనంతపురం క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తదితరులపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్తను పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామానికి చెందిన జింకల రామాంజినేయులును ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అతనికి కోర్టు ఈ నెల 21 వరకు రిమాండ్ విధించింది. టీడీపీ ఆత్మకూరు మండలం కన్వీనర్ గంతి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు రామాంజినేయులుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సిబ్బందిని కేటాయించండి

- తిరుపతిలో ఆఫీసు, వాహనాలు కావాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి 'లడ్డూ సిట్' వినతి
- ఈ నెలాఖరు నుంచి దర్యాప్తు ప్రారంభం

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)- తమకు తగిన సిబ్బంది, తిరుపతిలో కార్యాలయం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. వాహనాలు కూడా సమకూర్చాలని విన్నవించింది. ఇద్దరు సీబీఐ, ఇద్దరు ఏపీ పోలీస్, మరో ఫుడ్ సేఫ్టీ అధికారితో కలిపి ఐదుగురితో ఈ సిట్ ఏర్పాటైంది. సీబీఐ హైదరాబాద్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు నేతృత్వంలోని ఈ బృందంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, విశాఖపట్నం సీబీఐ ఎస్పీ మురళి, ఫుడ్ సేఫ్టీ అథారిటీ నుంచి డాక్టర్ సత్యకుమార్ పాండా ఉన్నారు. కొన్ని రోజుల కిందట భేటీ అయిన బృందం ప్రాథమికంగా అందుబాటులో ఉన్న ఫైళ్లను పరిశీలించి దర్యాప్తు ఎలా చేయాలనే విషయంపై ఓ ప్రణాళిక రూపొందించుకుంది. డీఎస్పీ స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు, ఇతర సహాయ సిబ్బందితో కలిపి 35 మంది అవసరమని నిర్ధారించుకుంది. తిరుపతి లేదా మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా కార్యాలయాన్ని కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో త్వరలోనే సిబ్బందితో పాటు తిరుపతిలో సిట్ కోసం కార్యాలయం, అవసరమైన వాహనాలు కేటాయించే అవకాశం ఉంది. ఈ నెలాఖరు నుంచి పూర్తి స్థాయిలో దర్యాప్తు ప్రారంభమవుతుందని సిట్ సభ్యుల్లో ఒకరు తెలిపారు. పకడ్బందీగా దర్యాప్తు చేసి ఆధారాలతో సహా సీబీఐ డైరెక్టర్ ద్వారా సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

మూడు రోజుల సీఐడీ కస్టడీకి విద్యాసాగర్

బెయిల్ పిటిషన్‌పై విచారణ 11కి వాయిదా

విజయవాడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను సీఐడీ కస్టడీకి ఇస్తూ విజయవాడ మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. విద్యాసాగర్ నుంచి మరిన్ని విషయాలు రాబట్టడానికి వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన న్యాయాధికారి తిరుమలరావు ఈ నెల 10 నుంచి 12 వరకు కస్టడీకి అనుమతించారు. న్యాయవాది సమక్షంలో విచారించాలని, విచారణ మొత్తం వీడియో చిత్రీకరణ చేయాలని స్పష్టం చేశారు. కాగా, తనకు బెయిల్ మంజూరు చేయాలని విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. బెయిల్ ఇవ్వొద్దని సీఐడీ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. ఈ విచారణలో బాధితురాలు జెత్వానీ ఇంప్లీడ్ అయ్యారు.

బడ్జెట్‌పై ఆర్థికశాఖ కసరత్తు

ఉన్నతాధికారులతో మంత్రి పయ్యావుల కేశవ్ భేటీ

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ 2024-25 రూపకల్పనపై చర్చించేందుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నతాధికారులతో సచివాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈనెల 11న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. గత ఆర్థిక సంవత్సరంలో అప్పులతో కలిపి ఖజానాకు రూ.1.74 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ ఆదాయం తగ్గిపోయినా ఆదాయం రూ.2 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తోంది. కేంద్రం ఇప్పటికే రాష్ట్రానికి రూ.54,000 కోట్ల అప్పులకు అనుమతిచ్చింది. మరో విడత అప్పులకు కేంద్రం అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.

అంధుడి పొలాన్ని వైసీపీ నేతలు కబ్జా చేశారు

టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ నిర్వహించిన ప్రజావేదికలో పలు సమస్యలపై బాధితులు మొరపెట్టుకున్నారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గురుమూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వైసీపీకి అనుకూలంగా ఐప్యాక్‌లో పని చేసిన తన మరిది- ఇప్పుడు తన కాపురంలో చిచ్చుపెట్టి, తన భర్తను దూరం చేసే ప్రయత్నం చేస్తున్నాడని, తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని బాపట్ల జిల్లాకు చెందిన ఓ వివాహిత కన్నీంటి పర్యంతమయ్యారు. అదనపు కట్నం కోసం అత్తమామలు చిత్రహింసలు పెడుతున్నారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని రామచంద్రాపురం డొంక నుం చి గుంటూరు చానల్ వరకు 300 మీటర్ల పైపు లైన్ పని గత ప్రభుత్వంలో మంజూరవ్వగా, ఈ గ్రామస్థులు వైసీపీకి ఓట్లు వేయలేదన్న కక్షతో పని జరగకుండా అప్పటి వైసీపీ ఎమ్మెల్యే అడ్డుకున్నారని తక్కెళ్లపాడుకు చెందిన ఎన్.బసవయ్య ఫిర్యాదు చేశారు. నిలిచిపోయిన పైపులైన్ పనులు పూర్తి చేయాలని కోరారు. 'గుడ్డి నాకొడకా.. నీకెందుకురా పొలం' అని తిడుతూ తన పొలానికి బోగస్ పత్రాలు సృష్టించి, వైసీపీ నాయకులు కబ్జా చేశారని, అధికారులకు లంచాలిచ్చి, పాసుపుస్తకాలు తెచ్చుకున్నారని మార్కాపురానికి చెందిన బోయపాటి వెంకటరామయ్య అనే అంధుడు ఫిర్యాదు చేశారు. వాస్తవాలు విచారించి, తనకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల ట్రస్ట్ బోర్డుల్లో తమ సామాజిక వర్గానికి స్థానం కల్పించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు విజ్ఞప్తి చేశారు.


సద్దుమణిగిన 'నెల్లిమర్ల' పంచాయితీ!

టీడీపీ, జనసేన నేతలతో అగ్ర నాయకుల చర్చలు

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి నేతల మధ్య విభేదాలను తొలగించేందుకు టీడీపీ, జనసేన నేతలు నడుంబిగించారు. పిఠాపురంతో పాటు నెల్లిమర్ల, దెందులూరు నియోజకవర్గాలు సహా చిత్తూరు జిల్లాలో తలెత్తిన వివాదాలను పరిష్కరించాలని ఇటీవల అగ్రనేతలు నిర్ణయించారు. నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి, టీడీపీ ఇన్‌చార్జి బంగార్రాజును అమరావతికి పిలిపించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమన్వయంతో పనిచేస్తున్నారని.. వారిని ఆదర్శంగా తీసుకుని పని చేసుకోవాలని హితవు పలికారు. వివాదాలపై బహిరంగంగా మాట్లాడవద్దని సూచించారు. టీడీపీ, జనసేన మైత్రి రాబోయే పదేళ్లు ఉంటుందన్నారు.

డేటా అనుసంధానంతో మెరుగైన పౌర సేవలు

- అన్ని శాఖల సమాచారం ఒకే ప్లాట్‌ఫాం మీదకు
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు
- నెలాఖరులోగా వాట్సప్ ద్వారా 100 పౌర సేవలు: మంత్రి లోకేశ్





అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరులందరి సమగ్ర సమాచారాన్ని అనుసంధానం చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు వారికి చేరేలా మెరుగైన సేవలు అందించాలని ఆర్టీజీఎస్ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. అలాగే పుట్టిన ప్రతి బిడ్డకూ ఆధార్ అందించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి అవసరమైన విధానాలపై కసరత్తు చేయాలని సూచించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో రియల్ టైమ్ గవరెన్స్‌పై ఐటీ, మానవ వనరులు, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో కలసి ఆయన సమీక్షించారు. ప్రభుత్వానికి రియల్ టైమ్ గవర్నెన్స్ ప్రధాన డేటా వనరుగా ఉండాలని, అన్ని శాఖల సమాచారాన్ని ఒకే ప్లాట్‌ఫాం మీదకు తీసుకువచ్చి అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను డేటా ద్వారా నిరంతరం విశ్లేషించాలని సూచించారు. జనన, మరణ, నివాసం, ఆదాయం, విద్యార్హత వంటి పత్రాల కోసం ప్రజలు ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడమేంటని నిలదీశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా వాట్సప్ ద్వారా 100 పౌర సేవలను అందుబాటులోకి తెస్తున్నామని ప్రకటించారు. మరో 90 రోజుల్లో క్యూఆర్ కోడ్ ద్వారా విద్యార్హత పత్రాలను విద్యార్థులు పొందే వీలుంటుందని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. దీనిపై రాష్ట్రంలో విస్తృత ప్రచారం ద్వారా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వాట్సప్ ద్వారా పౌర సేవలు అందుబాటులోకి వస్తే ప్రజలు ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని సీఎం తెలిపారు. డేటా అనుసంధానం వల్ల పారదర్శకత పెరుగుతుందని, పాలనలోనూ, పథకాల్లోనూ వేగంతో పాటు అవినీతికి ఆస్కారం ఉండదని చెప్పారు. ఈ దిశగా డేటా ఇంటిగ్రేషన్ పనులు వేగవంతం కావాలని ఆదేశించారు. డేటా సెంటర్ నిర్వహిస్తున్న ఇంటిగ్రేషన్ పనుల గురించి ఆర్టీజీ శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, సీఈవో దినేశ్‌కుమార్ వివరించారు. ప్రభుత్వంలో ఉన్న 40 శాఖలకు చెందిన 128 మంది విభాగాధిపతులు, 178 డేటా ఫీల్డ్‌ల వద్ద 500 టీబీల డేటా అందుబాటులో ఉందని తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి సంబంధించిన డేటా అందుబాటులో లేదని, దానిని కూడా సమీకరిస్తున్నామని అధికారులు వివరించారు. ఈ డేటాను సత్వరమే సమీకరించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తల్లీచెల్లిని తిట్టినా స్పందించవా?

- జగన్‌కు మంత్రి అచ్చెన్న సూటి ప్రశ్న
- తమకు అసెంబ్లీలో మైకు ఇవ్వకున్నా ప్రజల తరఫున పోరాడామని వెల్లడి
- ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం కోసం మాజీ సీఎం యాగీ చేస్తున్నారని ఆగ్రహం



శ్రీకాకుళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): "జగన్.. తన సొంత తల్లి, చెల్లిపై సోషల్ మీడియాలో నీచమైన పోస్టులు పెట్టినా స్పందించలేదేం?" అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. శుక్రవారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో ఆయన ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "సోషల్‌మీడియాలో గత ఐదేళ్లు వైసీపీ బ్యాచ్ రెచ్చిపోయింది. మహిళల వ్యక్తిత్వాన్ని హరిస్తూ అత్యంత దారుణంగా పోస్టులు పెట్టారు. మేం అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్నాం. జగన్ తల్లిపైనా, తోబుట్టువుపైనా విమర్శలు చేస్తూ పోస్టులు పెట్టారు. అప్పట్లో నువ్వెందుకు స్పందించలేదు? ఎవరికైనా తమ తల్లీ, చెల్లిని విమర్శిస్తే పౌరుషం వస్తుంది. జగన్‌కు మాత్రం రాలేదు. గత ఐదేళ్లు వైసీపీ వాళ్లు ఎవరినీ వదల్లేదు. అందరిపై కేసులు పెట్టి జైళ్లలో వేశారు. పైశాచిక ఆనందం పొందారు. అయితే, మా నాయకుడు(సీఎం చంద్రబాబు) కక్ష సాధింపు చర్యలకు అంగీకరించరు. అందుకే ఈ ఐదుమాసాలు ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్లాం. అలాగని తప్పుచేసిన వారిని విడిచిపెట్టకుండా న్యాయపరంగానే వెళ్తున్నాం. ఎక్కడా కక్ష సాధింపులకు పాల్పడలేదు. గత ఐదు రోజుల నుంచి దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్టు జగన్ గగ్గోలు పెడుతున్నారు. వాక్ స్వాతంత్ర్యం లేదంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక ఎక్కడైనా సభలు, సమావేశాలు.. పర్యటనల కోసం చెట్లు కొట్టామా? ఎక్కడైనా ప్రజలను ఇబ్బందిపెట్టామా? కానీ, అప్పట్లో మీరు ఎవరినైనా వదిలారా? సోషల్‌మీడియాలో ప్రశ్నించినందుకు ఎంతోమంది మహిళలపైనా కేసులుపెట్టి ఇబ్బందులకు గురిచేశారు. 80 ఏళ్ల వృద్ధుడిని పోలీసులు తరలిస్తుండగా మృతిచెందారు. అలాంటిది ఇప్పుడు మీకు భావ స్వేచ్ఛ గుర్తుకొచ్చిందా? ఇప్పటికీ భావ ప్రకటన అంటూ చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ సహా.. వారి పిల్లలుపైనా అసభ్యకరమైన పదజాలంతో ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతూనే ఉన్నారు. నీ తల్లిపైనే పోస్టులు పెట్టారు. అయినా నువ్వు స్పందించలేదు. కూటమి పాలనలో ఎవరైనాసరే మహిళలపై వ్యక్తిగతంగా, అసభ్యకరంగా.. కించపరిచేలా పోస్టులు పెడితే వారికి అదే చివరిరోజు" అని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

మైకు ఇవ్వకపోయినా వచ్చాం

గత ఐదేళ్లలో తమకు అసెంబ్లీలో మైకు ఇవ్వకపోయినా ప్రజల తరఫున పోరాడామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. "గత ఐదేళ్లలో టీడీపీకి 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ మాకు మైకు ఇవ్వలేదు. అయినా ప్రజల తరఫున పోరాడి మా డ్యూటీ మేం చేశాం. నిన్నటి నుంచీ ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ గొంతు చించుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో ఓ పద్ధతి ఉంటుంది. తగినంతమంది ఎమ్మెల్యేలు ఉంటేనే ప్రధాన ప్రతిపక్ష హోదా వర్తిస్తుంది. ఈ విషయం నీకు తెలుసుకదా? నీకు అధికారం ఉంటేనే అసెంబ్లీకి వెళ్తావా? లేకుంటే వెళ్లవా? ఇప్పటి నుంచే మైండ్‌గేమ్ ఆడుతున్నావు. పూర్వంలా మేం లేము. ప్రజల్ని చైతన్య పరుస్తున్నాం" అని జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

అప్పుల 'మామయ్య'!

(మొదటి పేజీ తరువాయి)

భయపెట్టి వసూలు చేశాయి. 2023-24 విద్యా సంవత్సరంలో కేవలం ఒక్క క్వార్టర్ ఫీజులు ఇచ్చి, మూడు క్వార్టర్ల ఫీజులను గత ప్రభుత్వం బకాయి పెట్టింది. దాదాపు రూ.2,100 కోట్లు చెల్లించలేదు. అంతేగాక విద్యార్థుల హాస్టల్ ఖర్చుల కోసం ఇచ్చే వసతి దీవెన నగదు కూడా ఆపేసింది. దీంతో విద్యార్థులే సొంతంగా హాస్టల్ ఖర్చులు చెల్లించుకున్నారు. మొత్తంగా ఉన్నత విద్యలో జగన్ సర్కారు రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టింది. గతేడాది ఫైనలియర్ చదివిన విద్యార్థులు సొంత డబ్బులు కట్టి సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఫీజులు కట్టే స్తోమత లేనివారు ఇప్పటికీ సర్టిఫికెట్లు తీసుకోలేదు.

అప్పులతోనే విద్యా కానుక

గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు బ్యాగులు, బెల్టులు, బూట్లు ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే ఏ సంవత్సరం కూడా కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. 2023-24 విద్యా సంవత్సరంలో కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. వాస్తవానికి కాంట్రాక్టర్లకు మేలు చేయాలనే ఉద్దేశంతో టెండర్లు లేకుండా నేరుగా కాంట్రాక్టులు కట్టబెట్టింది. ఈ క్రమంలో ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే కిట్లు కొనుగోలు చేశారు. ఆ మొత్తం దాదాపు రూ.920 కోట్లు కాగా ఇప్పటి వరకూ రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పుడు పిలవబోయే టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకొస్తారా? లేదా? అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇక విద్యార్థుల తల్లిదండ్రులకు ఇస్తామన్న యూనిఫాం కుట్టుకూలిని కూడా బకాయి పెట్టిన ఘనత మాజీ సీఎం జగన్‌ది. అది కూడా గత మూడేళ్లు ఒక్క విద్యార్థి యూనిఫాంకు కూడా కుట్టుకూలి విడుదల చేయలేదు. ఏటా రూ.65 కోట్ల చొప్పున రూ.195 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ ఏటా కుట్టుకూలి కూడా ఇస్తున్నామంటూ కిట్లు పంపిణీ చేసే సమయంలో జగన్ అబద్ధాలు ప్రచారం చేశారు.

ఇలాగేనా గోరుముద్ద?

పాఠశాల విద్యార్థులకు జగన్ గోరుముద్దలు తినిపిస్తున్నారంటూ గత ప్రభుత్వంలో బాగా ప్రచారం చేసుకున్నారు. కానీ ఈ పథకానికి అవసరమైన నిధులు మాత్రం సకాలంలో విడుదల చేయలేదు. గుడ్ల సరఫరా చేసినవారికి రూ.112 కోట్లు, చిక్కీలకు రూ.66 కోట్లు... మొత్తంగా రూ.178 కోట్లు బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో బిల్లులు ఇవ్వకపోతే గుడ్లు సరఫరా చేయబోమంటూ కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేశారు. ఆరా తీస్తే గత ప్రభుత్వం పెట్టిన బకాయిల కారణంగానే ఈ దుస్థితి వచ్చిందని తేలింది. విచిత్రం ఏంటంటే.. బ్లాక్‌మెయిల్ చేసిన కాంట్రాక్టర్లు టెండర్లు లేకుండానే కాంట్రాక్టు దక్కించుకున్నారు.

విద్యార్థుల సొమ్ముతో జగన్ సభలు

కొసమెరుపు ఏంటంటే.. గత ప్రభుత్వంలో విద్యార్థులకు చెల్లించాల్సినవి సకాలంలో ఇవ్వకపోగా విద్యార్థులు కట్టిన పరీక్షల ఫీజుల నుంచి జగన్ సభలకు ప్రభుత్వం డబ్బులు తీసుకుంది. నాడు విజయనగరంలో విద్యా దీవెన సభ నిర్వహణకు డబ్బుల్లేవని అప్పటి కలెక్టర్ లేఖ రాయడంతో ఆగమేఘాలపై ఉన్నత విద్యామండలి నుంచి రూ.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అలాగే విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసే కార్యక్రమం తెనాలిలో ఏర్పాటు చేయగా బిల్లులు ఇవ్వట్లేదని ఈవెంట్ మేనేజర్లు ముందుకు రాలేదు. దీంతో వెంటనే ఇంటర్ బోర్డు నుంచి అర్ధరాత్రి రూ.25 లక్షలు అప్పుగా తీసుకుని వారికి చెల్లించారు. పేరుకు మాత్రమే అప్పు కానీ తిరిగి చెల్లించలేదు. స్వయంగా సీఎం సభలకు వాడటంతో అధికారులు ఈ అప్పులను తిరిగి అడిగే ధైర్యం చేయలేదు.





విజయవాడ భవానీ ద్వీపం.. ప్రకాశం బ్యారేజీ మీదుగా ఎగురుతున్న సీప్లేన్



శ్రీశైలం చేరుకున్న సీప్లేన్



జల విహారానికి రెక్కలు!

- సీప్లేన్లతో పర్యాటక రంగానికి సరికొత్త ఊపు
- హెలీ టూరిజంలో... సీప్లేన్లదే ఆధిపత్యం
- అభివృద్ధి చెందిన దేశాల్లో మంచి ఆదరణ
- ట్రయల్ రన్ అనంతరం రెగ్యులర్ సర్వీసులు
- అందుబాటులోకొస్తే పర్యాటక రంగానికి బూస్ట్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

హెలీ టూరిజం కేటగిరీలో సీప్లేన్‌లదే ఆధిపత్యం. ఇవి ఉభయచర విమానాలు కావడంతో అభివృద్ధి చెందిన దేశాల్లో వీటికి ఆదరణ ఎక్కువ. ద్వీప దేశాలు హెలీ టూరిజంలో భాగంగా ఎక్కువగా ఈ సీ ప్లేన్లను ఉపయోగిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ అమరావతి రాజధాని, విజయవాడ నగరాల మధ్య సరిహద్దుగా ఉన్న కృష్ణా నదిలో దాదాపు ఏడు దీవులు ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది భవానీ ద్వీపం. విభజన అనంతరం.. పర్యాటక రంగం ద్వారా ప్రపంచం దృష్టిని తన వైపు తిప్పుకోవాలని ఏపీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడ, అమరావతి నగరాలను పర్యాటకంగా ముందు వరుసలో నిలబెట్టేందుకు సీప్లేన్ కాన్సెప్ట్‌ను పరిచయం చేయాలని నిర్ణయించింది. నదీ తీరంలో సుదూర ప్రాంతాలను జలమార్గాల ద్వారా త్వరగా చేరుకోవటానికి సీప్లేన్‌లు దోహదపడతాయి. విజయవాడ నుంచి శ్రీశైలం వరకు 260 కిలోమీటర్లు రోడ్డు మార్గాన వెళ్లాలంటే ఐదారు గంటలు పడుతుంది. అదే సీ ప్లేన్‌లో రెండున్నర గంటల్లోనే చేరుకోవచ్చు. పర్యాటకంగా అభివృద్ధి చెందిన దేశాలు సీప్లేన్ సర్వీసులను విజయవతంగా నిర్వహిస్తున్నాయి. మాల్దీవులు, హవాయి, అలాస్కా (అమెరికా), కెనడా, కరీబియన్ దీవులు, థాయ్‌లాండ్, ఇండోనేసియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలలో సీ ప్లేన్ కాన్సెప్ట్ సూపర్ సక్సెస్ అయింది.

భారత్‌లో 15 ఏళ్ల క్రితమే...

భారత్‌లోనూ సీప్లేన్ సర్వీసుల కోసం 15 ఏళ్ల నుంచీ ప్రయత్నాలు జరుగుతున్నా.. పూర్తిస్థాయిలో విజయవంతం కావడం లేదు. గుజరాత్‌లోని వడోదరలో, ముంబైలో సీ ప్లేన్ సర్వీసులు అట్టహాసంగానే ప్రారంభమయ్యాయి కానీ.. ఆ తర్వాత ఆదరణ లేక వాటిని నిలిపివేయాల్సి వచ్చింది. చివరగా కేరళలోనూ సీ ప్లేన్ సర్వీసులు ప్రవేశపెట్టినా అక్కడా వైఫల్యమే ఎదురైంది. దీనికి అనేక కారణాలున్నాయి. ముఖ్యంగా సాధారణ విమానాలతో పోలిస్తే ఈ సీప్లేన్ల నిర్వహణ భారం ఎక్కువగా ఉంటుంది. తక్కువ సీటింగ్ సామర్థ్యం ఉండే సీ ప్లేన్లలో టికెట్ ధరలు ఎక్కువగా ఉంటాయి. భారత్‌లో టికెట్ ధరలు ఎక్కువగా ఉంటే వర్కవుట్ కాదు. ధర ఎక్కువైతే విదేశీ పర్యాటకులు తప్ప స్థానికులు వాటిపై పెద్దగా ఆసక్తి చూపించరు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం వయబిలిటీతో నడిపితే తప్ప.. విమానయాన సంస్థలు వీటిని నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ సీప్లేన్ సర్వీసులు విదేశీయులను విపరీతంగా ఆకర్షించగలిగితే వాటిని విజయవంతంగా నడపవచ్చు. దానికి చాలా సమయం పడుతుంది కాబట్టి అప్పటివరకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాల్సి ఉంటుంది.

> పర్యాటక రంగంలో జలవిహారానిది ప్రత్యేక స్థానం.. అలాంటి జల విహారానికి కొత్త రెక్కలు తొడిగి 'సీ ప్లేన్' సర్వీసులను అందుబాటులోకి తెస్తే.. పర్యాటకులకు మధురానుభూతిని అందించవచ్చు..! పర్యాటకానికీ ఆదరణ పెంచవచ్చు. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సీ ప్లేన్' కాన్సెప్ట్ దిశగా తొలి అడుగు వేస్తోంది. అమరావతి రాజధాని చెంతన కృష్ణానదీ తీరాన విజయవాడ నుంచి శ్రీశైలం మధ్య ప్రయోగాత్మకంగా సీ ప్లేన్ సర్వీసులకు శ్రీకారం చుడుతోంది. శనివారం నిర్వహించే ట్రయల్ రన్ విజయవంతమైతే త్వరలోనే సీప్లేన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఆదరణ పెరిగితే మరింత విస్తరణ..

సీప్లేన్ సర్వీసులకు సంబంధించి శుక్రవారం విజయవాడలో సెమీ ట్రయల్ రన్ నిర్వహించారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు డెమో లాంచ్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత సాధ్యాసాధ్యాలను పరిశీలించి శాశ్వత ప్రాతిపదికన ఈ సేవలు అందుబాటులోకి తీసుకొస్తారు. తొలుత విజయవాడ-శ్రీశైలం మధ్య ప్రారంభించి ఆ తర్వాత మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే మిగిలిన రాష్ట్రాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. పర్యాటకులు, భక్తులను గమ్యస్థానాలను చేరవేసే సర్వీస్‌లాగా కాకుండా ఆతిథ్య రంగంలోని వ్యాపారాభివృద్ధికి కూడా దీన్ని వినియోగించుకునే దిశగా అడుగులు వేయాలి. మన దగ్గర లగ్జరీ హోటల్స్, రిసార్ట్స్ ఎన్నో ఉన్నాయి. వారు ఈ సీప్లేన్ నిర్వాహకులతో భాగస్వామ్యమై ఒకరికి ఒకరు ప్రమోట్ చేసుకోవడం వల్ల సీప్లేన్‌లకు మరింత ఆదరణ దక్కే అవకాశం ఉంటుంది. జలమార్గంలో అడ్వెంచర్స్ చేయాలని భావించేవారు బృందంగా ఏర్పడి నిర్వాహకులతో మాట్లాడుకుని తక్కువ ప్యాకేజీలతో ట్రిప్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రకృతి ప్రేమికులను, హనీమూన్ కపుల్స్‌ను ఆకర్షించేలా ప్రత్యేక ప్యాకేజీలు ఏర్పాటు చేస్తే సీప్లేన్ సర్వీసులకు ఆదరణ దక్కే అవకాశం ఉంటుంది. మన పర్యాటక రంగం కూడా కొత్తమలుపు తిరుగుతుంది. శనివారం ట్రయల్ రన్ తర్వాత సీప్లేన్స్ షెడ్యూల్స్, బుకింగ్ విధానం, ధర తదితర వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

జలాలపై జాలీగా..



శ్రీశైలంలోని పాతాళగంగ వద్ద సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీప్లేన్ ల్యాండయ్యే ప్రదేశం, పాతాళగంగ బోటింగ్ ప్రదేశం నుంచి రోప్‌వేను పరిశీలించారు. 523 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు 10 స్పెషల్ పార్టీలు, నాలుగు గ్రేహౌండ్స్ బృందాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు.

48 గంటల్లో అల్పపీడనం

విశాఖపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తరువాత 48 గంటల్లో తమిళనాడు, శ్రీలంక తీరం దిశగా పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం రాయలసీమ, కోస్తాల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 11 నుంచి 13 వరకు రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది.

హమ్మయ్య... నా బండి దొరికేసింది!

- భావోద్వేగంతో మహిళ కన్నీరు.. వీడియో వైరల్.. స్పందించిన సీఎం

ఏలూరు క్రైం/అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన ద్విచక్రవాహనం తిరిగి దొరకడంతో ఓ మహిళ భావోద్వేగంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఏలూరులోని నీలి అలివేణికి చెందిన ద్విచక్ర వాహనం గత నెల 23న రాత్రి అపహరణకు గురైంది. వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల దొంగతనాలకు గురైన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో అలివేణి బండి కూడా ఉంది. సంతోషంతో స్టేషన్‌కు వెళ్లిన అలివేణి తన వాహనాన్ని ప్రేమగా నిమురుతూ ఒక్కసారిగా ఏడ్చేశారు. ఈ దృశ్యాన్ని అక్కడున్నవారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఈ వీడియో సీఎం చంద్రబాబు దృష్టిలో పడటంతో ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. తలసేమియాతో బాధపడుతున్న కుమార్తెను ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి ఉపయోగించే వాహనం చోరీకి గురవడంతో అలివేణి తీవ్ర ఆవేదన చెందారని, ఆ వాహనం దొరికినప్పుడు ఆమె అనుభవించిన భావోద్వేగాలు తనను కలచి వేశాయని సీఎం పేర్కొన్నారు. పోలీసులు ఆధునిక సాంకేతికతతో కేసును ఛేదించారని ట్వీట్ చేశారు.



వాహనాన్ని చూసుకుని అలివేణి భావోద్వేగం



ఆకలి రుచి ఎరగదు. నిద్ర సుఖం ఎరగదు అంటారు. కొందరికి పరుపులున్నా నిద్ర పట్టదు. పగలంతా కష్టపడిన పేదలకు మాత్రం ఎక్కడ పడుకున్నా ఇట్టే నిద్ర పట్టేస్తుంది. గుంటూరులో డివైడర్‌పై ఆదమరచి నిద్రిస్తున్న నిరుపేదలను చిత్రంలో చూడొచ్చు.

- ఆంధ్రజ్యోతి, గుంటూరు

గ్రామాల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు

(మొదటి పేజీ తరువాయి)

కలిపి మొత్తం 60 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. టీచర్ల నియామకాలకు, పదోన్నతులకు ఒకే విద్యార్హత ఉండేలా చూడాలని సంఘాలు కోరగా సానుకూలంగా స్పందించారు. జీవో 117కు ప్రత్యామ్నాయంపై నెలాఖరుకు తుది నిర్ణయానికి వస్తామని, దానిని వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తామని స్పష్టం చేశారు. బదిలీలపై కేటగిరీలను ముందుగానే ప్రకటిస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రేషనలైజేషన్, బదిలీలు, పదోన్నతులు, డీఎస్సీ కూడా పూర్తి చేస్తామన్నారు. హైస్కూల్ ప్లస్‌లో టీచర్ల కొరత ఉంటే సర్దుబాటు చేస్తామన్నారు. రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ కార్యక్రమాలు రద్దుచేయాలని సంఘాలు కోరగా, దీనిపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

20 మంది డీఎస్పీలకు బదిలీ, పోస్టింగ్స్

- హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని నందిగామ డీఎస్పీకి ఆదేశం

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇరవై మంది డీఎస్పీ, సబ్ డివిజనల్ స్థాయి పోలీసు అధికారులకు పోస్టింగ్స్ లభించాయి. ఐదు సబ్ డివిజన్లతో పాటు స్పెషల్ బ్రాంచి, సీఐడీ, మహిళా పోలీసు విభాగాలకు పదిహేను మందిని బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీవీ అప్పారావు(కాశీబుగ్గ), ఏబీజీ తిలక్(నందిగామ), పి. మల్లికార్జునరావు(గుంటూరు సౌత్), పి. శ్రీనివాస రెడ్డి(నంద్యాల), మహమ్మద్ మొయిన్(చీరాల), కె. వెంకటేశ్వర రావు(జమ్మలమడుగు)లను సబ్ డివిజనల్ పోలీసు అధికారులుగా నియమించారు. జి. సీతారామారావు(శ్రీకాకుళం), బి.రామకృష్ణ(రాజమండ్రి), ఎన్.సురేశ్ బాబు(ప్రకాశం), ఆర్. వాసుదేవన్(కడప) స్పెషల్ బ్రాంచి డీఎస్పీలుగా పోస్టింగ్స్ దక్కించుకున్నారు. మిగతా వారికి ఉమెన్ పీఎస్, సీఐడీ, సీసీఎస్‌లలో పోస్టింగ్స్ ఇచ్చిన డీజీపీ తిరుమల రావు నందిగామ డీఎస్పీగా పనిచేస్తున్న డాక్టర్ రవికిరణ్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఆయన్ను ఆదేశించారు. వైసీపీ హయాంలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన డీఎస్పీలతో పాటు నిరీక్షణలో ఉన్న మరికొందరు పోస్టింగ్స్ కోసం ఎదురు చూస్తున్నారు.

విజయ్‌పాల్ బెయిల్‌పై విచారణ 25కు వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై కస్టోడియల్ విచారణ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ నిందితుడు ఆర్ విజయ్‌పాల్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డిపై రఘురామ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ 2021లో సీఐడీ కేసు నమోదు చేసింది. హైదరాబాద్ నుంచి తనను బలవంతంగా గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించి.. కస్టడీలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొంటూ రఘురామ ఈ ఏడాది జూలై 11న గుంటూరు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి అప్పటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్, నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ విజయ్‌పాల్ హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో ఆయన అక్టోబరు 1న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. గత విచారణ సందర్భంగా అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం దీనిపై శుక్రవారం మరోసారి విచారణ చేపట్టగా.. కోర్టు ఆదేశాల మేరకు కౌంటర్ దాఖలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. అయితే.. ఆ కౌంటర్ తమకు ఒకరోజు ముందే (గురువారం) అందిందని, వివరణ ఇచ్చేందుకు తమకు కొంత సమయం కావాలని విజయ్‌పాల్ తరఫు న్యాయవాదులు కోరారు. రెండు వారాల సమయం మాత్రమే ఇస్తున్నామని తెలిపిన ధర్మాసనం.. ఈ నెల 25న తుది విచారణ చేపడతామని స్పష్టం చేసింది.

ప్రాజెక్టులకు 10,170 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించగా.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ సంవత్సరంలో మిగిలిన ఐదు నెలలకు 10 వేల కోట్లతో సరిపెట్టుకోవాలని సూచించింది. 2025-26 బడ్జెట్‌లో ఎక్కువ కేటాయిస్తామంది. 2019-24 మధ్య జగన్ సర్కారు ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించడంతో రూ.38,242 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో పడిపోయాయి. తాజా బడ్జెట్‌లో ఆ నిధులు విడుదల చేయాలని జల వనరుల శాఖ ప్రతిపాదనలు పంపింది. అయితే, ఐదు నెలలకు తగినట్లుగా నిధులు కోరాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. దీం తో వ్యయాలను తగ్గించుకుని రూ.18,480 కోట్లతో జల వనరుల శాఖ తుది ప్రతిపాదనలు పంపింది. పోలవరం ప్రాజెక్టుకు సింహభాగం నిధులు కోరింది. కాలువల నిర్మాణానికి రూ.488.21 కోట్లు, ప్రధాన పనులకు రూ.3,716.92 కోట్లు, భూసేకరణ-పునరావాసానికి రూ.4,964.60 కోట్లు, ఇతర పద్దుల కింద రూ.2.14 కోట్లు మొత్తంగా రూ.9,171.77 కోట్లు అడిగింది. అదేవిధంగా హంద్రీ-నీవా కాలువల కోసం రూ.1,437.06 కోట్లు, నిర్మాణ పనుల కోసం రూ.799.38 కోట్లు, భూసేకరణకు రూ.219 కోట్లు.. అన్నీ కలిపి 2,455 కోట్లు ప్రతిపాదించింది. గాలేరు-నగరికి రూ.4,083 కోట్లు, తెలుగుగంగ-874 కోట్లు గోదావరి-పెన్నా అనుసంధాన ప్రక్రియ-350 కోట్లు, చింతలపూడి ఎత్తిపోతల-258 కోట్లు, వెలిగొండ ప్రాజెక్టు-1,310 కోట్లు, వంశధార-210 కోట్లు, ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు రూ.644 కోట్లు కోరింది. అయితే.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రూ.10,170 కోట్లు ఇచ్చేందుకు ఆర్థికశాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఐదు నెలల కాలానికి అవసరమైన మేర ప్రాధాన్య క్రమంలో ఖర్చుపెట్టుకోవాలని.. 2025-26 సంవత్సరంలో పూర్తి స్థాయిలో కేటాయింపులు జరుపుతామని తెలిపింది. సోమవారం (11న) అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తుది కేటాయింపులు ఎలా ఉంటాయో చూడాలి.

మాజీ ఎమ్మెల్యే వంశీపై కోర్టులో కేసు

నూజివీడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ 2019-24 మధ్య బాపులపాడు మండలంలో నకిలీ పట్టాలు పంపిణీ చేశారని సూర్యనారాయణ అనే వ్యక్తి నూజివీడు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను స్వీకరించిన నూజివీడు కోర్టు మొత్తం 40 మందిని విచారించి గురువారం ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని గుర్తించి, కేసును స్వీకరించింది.

'అక్రమ నిర్బంధం' కేసులు పెరిగాయ్

- చట్టనిబంధనలపై అవగాహన కల్పించండి
- పోలీసులను చైతన్యవంతం చేయండి
- అడ్వకేట్ జనరల్‌కు హైకోర్టు సూచన
- పోలీసులు చట్టనిబంధనలు అనుసరిస్తున్నారు
- ధర్మాసనానికి నివేదించిన ఏజీ దమ్మాలపాటి

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 'అక్రమ నిర్బంధం' ఆరోపణలతో ఇటీవల కాలంలో కేసులు పెరిగిపోతున్నాయని, చట్ట నిబంధనలపై పోలీసులను చైతన్యవంతం చేయాలని అడ్వకేట్ జనరల్‌కు హైకోర్టు సూచించింది. అక్రమ నిర్బంధాలపై ఇన్ని పిటిషన్లు ఎందుకు దాఖలవుతున్నాయని ప్రశ్నించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం హెబియస్ కార్పస్ పిటిషన్ల విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. దీనికి ముందు అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటివారు బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111 ప్రకారం సైబర్ నేరాల నిర్వచనం పరిధిలోకి వస్తారన్నారు. సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) (బీఎన్ఎస్ఎస్ చట్టం సెక్షన్ 35(3) కింద వీరికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. పోలీసులు చట్టనిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నారని వివరించారు. పోలీసులు చట్టనిబంధనలు అనుసరించడంలేదని, రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని పిటిషనర్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

విషయం ఇదీ..

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చడంతో పాటు సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రితో పాటువారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో కొందరు అసభ్యకర పోస్టులు పెట్టారు. ఈ నేపథ్యంలో వైసీపీ సానుభూతిపరులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, వారిని కోర్టు ముందు హాజరు పరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పలు హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన వెంటనే ఈ వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ధర్మాసనాన్ని అభ్యర్థించారు. దీంతో ఆయా వ్యాజ్యాలను లంచ్ మోషన్‌గా స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది. అడ్వకేట్ జనరల్ హాజరయ్యేలా చూడాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. దీంతో అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి ధర్మాసనం ముందు హాజరయ్యారు. సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారని, అయినప్పటికీ వీరి విషయంలో పోలీసులు చట్టనిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నారని తెలిపారు. విశాఖపట్నానికి చెందిన తిరుపతి లోకేశ్ అనే వ్యక్తి తరఫున న్యాయవాది సి. సుమన్ వాదనలు వినిపిస్తూ.. 'వైఎస్ఆర్ కుటుంబం' అనే సోషల్ మీడియా గ్రూప్‌కి చెందిన 411 మందికి పోలీసులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. వీరిలో 120 మంది ప్రస్తుతం విజయవాడ సైబర్ పోలీసుల ముందు హాజరయ్యారన్నారు. లోకేశ్‌ను ఈ నెల 5న పోలీసులు విశాఖపట్నం నుంచి విజయవాడకు తరలించారని, అప్పటి నుంచి అక్రమంగా నిర్బంధించారని వివరించారు. లోకేశ్ సోదరుడుని పిలిపించి తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలని పోలీసులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి స్పందిస్తూ.. న్యాయవాది తన కేసు వరకే పరిమితమవ్వాలన్నారు. కోర్టులో రాజకీయ ప్రకటనలు చేయడం సరికాదని సూచించారు. న్యాయవాది మౌఖిక ఆరోపణలు చేయకుండా అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచితే.. అన్నింటికీ సమాధానం ఇస్తామని చెప్పారు. తిరుపతి లోకేశ్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చి వదిలేశారన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుని.. నిందితుడు లోకేశ్ విశాఖ నుంచి విజయవాడకు ఎలా వచ్చారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి. విష్ణుతేజను ఆరా తీసింది. వివరాలు సమర్పించేందుకు ఎస్‌జీపీ సమయం కోరడంతో కోర్టుకు హాజరైన విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ జానకిరామయ్యను వివరాలు కోరింది. సీఐ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతున్నారన్న ఫిర్యాదుతో లోకేశ్‌కు ఫోన్ చేసి పిలిచామన్నారు. దీంతో లోకేశ్, ఆయన బావ విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసుల ఎదుట హాజరయ్యారని, ఈ నెల 7న నోటీసులు ఇచ్చి పంపించామని చెప్పారు. ఈ నెల 8న నిందితుడు బెయిల్ బాండ్ కూడా సమర్పించారని తెలిపారు. ప్రస్తుతం తిరుపతి లోకేశ్ ఎక్కడ ఉన్నారో తెలియదన్నారు. ఈ వివరాలను రికార్డు చేసిన ధర్మాసనం.. నిందితుడు లోకేశ్‌ను సోమవారం కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించింది. ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి నుంచి 8వ తేదీ వరకు విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను సీల్డ్ కవర్‌లో విజయవాడ మేజిస్ట్రేట్‌కు ఇవ్వాలని ఆదేశించింది.



మా జోక్యం తప్పదు

ప్రస్తుత పిటిషన్లపై కేసుల లోతుల్లోకి వెళ్లి విచారణ జరపడంలేదని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఇది వ్యక్తుల స్వేచ్ఛతో ముడిపడిన వ్యవహారమని, పోలీసులు చట్టనిబంధనలు అనుసరించేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపింది. నిందితులను అరెస్టు చేసిన 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకుంటే తాము జోక్యం చేసుకుంటామని పేర్కొంది. ఈ మేరకు హైకోరు ధర్మాసనం స్పష్టం చేసింది.

అనంతపురంలో..

అనంతపురం జిల్లా, మదిగుబ్బ గ్రామం, ఆత్మకూరు మండలం చెందిన జింకల రామాంజనేయులను ఇటుకలపల్లి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ మరో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది టి. విష్ణుతేజ స్పందిస్తూ.. రామాంజనేయులను అరెస్ట్ చేసి శుక్రవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఈ నెల 4న రామాంజనేయులను పోలీసులు తీసుకెళ్లారన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ నెల 4వతేదీ అర్ధరాత్రి నుంచి 8వ తేదీ వరకు ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను సోమవారానికి వాయిదా వేసింది. మరికొన్ని వ్యాజ్యాలపై విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

కోరలు పీకండి!

(మొదటి పేజీ తరువాయి)

'సైకో ఫ్యాక్టరీ' గుట్టు రట్టు అవుతుండడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా ఏదోఒక రూపంలో అలజడి సృష్టించాలని వైసీపీ ప్రణాళిక రచిస్తున్నట్లు గుర్తించామని చెప్పినట్లు తెలిసింది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సోషల్ మీడియా ప్రతినిధుల అరెస్టులపై యాగీ సృష్టించేందుకు వైసీపీ సిద్ధమవుతోందని గుర్తించామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ కేసుల్లో అరెస్టయిన, నోటీసులు అందుకున్న కుటుంబాల్లోని మహిళలు, అందులోనూ దళిత మహిళలను రోడ్డెక్కించే పథక రచన చేస్తున్నారని... వారిని రెచ్చగొట్టడం, నిరసనల పేరుతో వంటిపై కిరోసిన్ పోసుకునేలా చేయడం వంటి చర్యలకు పురిగొల్పడం, అభిమానులను ఆత్మహత్యలకు ప్రేరేపించడం వంటి కుట్రలు అమలు చేసే అవకాశముందని వివరించారు.

వారి పని పడుతున్నాం...

సోషల్ మీడియాలో విషం చిమ్ముతున్న వారి పని పడుతున్నామని, ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నామని, అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు సీఎంకు తెలిపారు. "ఇది ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా రూపాంతరం చెందింది. మూలాలు గుర్తించాం. శాఖోపశాఖలుగా విస్తరించిన విషవృక్షాన్ని వీలైనంత త్వరలో కూకటివేళ్లతో పెకలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కుటుంబాల్లోని మహిళలతోపాటు హోంశాఖ మంత్రిపై అసభ్యకరమైన పోస్టులు సృష్టిస్తున్న తీరు, వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్న వైనం గురించి తెలిపారు. దీనిపై చట్ట పరిధిలో తాము తీసుకుంటున్న చర్యలను నివేదించారు. ఇలాంటి శక్తులను ఉపేక్షిస్తే రాష్ట్రానికి ముప్పు తప్పదని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు సమాచారం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దని స్పష్టంగా ఆదేశించారు. దీంతో అవసరమైతే కేంద్ర బలగాలను కూడా రప్పించేందుకు పోలీసు ఉన్నతాధికారులు సిద్ధం అవుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.